www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 20-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 65 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి ఉ. 7.50 తదుపరి చతుర్దశి; నక్షత్రం: అనూరాధ సా. 6.10 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: రా. 11.48-1.24; దుర్ముహూర్తం: ఉ. 10.06-10.58, మ. 3.19-4.11; అమృతఘడియలు: ఉ. 7.25-9.04; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 5.45; సూర్యాస్తమయం: 6.47 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




ఒమేగా హాస్పిటల్స్‌లోకి రూ.500 కోట్ల పెట్టుబడులు

- మోర్గాన్ స్టాన్లీ పీఈ ఏషియా ఫండ్ నుంచి సమీకరణ
- తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్త విస్తరణ కోసం నిధుల వినియోగం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మోర్గాన్ స్టాన్లీ ప్రైవేట్ ఈక్విటీ ఏషియా నిర్వహణలోని ఫండ్ నుంచి రూ.500 కోట్లు సమీకరించినట్లు హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ప్రైవేట్ లిమిటెడ్ (ఒమేగా హాస్పిటల్స్) బుధవారం ప్రకటించింది. ఒమేగా హాస్పిటల్స్‌లోకి ఇదే తొలి ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మరిన్ని ఆసుపత్రుల ఏర్పాటుతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా దేశం అంతటా విస్తరించేందుకు ఈ నిధులను వినియోగించుకోనున్నట్లు సంస్థ తెలిపింది. అలాగే దక్షిణాదిలో మరింత బలపడటానికి కూడా ఈ పెట్టుబడులు దోహదపడతాయని ఒమేగా హాస్పిటల్స్ పేర్కొంది.

గడిచిన కొన్నేళ్లలో దేశంలో క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయని, ఈ వ్యాధిగ్రస్తులకు అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో పూర్తి స్థాయి వైద్య సేవలందించడమే తమ లక్ష్యమని ఒమేగా హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మోహన్ వంశీ అన్నారు. ఈ లక్ష్యం దిశగా మా ప్రయాణాన్ని మరింత వేగవంతం చేసేందుకు మోర్గాన్ స్టాన్లీ పీఈ ఏషియాతో భాగస్వామ్యం తోడ్పడనుందన్నారు. మరికొన్నేళ్లలో ఒమేగా హాస్పిటల్స్‌ను దేశంలోనే అతిపెద్ద క్యాన్సర్ కేర్ హాస్పిటళ్ల నెట్‌వర్క్‌గా అభివృద్ధి చేయాలనుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుత ఆసుపత్రులను మరింత విస్తరించడంతోపాటు మరిన్ని కొత్త హాస్పిటళ్ల ఏర్పాటుకు ఈ నిధులు ఉపయోగపడనున్నాయని ఒమేగా హాస్పిటల్స్ సీఈఓ డాక్టర్ నమ్రత అన్నారు.

గడిచిన ఏడాది కాలంలో భారత క్యాన్సర్ కేర్ హాస్పిటల్స్ నెట్‌వర్క్‌లో తమకిది రెండో పెట్టుబడి అని మోర్గాన్ స్టాన్లీ పీఈ ఏషియా ఎండీ అర్జున్ సైగల్ తెలిపారు. డాక్టర్ మోహన్ వంశీ, డాక్టర్ నమ్రత నేతృత్వంలో ఒమేగా హాస్పిటల్స్ మెరుగైన వృద్ధి అవకాశాలను కలిగి ఉందన్నారు.



రెండో పెద్ద క్యాన్సర్ కేర్ ఆస్పత్రి

క్యాన్సర్ బారిన పడిన వారికి పూర్తి స్థాయి సేవలందించేందుకు ప్రముఖ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ మోహన్ వంశీ నేతృత్వంలో ఒమేగా హాస్పిటల్స్ 2010 జూలైలో ప్రారంభమైంది. ప్రస్తుతం 10కి పైగా ఆస్పత్రులు, 1,400కు పైగా పడకల సామర్థ్యం కలిగిన ఒమేగా హాస్పిటల్స్ దేశంలోనే రెండో అతిపెద్ద క్యాన్సర్ కేర్ హాస్పిటల్స్ నెట్‌వర్క్‌గా ఉంది. గత ఏడాది ఫిబ్రవరిలో ఒమేగా హాస్పిటల్స్. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో 450 పడకల సామర్థ్యం, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో కూడిన మల్టీ కేర్ సూపర్ స్పెషాలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌తో పాటు గుంటూరు, వైజాగ్, కర్నూలు, భీమవరం, కరీంనగర్‌లోనూ సంస్థ ఆస్పత్రులను నిర్వహిస్తోంది. అంతేకాదు, మధ్యప్రదేశ్‌కు చెందిన జబల్‌పూర్, ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌కు సైతం విస్తరించింది.

స్విస్ కంపెనీ చేతికి కోటక్ జనరల్

- 70 శాతం వాటా రూ.5,560 కోట్లకు కొనుగోలు
- జూరిక్ కోటక్ ఇన్సూరెన్స్‌గా పేరు మార్పు

న్యూఢిల్లీ: కోటక్ మహీంద్రా జనరల్ ఇన్సూరెన్స్‌లో (కోటక్ జనరల్) మెజారిటీ వాటా కొనుగోలు ప్రక్రియ పూర్తయిందని స్విట్జర్లాండ్‌కు చెందిన జూరిక్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ తెలిపింది. కోటక్ జనరల్‌లో 70 శాతం వాటాను రూ.5,560 కోట్లకు జూరిక్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేసింది. ఈ ఒప్పందానికి సంబంధిత నియంత్రణ మండలుల అనుమతులు లభించడంతో కోటక్ జనరల్ టేకోవర్ ప్రక్రియను జూరిక్ ఇన్సూరెన్స్ పూర్తి చేసిందని కోటక్ మహీంద్రా బ్యాంక్ బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం అందించింది.

కోటక్ బ్యాంక్ సాధారణ బీమా వ్యాపార విభాగమే కోటక్ జనరల్. వాటా కొనుగోలు పూర్తయిన నేపథ్యంలో కంపెనీ పేరును జూరిక్ కోటక్ జనరల్ ఇన్సూరెన్స్‌గా మార్చారు. భారత సాధారణ బీమా రంగంలోకి ఇప్పటివరకు వచ్చిన అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ) ఇదే. అంతేకాదు, 2021లో జనరల్ ఇన్సూరెన్స్ విభాగంలో ఎఫ్‌డీఐ పరిమితిని 49 శాతం నుంచి 74 శాతానికి పెంచాక వచ్చిన తొలి విదేశీ పెట్టుబడి కూడా ఇదే. కోటక్ జనరల్‌లో మెజారిటీ వాటా కొనుగోలు చేస్తున్నట్లు జూరిక్ ఇన్సూరెన్స్ గత ఏడాది నవంబరులో ప్రకటించింది.

పునరుత్పాదక ఇంధన వనరులపై
అదానీ ఫోకస్
వచ్చే పదేళ్లలో రూ.8.34 లక్షల కోట్ల పెట్టుబడి



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ పునరుత్పాదక, ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై పెద్ద ఎత్తున దృష్టి పెడుతోంది. ఇందుకోసం వచ్చే పదేళ్లలో 10,000 కోట్ల డాలర్లకు (సుమారు రూ.8.34 లక్షల కోట్లు) పైగా పెట్టుబడులు పెట్టనుంది. క్రిసిల్ నిర్వహించిన ఒక సదస్సులో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతం అదానీ ఈ విషయం వెల్లడించారు. హరిత ఇంధన ఉత్పత్తికి అవసరమైన యంత్రాల తయారీతో పాటు, వాటి నుంచి విద్యుత్ ఉత్పత్తి వరకు ఈ పెట్టుబడుల్లో భాగమన్నారు. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ప్యానల్స్, టర్బైన్లు, హరిత ఉదజని తయారీకి అవసరమైన ఎలక్ట్రోలైజర్లనూ అదానీ గ్రూప్ తయారు చేయనుంది.

'లక్ష' కోట్ల డాలర్ల అవకాశం: పునరుత్పాదక, ప్రత్యామ్నాయ ఇంధన ప్రాజెక్టులతో పాటు డిజిటల్ మౌలిక సదుపాయాల్లో కీలకమైన డేటా కేంద్రాలపైనా ప్రత్యేక దృష్టి పెడుతున్నట్టు అదానీ తెలిపారు. ఈ రెండు రంగాల్లోనే దేశంలో లక్ష కోట్ల డాలర్లకు పైగా వ్యాపార అవకాశం ఉందన్నారు. పునరుత్పాదక, ప్రత్యామ్నాయ ఇంధన ప్రాజెక్టుల్లో భాగంగా గుజరాత్‌లోని కచ్ జిల్లాలో 30,000 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో ప్రపంచంలోనే అతి పెద్ద పార్కు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే తమ పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యం 2030 నాటికి 50,000 మెగావాట్లకు చేరుతుందన్నారు.

స్టార్టప్స్ కోసం రామ్‌ఇన్ఫో ఇన్నోవేషన్ సెంటర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : స్టార్టప్స్ కోసం ప్రత్యేకంగా ఇన్నోవేషన్ సెంటర్లను ప్రారంభించినట్లు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న రామ్‌ఇన్ఫో లిమిటెడ్ ప్రకటించింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో ఒకటి, అమెరికాలో రెండు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు కంపెనీ ఎండీ ఎల్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు సాఫ్ట్‌వేర్ సర్వీసులు అందిస్తూ వస్తున్న తమ కంపెనీ 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కొత్త విభాగాల్లోకి ప్రవేశించిందని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా సరికొత్త టెక్నాలజీలైన కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ సర్వీసెస్‌లోకి ప్రవేశించినట్లు తెలిపారు. కాగా స్టార్టప్‌ల కోసం ఏర్పాటు చేసిన ఇన్నోవేషన్ సెంటర్ల ద్వారా వారికి అవసరమైన తోడ్పాటును అందించనున్నట్లు శ్రీనాథ్ వెల్లడించారు. టెక్నాలజీపరమైన అంశాలతో పాటు ఫైనాన్సింగ్, మార్కెటింగ్ వంటి సేవలను ఆఫర్ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే కొన్ని స్టార్టప్స్‌కు ఈ తరహా సేవలను అందించామన్నారు. అమెరికాలో ఏర్పాటు చేసిన సెంటర్ల కోసం అక్కడి ప్రముఖ యూనివర్సిటీలతో జట్టు కట్టినట్లు చెప్పారు. కాగా కంపెనీ దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాల్లో ప్రభుత్వ, ఫిన్‌టెక్, హెల్త్‌టెక్, అనలిటిక్స్, ఇంజనీరింగ్ సర్వీసెస్‌ల్లో సేవలందిస్తోందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ-సేవ, మీ-సేవ, సువిధ వంటి సర్వీసులను రామ్‌ఇన్ఫో అందిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.1,100 కోట్ల రెవెన్యూను ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

గ్లాండ్ ఫార్మాలో 6 శాతం వాటా విక్రయించిన ఫోసున్ ఫార్మా

న్యూఢిల్లీ: గ్లాండ్ ఫార్మాలో 6 శాతం వాటాలను ప్రమోటింగ్ కంపెనీల్లో ఒకటైన ఫోసున్ ఫార్మా విక్రయించింది. ఓపెన్ మార్కెట్ ద్వారా జరిగిన ఈ లావాదేవీ విలువ రూ.1754 కోట్లు. చైనాకు చెందిన ఫోసున్ ఫార్మా హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న గ్లాండ్ ఫార్మాలో తన అనుబంధ సంస్థ ఫోసున్ ఫార్మా ఇండస్ట్రియల్ పిటీఈ ద్వారా ఈ బల్క్ డీల్ నిర్వహించినట్టు బీఎస్ఈకి పంపిన నివేదికలో తెలిపింది. ఈ డీల్‌లో భాగంగా 6 శాతం వాటాతో సమానమైన 99 లక్షల షేర్లను ఒక్కో షేరు రూ.1771.81 సగటు ధరకు విక్రయించినట్టు పేర్కొంది. ఈ విక్రయం అనంతరం గ్లాండ్ ఫార్మాలో ఫోసున్ ఫార్మా వాటా 51.86 శాతానికి తగ్గింది. మరోపక్క, గ్లాండ్ ఫార్మాలో యూబీఎస్ ప్రిన్సిపల్ కేపిటల్ ఏషియా 8.25 లక్షల షేర్లను (0.5 శాతం) కొనుగోలు చేసింది. ఒక్కో షేరు రూ.1771.05 సగటు ధరకు కొనుగోలు చేయగా మొత్తం డీల్ విలువ రూ.146.11 కోట్లయింది.

సెన్సెక్స్ కొత్త రికార్డు

ముంబై: తీవ్ర ఆటుపోట్లతో సాగిన ట్రేడింగ్‌లో బుధవారం సెన్సెక్స్ మరో జీవితకాల గరిష్ఠ స్థాయిలో ముగియగా నిఫ్టీ మాత్రం ఆల్‌టైమ్ హై నుంచి దిగజారింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్, యంత్రపరికరాలు, ఎనర్జీ షేర్లలో లాభాల స్వీకారం మార్కెట్ లాభాలను కుదింపచేసింది. వరుసగా ఐదో సెషన్‌లో కూడా లాభపడిన సెన్సెక్స్ ఇంట్రాడేలో 550.49 పాయింట్ల లాభంతో జీవితకాల గరిష్ఠస్థాయి 77851.63 పాయింట్లకు దూసుకుపోయినా చివరికి 36.45 పాయింట్లకే లాభం పరిమితం చేసుకుని మరో రికార్డు స్థాయి 77337.59 వద్ద ముగిసింది. అలాగే నిఫ్టీ ఇంట్రాడేలో 106.10 పాయింట్ల లాభంతో జీవితకాల గరిష్ఠ స్థాయి 23664 పాయింట్లను తాకినా చివరికి లాభాన్ని 41.90 పాయింట్లకే పరిమితం చేసుకుని 23516 వద్ద ముగిసింది.

ఇండస్ టవర్స్‌లో 18 శాతం వాటాలు విక్రయించిన వొడాఫోన్: వొడాఫోన్ బుధవారం ఇండస్ టవర్స్‌లో 18 శాతం వాటాలను 170 కోట్ల యూరోలకు (రూ.15,300 కోట్లు) విక్రయించింది. దేశంలో వొడాఫోన్ ఆస్తులు తాకట్టు పెట్టి తీసుకున్న 180 కోట్ల విలువ గల బ్యాంకు రుణాల చెల్లింపునకు ఈ విక్రయం ద్వారా సమకూరిన నిధుల్లో అధిక శాతం వినియోగిస్తుంది. యాక్సిలరేటెడ్ బుక్ బిల్ట్ విధానంలో ఇండస్ ఇండ్‌లో 48.47 కోట్ల వాటాలు విక్రయించినట్టు కంపెనీ ప్రకటించింది.

వడ్డీ ఆదాయంపై పన్ను భారం తగ్గించాలి

ఎస్‌బీఐ చైర్మన్

న్యూఢిల్లీ: కనీసం వచ్చే కేంద్ర బడ్జెట్‌లోనైనా వడ్డీ ఆదాయంపై పన్ను భారం తగ్గించాలని ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ ఖారా కోరారు. అపుడు డిపాజిట్లు పెరిగి, బ్యాంకులు ప్రాజెక్టులకు దీర్ఘకాలిక రుణాలు ఇవ్వగలుగుతాయన్నారు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఒక వ్యక్తికి సేవింగ్ ఖాతా డిపాజిట్లపై వచ్చే వడ్డీ ఆదాయం రూ.10,000 వరకు ఉంటే ఎలాంటి పన్ను ఉండదు. అదే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వార్షిక వడ్డీ ఆదాయం రూ.40,000 మించితే టీడీఎస్ పడుతుంది.

ఐపీపీబీ నుంచి మనీ రెమిటెన్స్ సేవలు

న్యూఢిల్లీ: ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు (ఐపీపీబీ) విదేశాల నుంచి దేశంలోని ప్రజలకు మనీ ట్రాన్స్‌ఫర్ (రెమిటెన్స్) సేవలు ప్రారంభించింది. యూరోనెట్‌కి చెందిన 'రియా మనీ ట్రాన్స్‌ఫర్' సహకారంతో ఐపీపీబీ ఈ సేవలు మొదలు పెట్టింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,250 ▲	66,250 ▲	95,600 ▼
ముంబై	71,700 ▲	65,680 ▲	88,195 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



20వ తేదీ			
హైదరాబాద్	505	విజయవాడ	500
వరంగల్	505	గోదావరి	485
చిత్తూరు	553	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	129	విజయవాడ	135
వరంగల్	129	గుంటూరు	135
కరీంనగర్	129	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	129	చిత్తూరు	140
కర్నూలు	129	నెల్లూరు	140
విశాఖపట్నం	136	అనంతపురం	135
గోదావరి	135		

వైట్‌బాల్ కెప్టెన్సీకి కేన్ గుడ్‌బై



సెంట్రల్ కాంట్రాక్ట్‌నూ వదులుకున్న విలియమ్సన్

క్రైస్ట్‌చర్చ్: టీ20 వరల్డ్‌కప్‌లో న్యూజిలాండ్ పేలవ ప్రదర్శనతో ఆ జట్టు కెప్టెన్ కేన్ విలియమ్సన్ సంచలన నిర్ణయం తీసుకొన్నాడు. పరిమిత ఓవర్ల (వైట్‌బాల్) ఫార్మాట్ సారథ్య బాధ్యతల నుంచి తప్పుకొంటున్నట్టు బుధవారం ప్రకటించాడు. అంతేకాకుండా సెంట్రల్ కాంట్రాక్ట్‌ను కూడా వదులుకున్నాడు. అయితే, ఆటగాడిగా కేన్ అన్ని ఫార్మాట్లలో అందుబాటులో ఉంటాడని న్యూజిలాండ్ క్రికెట్ తెలిపింది. 'వేసవిలో కివీస్ టీమ్ తక్కువ మ్యాచ్‌లు ఆడనుంది. దీంతో విదేశీ లీగ్‌లు ఆడడం కోసమే సెంట్రల్ కాంట్రాక్ట్ వద్దనుకొంటున్నా' అని విలియమ్సన్ పేర్కొన్నాడు. కాగా, పేసర్ లోకీ ఫెర్గూసన్ కూడా సెంట్రల్ కాంట్రాక్ట్‌ను వదులుకున్నాడు.

స్పోర్ట్స్

రాత్రి 8 గం.నుంచి హాట్‌స్టార్, స్టార్ నెట్‌వర్క్‌లో..



కోహ్లీ ఇక్కడైనా కొడతాడా?

- టీమిండియా కూర్పుపై సస్పెన్స్
- సూపర్-8లో అఫ్ఘాన్‌తో భారత్ ఢీ నేడు

బ్రిడ్జ్‌టౌన్ (బార్బడోస్): టీ20 వరల్డ్‌కప్ గ్రూప్ దశలో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నా.. ఎలాగోలా గట్టెక్కిన భారత జట్టుకు కఠిన పరీక్ష ఎదురుకానుంది. సూపర్-8లో భాగంగా గ్రూప్-1లో గురువారం జరిగే తమ తొలి మ్యాచ్‌లో స్ఫూర్తిదాయక ప్రదర్శన కనబరుస్తున్న అఫ్ఘానిస్థాన్.. టైటిల్ ఫేవరెట్ టీమిండియాకు సవాల్ విసిరే అవకాశం ఉంది. వేదికలు అమెరికా నుంచి వెస్టిండీస్‌కు మారడంతో.. కీలక మ్యాచ్‌లో భారత జట్టు కూర్పు ఎలా ఉంటుందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అయితే, గ్రూప్ దశలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో నెగ్గిన జట్టులో ఎటువంటి మార్పులూ చేయడానికి రోహిత్ ఇష్టపడడం లేదని సమాచారం. నలుగురు ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, జడేజా, అక్షర్‌లకు తుది జట్టులో చోటు కల్పించాలనుకొంటున్నాడట. ఒకవేళ స్పిన్నర్ కుల్దీప్‌ను తీసుకోవాలంటే సిరాజ్‌ను బెంచ్‌కే పరిమితం చేయాలి.

విరాట్‌పైనే అందరి దృష్టి..: కెన్సింగ్‌టన్ ఓవల్‌లో గాలులు వీస్తుండడంతో పవర్‌ప్లేలో పేసర్లు బంతిని స్వింగ్ చేసే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో కోహ్లీపైనే అందరి దృష్టి నెలకొననుంది. ఐపీఎల్‌లో పరుగుల వరద పారించిన విరాట్ వరల్డ్‌కప్‌లో మాత్రం ఇప్పటి వరకు డబుల్ డిజిట్ స్కోరు చేయలేక పోయాడు. న్యూయార్క్‌లో ఎదురుదాడి చేద్దామనుకున్న అతడి వ్యూహం పని చేయలేదు. కానీ, కరీబియన్ వికెట్లపై ఆడిన అనుభవంతో కోహ్లీ చెలరేగే అవకాశం ఉంది. డాషింగ్ బ్యాటర్ సూర్యకుమార్ ఫామ్‌లో ఉండడం సానుకూలమే అయినా.. భారీ షాట్లు ఆడగల దూబే, పాండ్యా బ్యాట్లు ఝుళిపించాల్సి ఉంది. బౌలింగ్ విషయానికొస్తే అర్ష్‌దీప్ మ్యాచ్ మ్యాచ్‌కు మెరుగుపడుతుండగా.. బుమ్రా ప్రత్యర్థుల పనిబడుతున్నాడు. మందకొడి వికెట్ అయితే అక్షర్, జడేజా సత్తా చాటగలరు.



రషీద్ ఖాన్

సంచలనం సృష్టించాలని..: మరోవైపు ప్రత్యర్థి అఫ్ఘాన్ ఫుల్‌జోష్‌లో ఉంది. ఆఖరి గ్రూప్ మ్యాచ్‌లో వెస్టిండీస్ చేతిలో చిత్తయినా.. తొలి మూడు మ్యాచ్‌ల్లో బౌలర్లు ఆకట్టుకొనే ప్రదర్శన కనబరచారు. ఈసారి సెమీస్‌కు చేరాలనే పట్టుదలతో ఉన్నట్టు కెప్టెన్ రషీద్ చెప్పాడు. నవీనుల్, ఫజల్ బంతితో రాణిస్తుండగా.. గుర్బాజ్, జద్రాన్ బ్యాట్‌తో ఆదుకొంటున్నారు. న్యూజిలాండ్ లాంటి టీమ్‌ను ఓడించిన.. అఫ్ఘాన్ మరో సంచలనం సృష్టించాలనుకొంటోంది.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్, సూర్యకుమార్, దూబే, పాండ్యా, జడేజా, అక్షర్ పటేల్, బుమ్రా, అర్ష్‌దీప్, సిరాజ్/కుల్దీప్.

అఫ్ఘానిస్థాన్: గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్, అజ్మతుల్లా ఒమర్‌జాయ్, నజీబుల్లా జద్రాన్, నబీ, కరీం జనత్, రషీద్ ఖాన్ (కెప్టెన్), గుల్బదిన్ నైబ్, ఫజల్ ఫరూకీ, నవీనుల్, నూర్ అహ్మద్.

పిచ్: మందకొడి వికెట్ స్పిన్నర్లకు అనుకూలం. అయితే, ఇక్కడ వేగంగా బౌలింగ్ చేసిన బౌలర్లకు ఎక్కువ వికెట్లు దక్కాయి. కాగా, ఇదే పిచ్‌పై ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 201 పరుగులు సాధించింది. వర్షం కురిసే అవకాశం ఉన్నా.. మ్యాచ్‌కు ఆటంకం కలిగించదని భావిస్తున్నారు.

శతక జోరు రికార్డుల హోరు



హర్మన్‌ప్రీత్ కౌర్ (103 నాటౌట్)



స్మృతి మంధాన (136)

హర్మన్‌ప్రీత్, మంధాన, వోల్వార్ట్, కాప్ సెంచరీలు

- రెండో వన్డేలోనూ దక్షిణాఫ్రికా ఓటమి
- 2-0తో సిరీస్ భారత్ కైవసం

బెంగళూరు: స్మృతి మంధాన (120 బంతుల్లో 18 ఫోర్లు, 2 సిక్సులతో 136) అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ రికార్డు శతకంతో కదం తొక్కింది. ఆమెకు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (88 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సులతో 103 నాటౌట్) మెరుపు సెంచరీ తోడవడంతో సౌతాఫ్రికాతో ఉత్కంఠభరిత రెండో వన్డేలో భారత్ 4 పరుగులతో నెగ్గింది. దాంతో మూడు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే మనోళ్లు సొంతం చేసుకున్నారు. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత భారత్ 50 ఓవర్లలో 325/3 స్కోరు చేసింది. కీపర్ రిచా ఘోష్ (13 బంతుల్లో 25 నాటౌట్) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడింది. అనంతరం భారీ ఛేదనలో దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 321/6 స్కోరు చేసి ఓడింది. కెప్టెన్ వోల్వార్ట్ (135 నాటౌట్), కాప్ (114) సెంచరీలతో సత్తా చాటారు. హర్మన్‌ప్రీత్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

వారి ఆట అదుర్స్: టాస్ కోల్పోయి మొదట బ్యాటింగ్ చేపట్టగా..భారత్ ఇన్నింగ్స్‌లో మంధాన, హర్మన్ ఆటే హైలైట్. సౌతాఫ్రికా బౌలర్లను చెడుగుడు ఆడుకున్న వీరిద్దరూ మూడో వికెట్‌కు 171 పరుగులు (136 బంతులు) జత చేశారు. అంతకుముందు హేమలత (24)తో కలిసి మంధాన రెండో వికెట్‌కు 62 రన్స్ జోడించింది.

భయపెట్టిన వోల్వార్ట్, కాప్: ఛేదనలో సౌతాఫ్రికా 67/3 కష్టాల్లో పడగా..వోల్వార్ట్, కాప్ నాలుగో వికెట్‌కు 184 (170) పరుగులు జోడించి జట్టును విజయం అంచుల దాకా తీసుకొచ్చారు. కాప్‌ను దీప్తిశర్మ అవుట్ చేసి కీలక బ్రేక్ ఇచ్చింది. ఆఖరి ఓవర్‌లో విజయానికి సౌతాఫ్రికా 11 పరుగులు చేయాల్సిన వేళ ఉత్కంఠ పెరిగిపోయింది. కానీ వస్త్రాకర్ రెండు వరుస వికెట్లు తీసి టెన్షన్ తగ్గించింది. ఇక చివరిబంతికి సిక్సర్ కొట్టాల్సి ఉండగా వోల్వార్ట్ పరుగులేమీ చేయకపోవడంతో భారత్ గెలిచింది.

రికార్డులే రికార్డులు

- ఓ మ్యాచ్‌లో నలుగురు శతకాలు కొట్టడం మహిళల వన్డే చరిత్రలో ఇదే తొలిసారి.
- భారత మహిళల వన్డే జట్టు స్వదేశంలో 300 ప్లస్ స్కోరు చేయడం ఇదే మొదటిసారి.
- ఈ మ్యాచ్‌లో ఇరుజట్ల బ్యాటర్లు కలిసి 15 సిక్సర్లు బాదారు. దీంతో 2012లో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మహిళల జట్ల మధ్య మ్యాచ్‌లో అత్యధికంగా నమోదైన 14 సిక్సర్ల రికార్డు బద్దలైంది.
- వన్డేల్లో వరుసగా రెండు సెంచరీలు సాధించిన తొలి భారత మహిళా బ్యాటర్ మంధాన.
- మహిళల వన్డేల్లో అత్యధిక సెంచరీలు (7) చేసిన భారత బ్యాటర్‌గా మిథాలీరాజ్‌తో కలిసి సంయుక్తంగా టాప్‌లో నిలిచిన మంధాన. హర్మన్‌ప్రీత్ (6) రెండోస్థానంలో ఉంది.
- వన్డేల్లో వేగవంతమైన శతకం (87 బంతుల్లో) సాధించిన తొలి భారత మహిళా బ్యాటర్ హర్మన్‌ప్రీత్. గతంలో 90 బంతులతో తన పేరిటే ఉన్న రికార్డును హర్మన్ అధిగమించింది.
- మహిళల వన్డే మ్యాచ్‌లో అత్యధిక పరుగుల (646) నమోదవడం ఇది రెండోసారి. 2017 వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా మధ్య అత్యధికంగా 678 రన్స్ వచ్చాయి.

సంక్షిప్తస్కోర్లు

భారత్: 50 ఓవర్లలో 325/5 (మంధాన 136, హర్మన్ నాటౌట్ 103, రిచా నాటౌట్ 25, హేమలత 24, మ్లాబా 2/51);
దక్షిణాఫ్రికా: 50 ఓవర్లలో 321/6 (వోల్వార్ట్ నాటౌట్ 135, కాప్ 114, వస్త్రాకర్ 2/54, దీప్తి శర్మ 2/56).

పోర్చుగల్ శుభారంభం

చెక్‌పై 2-1తో విజయం

యూరో కప్

లీప్‌జిగ్ (జర్మనీ): యూరో చాంపియన్‌షిప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పోర్చుగల్ శుభారంభం చేసింది. గ్రూప్-ఎఫ్‌లో భాగంగా మంగళవారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో పోర్చుగల్ 2-1తో చెక్ రిపబ్లిక్‌పై గెలిచింది. జోడించిన సమయంలో కాన్సికావో (90+2వ నిమిషం) చేసిన గోల్‌తో పోర్చుగల్ గట్టెక్కింది. ఇదే గ్రూప్ పోరులో తుర్కియే 2-1తో జార్జియాను చిత్తుచేసింది. కాగా.. గ్రూప్-బిలో క్రొయేషియా, అల్బేనియా జట్ల మధ్య మ్యాచ్ 2-2తో డ్రాగా ముగిసింది.



ఫైనల్లో సురేఖ బృందం

అంటాల్యా (తుర్కియే): తెలుగమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-3 పోటీల్లో స్వర్ణ పతకానికి అడుగుదూరంలో నిలిచింది. మహిళల కాంపౌండ్ టీమ్‌ఈవెంట్ సెమీఫైనల్లో జ్యోతి సురేఖ, పర్ణీత్ కౌర్, అదితి స్వామిలతో కూడిన భారత బృందం 234-227తో ఆతిథ్య తుర్కియే జట్టును చిత్తుచేసింది. శనివారం జరిగే తుదిపోరులో ఎస్తోనియా జట్టుతో సురేఖ త్రయం తలపడనుంది.

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

ఇంగ్లండ్ x వెస్టిండీస్ (ఉ.6. గం.)
భారత్ x అఫ్ఘానిస్థాన్ (రా.8. గం.)

సూపర్-8లో సౌతాఫ్రికా బోణీ

18 పరుగులతో అమెరికాపై గెలుపు

నార్త్‌సౌండ్ (ఆంటిగ్వా): వరల్డ్ కప్ సూపర్-8లో దక్షిణాఫ్రికా బోణీ చేసింది. బుధవారం జరిగిన గ్రూప్-2 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 18 పరుగులతో అమెరికాను ఓడించింది. తొలుత సౌతాఫ్రికా 20 ఓవర్లలో 194/4 స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డికాక్ (40 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సులతో 74) మెరుపు హాఫ్ సెంచరీ చేయగా, మార్‌క్రమ్ (46), క్లాసెన్ (36 నాటౌట్), స్టబ్స్ (20 నాటౌట్) రాణించారు. భారీ ఛేదనలో అమెరికా 20 ఓవర్లలో 176/6 స్కోరే చేసి ఓడింది. ఓపెనర్ గౌస్ (47 బంతుల్లో 80 నాటౌట్) చెలరేగాడు. హర్మీత్ సింగ్ (38) సత్తా చాటాడు. రబాడ 3 వికెట్లు పడగొట్టాడు.

డికాక్ ధనాధన్: సౌతాఫ్రికా ఇన్నింగ్స్‌లో హెన్‌డ్రిక్స్ (11) త్వరగా అవుటైనా డికాక్ బౌలర్లను బెంబేలెత్తించాడు. మార్‌క్రమ్ జతగా రెండో వికెట్‌కు 60 బంతుల్లోనే 110 రన్స్ జోడించాడు. పేసర్ జస్దీప్ వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లో 28 రన్స్ రాబట్టాడు. మొత్తంగా పవర్ ప్లేను 64/1తో దక్షిణాఫ్రికా పటిష్ఠంగా ముగించింది. ఇక..స్పిన్నర్ హర్మీత్ బౌలింగ్‌లో ఫోర్‌తో 26 బంతుల్లో డికాక్ హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అయితే డికాక్‌ను పెవిలియన్ చేర్చిన హర్మీత్ అమెరికాకు ఊరటనిచ్చాడు. తదుపరి బంతికే మిల్లర్‌నూ హర్మీత్ అవుట్ చేశాడు. అర్ధ శతకానికి చేరువైన మార్‌క్రమ్ ఇన్నింగ్స్‌కు 15వ ఓవర్లో నేత్రావల్కర్ ముగింపు పలకగా..క్లాసెన్, స్టబ్స్ ఐదో వికెట్‌కు అభేద్యంగా 53 పరుగులు జత చేశారు.



1 డికాక్, మార్‌క్రమ్ 110 పరుగులే టీ20 వరల్డ్ కప్‌లో ఏ వికెట్‌కైనా సౌతాఫ్రికా తొలి సెంచరీ భాగస్వామ్యం

వణికించిన గౌస్, హర్మీత్: భారీ ఛేదనలో 76/5తో కష్టాల్లో పడ్డ అమెరికాను గౌస్, హర్మీత్ సింగ్ ఆరో వికెట్‌కు 91 పరుగులు (43 బంతుల్లో) చేసి ఆదుకున్నారు. ఎడాపెడా షాట్లు బాదుతూ సఫారీ బౌలర్లను వణికించారు. అయితే, 19వ ఓవర్లో హర్మీత్‌ను అవుట్ చేసిన రబాడ సఫారీలకు పెద్ద ఊరటనిచ్చాడు. ఈ ఓవర్లో రబాడ కేవలం రెండు పరుగులే ఇవ్వడం విశేషం.

సంక్షిప్తస్కోర్లు:
దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 194/4 (డికాక్ 74, మార్‌క్రమ్ 46, క్లాసెన్ నాటౌట్ 36, నేత్రావల్కర్ 2/21, హర్మీత్ 2/24); **అమెరికా:** 20 ఓవర్లలో 176/6 (గౌస్ నాటౌట్ 80, హర్మీత్ 38, రబాడ 3/18).

www.andhrajyothy.com
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 20-6-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



'నేను బాగుండాలి. నా ప్యాలెస్ భద్రంగా ఉండాలి. జనం ఏమైపోయినా, ఎన్ని కష్టాలు పడినా ఫర్వాలేదు!'... ఇదీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలసీ! తాడేపల్లిలో ఆయన కట్టుకున్న ప్యాలెస్ విలాసాలే దీనికి నిదర్శనం. ఈ ఐదేళ్లూ ప్యాలెస్ చుట్టుపక్కల అడుగు పెట్టేందుకు వీల్లేకుండా వందలమంది పోలీసులను మోహరించారు. గేట్లు పెట్టారు. దారులు మూశారు. ఇప్పుడు... 'తాడేపల్లి'కి స్వేచ్ఛ లభించింది. ప్రభుత్వ ధనంతో 'ముఖ్యమంత్రికి మాత్రమే' వేసుకున్న రహదారులు సామాన్యులకూ తెరుచుకున్నాయి. సొంత ఇంటికి వెళ్లేందుకూ స్థానికులు గుర్తింపు కార్డులు చూపించాల్సిన దుస్థితి తొలగిపోయింది. పక్కనే ఉన్న పొలానికి రైతులు చుట్టూ తిరిగితిరిగి వెళ్లాల్సిన కష్టం దూరమైంది. ముఖ్యమంత్రిగా జగన్ చేసిన అరాచకాలన్నీ ఇప్పుడు కెమెరా కళ్లకు చిక్కుతున్నాయి. దీనిపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న సచిత్ర కథనం...



పేదలను తరిమిన పెత్తందారు!

పేదలున్నారు...

తాడేపల్లి ప్యాలెస్ నిర్మాణంలో ఉన్నప్పటి చిత్రమిది! బకింగ్ హామ్ కెనాల్, దాని కట్టపైన రోడ్డు, ఆ పక్కనే సామాన్యులు ఎప్పటి నుంచో నివసిస్తున్న ఇళ్లు, రోడ్డు... ఒకప్పుడు తాడేపల్లి ప్యాలెస్ ప్రాంతం ఇలా ఉండేది.

తరిమేశారు..

తాడేపల్లి ప్యాలెస్ నిర్మాణం పూర్తయి... జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత తీసిన చిత్రమిది! బకింగ్ హామ్ కెనాల్ కరకట్టపై రోడ్డు మాయమైంది. ఆ పక్కనే ఉన్న పేదల ఇళ్లను కూల్చేసి... వారందరినీ అక్కడి నుంచి తరిమేశారు. ఆ స్థానంలో మొక్కలు, పూదోటలు పెంచారు. చిన్నగా ఉన్న రహదారి కాస్తా... విశాలంగా మారింది.

12

జనం రహదారికి అడ్డు గేట్లు

తాడేపల్లి ప్యాలెస్ కోసం దారుణాలు



కార్పొరేషన్లలో జగన్ సైన్యం!



సొంత మీడియా సిబ్బంది, వైసీపీ కార్యకర్తలు డంప్

ఇంధన సంస్థల్లో ఎటుచూసినా జగన్ అనుచరగణమే

ఏపీఎస్‌డీసీ, ఎండీసీ, ఫైబర్‌నెట్, ఈ-ప్రగతిల్లో పాగా

అర్హత లేకున్నా ప్రభుత్వ పెద్దల సిఫారసుతో పోస్టులు

పని చేయకపోయినా రూ.లక్షల్లో జీతభత్యాలు చెల్లింపు

ప్రజాధనంతో జీతాలు.. చేసేది మాత్రం పార్టీకి సేవలు

అక్రమ నియామకాలు, చెల్లింపులపై ప్రభుత్వం దృష్టి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



ప్రభుత్వ కార్పొరేషన్లలో వైసీపీ కార్యకర్తలు, సొంత మీడియా సిబ్బంది పాతుకుపోయారు. రోజూ విధులకు హాజరు కాకపోయినా వీరికి ప్రతినెలా రూ.లక్షల్లో జీతభత్యాలు చెల్లించి రాష్ట్ర ఖజానాను ముంచేశారు. జగన్ సొంత పత్రిక, టీవీ చానల్‌లో గుదిబండలుగా మారిన ఉద్యోగులకు ప్రభుత్వ కార్పొరేషన్లలో వైట్ కాలర్ జాబ్‌లు ఇచ్చి పోషించారు. వైసీపీ సోషల్ మీడియాలో పనిచేస్తున్నవారందరికీ రియల్‌టైమ్ గవర్నెన్స్‌లో కంటెంట్ రైటర్లుగానూ, సమాచార పౌర సంబంధాల శాఖలో ప్రభుత్వ ప్రగతిని ప్రచారం చేసే సిబ్బందిగానూ నియమించుకున్నారు. జగన్‌తో పాటు వైఎస్ విజయలక్ష్మి, ఎంపీ అవినాశ్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తదితరులు

మిగతా 10వ పేజీలో...

వీరికి నో పోస్టింగ్..



శ్రీలక్ష్మి | రజత్ భార్గవ | మురళీధర్ రెడ్డి | ప్రవీణ్ ప్రకాశ్

వీరికి కీలక బాధ్యతలు



సాయిప్రసాద్ జలవనరుల స్పెషల్ సీఎస్ | ప్రద్యుమ్న ముఖ్యమంత్రి కార్యదర్శి | కాటమనేని భాస్కర్ సీఆర్డీయే కమిషనర్

ప్రక్షాళన ప్రారంభం

19 మంది ఐఏఎస్‌లకు స్థాన చలనం

శ్రీలక్ష్మి, రజత్ భార్గవకు నో పోస్టింగ్

మురళీధర్ రెడ్డి, ప్రవీణ్ ప్రకాశ్‌కూ అంతే

జీఏడీలో రిపోర్ట్ చేయాలని ఆదేశం

జలవనరుల స్పెషల్ సీఎస్‌గా సాయిప్రసాద్

సీఆర్డీయే కమిషనర్‌గా కాటమనేని భాస్కర్

ఆర్థిక శాఖను గాడిన పెట్టే చర్యలు

ఇద్దరు కార్యదర్శుల నియామకం

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పరిపాలనలో ప్రక్షాళన ప్రారంభమైంది. తొలి విడతలో 19 మంది ఐఏఎస్‌లకు స్థాన చలనం కలిగింది. ఒకటి రెండు రోజుల్లో మరికొందరు ఐఏఎస్‌లను బదిలీ చేయనున్నట్లు తెలుస్తోంది. జగన్ హయాంలో వివాదాస్పదులుగా ముద్రపడిన అధికారులకు ప్రాధాన్యం తగ్గించారు. తటస్థంగా వ్యవహరించిన వారికి పెద్ద పీట వేశారు. బుధవారం సాయంత్రం ఐఏఎస్‌ల బదిలీల ఉత్తర్వులు వెలువడ్డాయి. వివాదాస్పద ఐఏఎస్‌గా ముద్రపడిన శ్రీలక్ష్మికి పోస్టింగ్

మిగతా 12వ పేజీలో...

కొత్త డీజీపీ ద్వారకా తిరుమలరావు



ద్వారకా తిరుమలరావు

హరీశ్‌కుమార్ గుప్తా బదిలీ

హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా నియామకం

బాబు ప్రమాణస్వీకారంలో జరిగిన గందరగోళమే కారణం!

11

నీరబ్ సర్వీస్ పొడిగింపు

మరో 6 నెలలివ్వాలని కేంద్రానికి లేఖ

త్రికరణ శుద్ధిగా.. పేదలకు

పథకాల ఫలాలు!

స్కీముల అమల్లో రాజకీయ జోక్యమొద్దు: పవన్

క్యాంపు ఆఫీసులో బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

2028లోగా ప్రతి ఇంటికీ కొళాయి నీరు

ఉపాధి కూలీల వేతనాలు వెంటనే వచ్చేలా కేంద్రం దృష్టికి తీసుకెళ్తాం

రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనం పెంచాలి

విద్యార్థిలా అన్నీ నేర్చుకుంటాను

11

అధికారులు బోధించాలి: ఉప ముఖ్యమంత్రి

పంచాయతీరాజ్, అటవీ శాఖలపై సమీక్ష

ఉద్యాన పంటల అభివృద్ధిపై మొదటి సంతకం



జగన్ నిర్లక్ష్యం వల్లే

10

పోలవరం పూర్తికాలేదు

యుద్ధప్రాతిపదికన పూర్తిచేసే బాధ్యత ఎన్డీయే ప్రభుత్వానిదే

విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ ఇప్పట్లో జరగదు

కావాలనే దీనిపై రాద్ధాంతం: కిషన్‌రెడ్డి

'ఆంధ్రజ్యోతి'కి కేంద్ర మంత్రి ఇంటర్వ్యూ

వరి, జొన్న, పత్తి సహా 14 పంటలకు

మద్దతు ధర పెంపు

కేంద్ర క్యాబినెట్ తొలి సమావేశంలో నిర్ణయం

8

రూ. 72,600 కోట్లతో మహారాష్ట్రలోని వధావన్‌లో అతి పెద్ద గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి ఆమోద ముద్ర

తీరప్రాంత పవనశక్తి ప్రాజెక్టుల అమలుకు వీజీఎఫ్ స్కీమ్

రూ. 2,254 కోట్లతో ఫోరెన్సిక్ ఇన్‌ఫ్రా విస్తరణకు ఓకే

సర్కారు మారినా బేఖాతర్!

నిరాటంకంగా ఇసుక తవ్వకాలు, దందా

ఇసుక డంప్‌లన్నీ వైసీపీ నేతల చేతుల్లోనే

ఎన్నికలకు ముందే ఎడాపెడా తవ్వి తరలింపు

రాష్ట్రవ్యాప్తంగా 180కి పైగా డంప్‌లు

ఒక్కో దాంట్లో లక్ష టన్నుల దాకా ఇసుక

ఏడాది వరకు వ్యాపారానికి ఢోకాలేదు

తాజాగా అధిక ధరకు విక్రయం

లారీ 45 వేలకు పైనే.. ట్రాక్టరైతే 12 వేలు

డంప్‌లన్నీ స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వానికి విజిలెన్స్ సూచన

అటు యథేచ్ఛగా ప్రతిమ, జీసీకేసీ తవ్వకాలు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ప్రభుత్వం మారినా ఇసుక అక్రమ తవ్వకాలు ఆగడం లేదు. జగన్ సర్కారు ఏరికోరి తెచ్చిపెట్టిన ప్రతిమ ఇన్‌ఫ్రా, జీసీకేసీ సంస్థలు యథేచ్ఛగా తవ్వకాలు కొనసాగిస్తున్నాయి. ఇసుక డంప్‌లను గుప్పిట్లో పెట్టుకున్న కొందరు వైసీపీ నేతలు.. అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వీరు పర్యావరణ నిబంధనలకు పాతరేసి ఇసుకను

మిగతా 12వ పేజీలో...



ఎలాంటి రాజధాని ఎలా మిగిలింది?

పునాదినుంచి లేచిన తొలి రాజధానిగా గుర్తింపు

వైసీపీ పాలనలో శాపగ్రస్థగా మిగిలిన దైన్యం

ప్రభుత్వానికి ఆదాయం తెచ్చేలా మాస్టర్‌ప్లాన్

3 రాజధానులంటూ అడవిని మిగిల్చిన జగన్

నేడు అమరావతిలో చంద్రబాబు పర్యటన

(అమరావతి- ఆంధ్రజ్యోతి)

భారతదేశంలో పునాది స్థాయి నుంచి నిర్మితమవుతున్న తొలి రాజధాని నగరంగా ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి గడించిన అమరావతి... ఐదేళ్ల వైసీపీ పాలనలో శాపగ్రస్థగా మిగిలిపోయింది. రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వ పాలనలో పురుడు పోసుకొని వడివడిగా అడుగులు వేసిన అమరావతి, ఆ తర్వాత

మిగతా 11వ పేజీలో...

రబీ నష్టం రూ. 300 కోట్లు

క్షేత్రస్థాయిలో పరిశీలించి.. ప్రభుత్వానికి నివేదిస్తాం

రితీశ్ చౌహాన్ నేతృత్వంలోని కేంద్ర బృందం వెల్లడి

నష్టంపై అనంత జిల్లా కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష

నెల్లూరు జిల్లా కలిగిరి, కొండాపురం మండలాల్లో పర్యటన

దెబ్బతిన్న పంటల పరిశీలన, రైతులతో ముఖాముఖి

9



9

మండిన కోస్తా

ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి

జంగమహేశ్వరపురంలో 39 డిగ్రీల ఉష్ణోగ్రత

విశాఖలో 38.4, నెల్లూరులో 38.1, బాపట్లలో 38

నేడు వర్షాలు.. తీరంలో బలమైన గాలులు

విద్యా శాఖలో ప్రవీణ్ ప్రకాశ్

ఇష్టారాజ్యం!

ఎక్కువ ధరకు ఇంటర్ పుస్తకాల ముద్రణకు ఆదేశం

పేజీ 29 పైసలకు చేయిస్తున్న తెలుగు అకాడమీ

33 పైసలకు పాతవారితో చేయించాలని జీవో

విషయం మంత్రి లోకేశ్‌కు చెప్పకుండానే జారీ

ఆర్థిక శాఖ అనుమతి కూడా తీసుకోలేదు

9

వెలుగులోకి రావడంతో అధికారుల హడావుడి



12

వైసీపీ సోషల్ మీడియాకు

సజ్జల భార్గవరెడ్డి దూరం?

నాగార్జున యాదవ్‌కు బాధ్యతలు!

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆయుధ మైత్రి

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉత్తరకొరియాతో గట్టి ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఇరవైనాలుగేళ్ళ తరువాత తమదేశంలో కాలూనిన పుతిన్‌ను చూసి కిమ్ ఎంత పొంగిపోయారో ఆ ఘనస్వాగత సత్కారాలే చెబుతున్నాయి. పుతిన్‌కూడా ఉత్తిచేత్తో వెళ్ళకుండా ఓ అద్భుతమైన, ఖరీదైన కారును ఆయనకు బహుమతిగా ఇచ్చి తన ఆదరాభిమానాలను చాటుకున్నారు. ఈ రెండుదేశాల మధ్యా ఎటువంటి బంధం ఉన్నదో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. బహిరంగంగానో, రహస్యంగానో రష్యాతో అవసరార్థం ఉత్తరకొరియా అంటకాగుతూనే ఉంటుంది. ఉక్రెయిన్ యుద్ధంలో కిమ్ అందించిన ఆయుధాలు రష్యాకు బాగా ఉపకరిస్తున్నాయని పాశ్చాత్యదేశాలు ఎప్పటినుంచో అంటున్నాయి. ఈ పర్యటనతో ఇక ఈ రెండుదేశాల స్నేహం, ఆయుధబంధం మరింత బలోపేతమైంది. తమ ఇద్దరిలో ఎవరిమీద ఈగవాలినా ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదని పుతిన్, కిమ్ ముక్తకంఠంతో పాశ్చాత్యదేశాలను హెచ్చరిస్తున్నారు.

ఒకరికొకరు ఏ తరహా సాయం చేసుకుంటారో స్పష్టంగా చెప్పక పోయినా, వ్యూహాత్మక భాగస్వామ్యం, శాంతియుత, రక్షణాత్మక ఒప్పందం వంటి మాటలు అసలు మర్మాన్ని విప్పకపోయినా పుతిన్ పర్యటన, ఈ ఒప్పందాలు పాశ్చాత్యదేశాలకు ఒక బలమైన హెచ్చరిక. అమెరికా, దాని మిత్రదేశాలు అతిగా వ్యవహరించినా, దూకుడుగా అడుగులువేసినా ఈ కొత్తమిత్రులు వదిలిపెట్టరు. కరచాలనాలు, ఆలింగనాలకు పరిమితమైన, సాదాసీదా బంధం కాదు ఇది అని రక్షణరంగ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా పక్షాన కిమ్ ఎంతబలంగా ఉన్నారో ఈ ఒప్పందం చెబుతోంది. ఇప్పటివరకూ ఉత్తర కొరియానుంచి రష్యాకు ఫలానా ఆయుధాలు రహస్యంగా చేరాయంటూ ఆరోపిస్తున్న పాశ్చాత్యదేశాలు ఇకమీదట మరిన్ని సరఫరాలు లెక్క బెట్టుకోవాల్సిరావచ్చు. ఉత్తరకొరియా తయారుచేసిన ఆయుధాలు అంత కచ్చితంగా పనిచేయవన్న దుష్ప్రచారం విస్తృతంగా జరుగుతున్న తరుణంలో ఉక్రెయిన్ యుద్ధంలో వాటి వాడకం ఆ ప్రచారం సరైనదో కాదో కూడా తేల్చేస్తుంది. కొద్దినెలల్లో ముగిసిపోతుందనుకున్న ఉక్రెయిన్ యుద్ధం ఏళ్ళతరబడి సాగుతూండటం వల్ల వచ్చి పడుతున్న ప్రమాదం ఇది. పాశ్చాత్యదేశాలు ఆయుధాలతోనూ, ఆర్థికంగానూ ఉక్రెయిన్ పక్షాన మరింత గట్టిగా నిలుస్తూండటంతో రష్యా అధ్యక్షుడు కొత్త కొత్త ఒప్పందాలతో మరిన్ని ఆయుధాలను సంపాదించుకోవడంలో పడ్డారు.

కొన్ని నెలలుగా స్విట్జర్లాండ్ దూతలు ఎంతో హడావుడిగా ప్రపంచమంతా తిరిగి, ఏర్పాటుచేసిన ఉక్రెయిన్ సదస్సు చివరకు తుస్సుమన్నది. రష్యా ఆదినుంచీ ఆరోపిస్తున్నట్టుగానే ఇది దానిని హెచ్చరించడానికీ, సుద్దులు చెప్పడానికీ పరిమితమైంది. యుద్ధం పాపం పూర్తిగా రష్యాదే నంటూ, అదే అంతర్జాతీయ నియమాలు, చట్టాలను ఉల్లంఘిస్తున్నట్టూ వ్యాఖ్యానించడం ద్వారా ఈ సదస్సు తన నిజస్వరూపాన్ని బయటపెట్టుకుంది. యుద్ధం చేసుకుంటున్న ఉభయపక్షాల్లోనూ ఒకదానిని ఆహ్వానించకుండా ఏకంగా 90దేశాలు ఇలా సమావేశం అవడం వల్ల ఏ ప్రయోజనమూ ఉండదు. రష్యాను ఆహ్వానించలేదు, పిలిచినా అది రాదు కూడా. చివరకు ఈ యుద్ధకాలమంతా పాశ్చాత్యదేశాలనుంచి వింటున్న ఆరోపణలనూ, సుద్దులనే ప్రపంచం ఈ సదస్సునుంచి మళ్ళీ వినాల్సి వచ్చింది. దురాక్రమణ కూడదనీ, ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని గౌరవించాలని అంటూ ఓ సుదీర్ఘమైన తీర్మానాన్ని ఈ సదస్సు చేసింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే, ఉక్రెయిన్ పక్షాన, ఆ దేశాధినేత కోరుతున్నరీతిలో యుద్ధవిరమణకు అనుకూలంగా ఈ సదస్సు జరిగింది. ముందుగా రష్యా వెనకడుగువేయాలనీ, ఉక్రెయిన్‌లో అది వశపరుచుకున్న భూభాగాలన్నీ వదిలేసి వెనక్కుపోవాలనీ జెలెన్‌స్కీ డిమాండ్ చేస్తున్నారు. ముందుగా తూర్పు ఉక్రెయిన్‌లోని నాలుగు ప్రాంతాలను నువ్వే వదులుకొని ఆ తరువాత మాట్లాడు అని పుతిన్ అంటున్నారు. నిజానికి, పాశ్చాత్యదేశాల దయలేనిదే యుద్ధం కొనసాగించగలిగే స్థితిలో ఉక్రెయిన్ అధ్యక్షుడు లేరు. ఆ విషయంలో రష్యాయే తాను అనుకున్నది ఎప్పటికైనా సాధించగలిగే స్థితిలో ఉంది. యుద్ధం ఆగాలంటే రష్యాతో ఉక్రెయిన్ రాజీ పడాల్సిందేనని అమెరికా, దాని మిత్రదేశాలన్నిటికీ తెలుసు. అయినా, అవి ఆయుధాలు కుమ్మరిస్తూ యుద్ధం కొనసాగేట్టుగా చేస్తున్నాయి. సాధ్యమైనంత వేగంగా యుద్ధాన్ని ముగించని పక్షంలో అది అన్ని హద్దుల్నీ దాటేస్తుందనీ, ప్రపంచాన్ని ముంచేస్తుందని రష్యా–ఉత్తరకొరియా రక్షణ ఒప్పందం హెచ్చరిస్తోంది.

ముందే కూస్తున్న తొందర కోయిలలు!

బాగా గెలిచినవారికి బాగా ఆనందం ఉంటుంది. బాగా ఓడిపోయినవారికి కుంగుబాటు ఉంటుంది. విపరీతంగా గెలుస్తామనుకుని కొంచెం మాత్రమే గెలిచినవారికి కొంత నీరసం ఉంటుంది. కనాకష్టంగా ఉన్న వారు కొన్ని మెట్లు ఎక్కితేనే కొండంత సంబరం కలుగుతుంది. విజయోత్సవాలు, విచారపర్వాలు ముగిసిన తరువాత, క్రమంగా సత్యం బోధపడుతుంది. ఆటవిడుపు తరువాత అసలు పనులు మొదలు. ఘనవిజయం సాధించిన వారికి, ఘనాతిఘనమైన బరువు బాధ్యతలు, దివాళా ఖజానాకు తోడు వాగ్దాన భారాలు. అరువు గెలుపుల వారికి వారినీ వీరినీ కలుపుకుని పోవలసిన కొత్త కర్తవ్యాలు. కొత్త బలాల వారికి పొద్దెరుగని వీరంగాలు. దిగదుడుపు పార్టీలకు దింపుడు కళ్లాలు.

ఎగ్జిట్ పోల్స్ రాగానే తారాజువ్వలాగా ఎగిసిపోయి, నిజం ఫలితాల వేళకు నిప్పులు కక్కుకుంటూ నేలరాలిన స్టాక్ మార్కెట్ ఇండెక్స్, కొంచెం ఓవరాక్షన్ చేసినట్టు అనిపించింది. అందులో ఆవిరైపోయి మళ్లీ గడ్డకట్టిపోయిన లక్షల కోట్ల రూపాయల సంగతేమిటో కానీ, జనం ఒకటి అనుకుంటే దళారిమార్కెట్ మరొకటి అనుకున్నది. షేర్ మార్కెటే కాదు, దేశంలోని ప్రజాస్వామిక సూచి కూడా మరీ అతిగా ప్రకంపించింది. మల్లెల వేళ వచ్చిందని, వెన్నెల మాసం వచ్చిందనీ పాటలు పాడడం మొదలుపెట్టింది. ఇల్లు ఇంకా అలకనే లేదు, పండగకు రెడీ అయింది. ఇందుమూలముగా సమస్త జనులు తెలుసుకోవలసినది ఏమిటంటే, ఫలితాలు వచ్చి కూడా పదిహేను రోజులై పోయింది కాబట్టి, ప్రథమోత్సాహం కొంత తగ్గించుకుని, వాస్తవంలోకి మేల్కొనాలి. సూచికలను కొంచెం సవరించుకోవాలి.

ఇంతకు ముందు లాగా, రాజకీయం నీరసంగా ఏకపక్షంగా ఉండబోదు కానీ, అట్లాగని మరీ హల్లాబోల్ వాతావరణం ఉండబోవడం లేదు. కనీసం ఇప్పట్లో అంత దృశ్యము కనిపించదు. నాలుగు రోజుల్లో మొదలయ్యే తొలి పార్లమెంటు సమావేశాల్లో కొద్దిగా ఉనికి ప్రకటనలు, ఏలినవారి బల ప్రదర్శనలు చూడవచ్చు. మాకు బలం పెరిగింది, మార్పు చూడండి, అని చెప్పాలని ఇండియా కూటమి అనుకుంటుంది. కొనసాగింపే తప్ప మార్పేమీ లేదు అని బలంగా చాటాలని మోదీ ప్రభుత్వం అనుకుంటుంది. ఆ రెండు రకాల ప్రదర్శనలూ ఇప్పటికే ఉనికిలోకి వచ్చాయి. ఎన్డీయేలోని బీజేపీయేతరులు చెదిరిపోతారు, తమలో చేరిపోతారు అని ఇండియా కూటమి, అందులోనూ ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ కలలు కంటోంది. బహుశా, బీజేపీ కూడా, ఇండియా కూటమిలోనుంచి ఒకటి రెండు పార్టీలను రప్పించుకోగలనని ఆశపడుతున్నదేమో తెలియదు. మొత్తానికి అస్థిరతా వాతావరణం ఉంటుందని, అందులో తమ అభివృద్ధికి సానుకూలత కలుగుతుందని ప్రతిపక్షాలు అనుకుంటున్నాయి.

వాస్తవ స్థితిగతులను ఆశ మసకబారిస్తే కష్టం. నరేంద్ర మోదీ మూడో ప్రభుత్వం పూర్తి ఐదేళ్లు కొనసాగడానికి అనేక అవకాశాలు ఉన్నాయి. ముందు ఆ సంభావ్యతను అంగీకరించాలి. మొన్నటి ఎన్నికల్లో దెబ్బతిన్న ప్రతిష్ఠను మరమ్మత్తు చేసుకునో, లేదా, తీవ్ర ఉద్వేగ పరిస్థితులు ఏర్పడితే ఆ అదనులో మధ్యంతర ఎన్నికలకు వెళ్లో ఎన్డీయే ప్రభుత్వం తనను తాను పటిష్ఠపరుచుకునే, కొనసాగించుకునే ఆస్కారం కూడా లేకపోలేదు. హోంమంత్రి మారలేదు. జాతీయ భద్రతా సలహాదారు మారలేదు. న్యాయశాఖ మంత్రి, విదేశాంగ శాఖ మంత్రి మారలేదు. లోక్‌సభ స్పీకర్ ఎవరవుతారో ఇంకా తెలియదు. తెలుగుదేశం పార్టీ కోరుతూ ఉండవచ్చును కానీ, అది తమకే ఉండాలని బీజేపీ పట్టు బట్టవచ్చు. రాష్ట్ర ప్రయోజనాల కోసం, సొంత పార్టీ ప్రయోజనాల కోసం ప్రాంతీయ పార్టీలు రాజీపడాల్సిరావచ్చు. చంద్రబాబే కాదు, నితిశ్ కుమార్ మాత్రం అర్జెంటుగా బీజేపీతో బెట్టుగా ఉండాలని ఎందుకు అనుకుంటారు?



ప్రభుత్వం అదే. రాజకీయ వాదనలూ అవే, చేయదలచిన అభివృద్ధీ అదే, చూపబోయే కాఠిన్యమూ అదే. ఏవో గొప్పమార్పులు వస్తాయని ఊహిస్తే ఆశాభంగాలు ఎదురవుతాయి. జాతీయ ప్రతిపక్షాలు ఈ సంగతి గ్రహించి, 2024 ఎన్నికలకు ముందు తమ జనాదరణ పెంచుకోవడానికి ఎటువంటి కార్యక్రమాలను చేశాయో వాటిని మరింత ఉధృతంగా కొనసాగించాలి. రాజకీయ లాభాలు ఎవరికీ ఊరికే రావు. కాంగ్రెస్‌తో సహా, ఆ కూటమి పక్షాలన్నీ చేయవలసినంత పరిశ్రమ చేయలేదు కాబట్టే, అధికారానికి అల్లంత దూరానే ఆపివేశారు. వేసిన నాలుగు అడుగులకు ఉత్సాహపడితే తప్పేమీ లేదు కానీ, మరిన్ని అడుగులు వేయడానికి ఆయాసపడితేనే కష్టం.

గతంలో పూర్తి పదవీకాలం పూర్తిచేసుకున్న మైనారిటీ ప్రభుత్వాలతో పోలిస్తే, మోదీ 3.0 ఏమంత బలహీనమైనది కాదు. 1991లో కేవలం 226 సభ్యుల బలంతో పివి నరసింహారావు ప్రభుత్వం ఏర్పడి, పూర్తికాలం కొనసాగింది. 1999లో ఎన్డీయే ప్రభుత్వంలో బీజేపీ బలం 182 మాత్రమే. 2004లో మొదటి యూపీఏ ప్రభుత్వంలో కాంగ్రెస్ బలం 145 మాత్రమే. రెండో యూపీఏలోనూ కాంగ్రెస్ 206తోనే ప్రభుత్వం నడిపింది. ఈ అన్నిటికంటె ఇప్పుడు ఎన్డీయేలో బీజేపీ వాటా పెద్దది. మునుపటి సంకీర్ణ సారథులందరి కంటె మోదీ, షాలు అఖండులు. ఒక్క పీవీని మినహాయిస్తే, చాణక్యులు కూడా. అనుకోని పరిణామాలను ఎప్పుడూ నిరాకరించలేము కానీ, మోదీ పూర్తికాలం పదవిలో ఉండరని, మధ్యంతరం వస్తుందని ఊహించడానికి కానీ, ఆశించడానికి కానీ ఆధారాలేమిటి?



■ కె. శ్రీనివాస్

సందర్భం

ప్రతి విషయంలోనూ ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు బీజేపీకి అభ్యంతరాలు పెడుతూ ఉంటారనుకుంటే, ఉండాలనుకుంటే అది పొరపాటు. విధానాల పరంగా చూస్తే, బీజేపీ ఆర్థిక సంస్కరణల అజెండాతో తెలుగుదేశానికి కానీ, జేడీయూకి కానీ ఎటువంటి పేచీ ఉండదు. కాకపోతే, మునుపటిలాగా, వచ్చే పెట్టుబడి అవకాశాలను అన్నిటినీ గుజరాత్‌కు తరలించుకుపోతుంటే అడ్డుపడతారు. ఆ విషయంలో బీజేపీ కొంత వెనక్కి తగ్గవచ్చు. కశ్మీర్‌లోనో అబూజ్‌మడ్‌లోనో జరిగే భద్రతాదళాల చర్యల విషయంలో ఎన్డీయే భాగస్వామ్యపక్షాలకు ఏ సమస్యా ఉండదు. ఆర్‌ఎస్‌ఎస్ చెప్పింది కాబట్టి, మణిపూర్‌లో సర్దుబాట్లు చేయడానికి బీజేపీయే ముందుకు వస్తుంది. సంఘర్షణలకు, సమస్యలకు రాజకీయ పరిష్కారాలు అన్వేషించాలని ఇండియా కూటమి కూడా ఇప్పుడు అడిగే స్థితిలో లేదు, ఇక ఎన్డీయే భాగస్వాములు ఎందుకు అడుగుతారు? అరుంధతీరాయ్ వంటి వారిని కేసులతో వేధిస్తుంటే మంచిది కాదని మిత్రపక్షాలు హితవు చెబుతాయేమో తప్ప. శాంతిభద్రతల రంగంలో అమిత్ షా మార్గమే నిరాఘాటంగా కొనసాగుతుంది. కొత్త నేరచట్టాల అమలు విషయంలో ఇండియా కూటమి పక్షాలు వాయిదా కోరినా, నీట్ విషయంలో వీధుల్లో ఉద్యమాలు చేసినా, ఎన్డీయే భాగస్వాములు తటస్థంగా ఉండవచ్చు. తాము ఏదో ఒక వైఖరి తీసుకోవలసిన అగత్యం మాత్రం మును ముందు తరచు కలుగవచ్చు.

ఒకటి మాత్రం నిజం. తమకు ప్రతిపక్ష కూటమిలో ఉన్న ఆహ్వానాన్ని తెలుగుదేశం కానీ, జేడీయూ కానీ తృణీకరించవు. వారితో కలవరు కానీ, కలిసే అవకాశం వల్ల కలిగే పలుకుబడిని ఎంజాయ్ చేస్తాయి. ప్రతిపక్ష కూటమికి కూడా తాము ఆమోదయోగ్యం కావడం, ఈ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన ప్రత్యేక సదుపాయం. దాని మీదనే కేంద్ర ప్రభుత్వంలో ఎన్డీయే భాగస్వాముల, ముఖ్యంగా టీడీపీ, జేడీయూల పరపతి ఆధారపడి ఉంటుంది. అంతమాత్రాన, లోక్‌సభలో కానీ, బయట కానీ, ప్రతిపక్ష కూటమితో ఈ పార్టీలు కలసి పనిచేయడం కానీ, గొంతు కలపడం కానీ ఇప్పట్లో ఉండదు. ఒకవేళ అటువంటిదేమన్నా చేయవలసి వచ్చినా, అది ఆ పార్టీలు తమ రాష్ట్రాలకు కేంద్రం నుంచి రాబట్టుకోవలసిన నిధుల కోసం, నిర్ణయాలకోసం ప్రయోగించే ఒత్తిడిగా మాత్రమే ఉంటుంది. ఈ విషయాన్ని అత్యాశావాదులు గుర్తించాలి.

రానున్న రోజుల్లో ఇండియా కూటమికి కలసిరాగలిగిన ఒక పరిణామం, ఈ ఏడాది జరిగే నాలుగు అసెంబ్లీల ఎన్నికలు, ముఖ్యంగా మహారాష్ట్ర ఎన్నికలు. ఈ ఎన్నికలలో మంచి ఫలితాలను చూపించగలిగితే, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం మీద ఒత్తిడి పెరుగుతుంది. బీజేపీలోనూ, ఎన్డీయే కూటమిలోనూ అంతర్గతంగా భిన్నస్వరాలు వినిపిస్తాయి. కానీ, ఇప్పుడే తాము గెలిచామని తబ్బిబ్బైపోతున్న కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు, అసెంబ్లీ ఎన్నికలను తేలికగా తీసుకుంటే, పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుంది.

ఇండియా కూటమికి ఉన్న మరో సానుకూల అంశం ఏమిటంటే, భాగస్వామ్య పక్షాల్లో ఏ ఒక్కటీ ఎన్డీయే కూటమిలోకి మళ్లే అవకాశం బాగా తక్కువ. ఉద్ధవ్ ఠాక్రే అటువైపు చూడరా, అవసరమైతే స్టాలిన్ కూడా రాజీపడడా, శాంతి కోసం మమత చేయి కలపదా అని సాంకేతికంగా వాదిస్తే చెప్పలేము కానీ, కూటమిలోని ప్రతిపార్టీ బీజేపీ వల్ల ఏదో రకంగా బాధిత పక్షమే కాబట్టి, అట్లా జరగడం కష్టం. పైగా, ఈ పక్షాలు అన్నీ తమ తమ రాష్ట్రాలలో బీజేపీ నుంచి సవాళ్లను ఎదుర్కొంటున్నవే. కలవడం అంటే, తమ ప్రాంతాలలో బీజేపీ ప్రాబల్యాన్ని ఆహ్వానించడమే. ఎన్డీయే కూటమి సంగతి వేరు. రెండు ప్రధాన బీజేపీయేతర భాగస్వాములు ఇండియా కూటమికి కూడా ఆమోదయోగ్యమైన వారు. షిండే సేన ఉనికి మహారాష్ట్ర ఎన్నికల తరువాత కానీ చెప్పలేము.

> ఇండియా కూటమి భాగస్వామ్యపక్షాల్లో ఏ ఒక్కటీ ఎన్డీయే కూటమిలోకి మళ్లే అవకాశం బాగా తక్కువ. ఉద్ధవ్ ఠాక్రే అటువైపు చూడరా, అవసరమైతే స్టాలిన్ కూడా రాజీపడడా, శాంతి కోసం మమత చేయి కలపదా అని సాంకేతికంగా వాదిస్తే చెప్పలేము కానీ, కూటమిలోని ప్రతిపార్టీ బీజేపీ వల్ల ఏదో రకంగా బాధిత పక్షమే కాబట్టి, అట్లా జరగడం కష్టం.

కాబట్టి, ప్రభుత్వం అదే. రాజకీయ వాదనలూ అవే, చేయదలచిన అభివృద్ధీ అదే, చూపబోయే కాఠిన్యమూ అదే. ఏవో గొప్పమార్పులు వస్తాయని ఊహిస్తే ఆశాభంగాలు ఎదురవుతాయి. జాతీయ ప్రతిపక్షాలు ఈ సంగతి గ్రహించి, 2024 ఎన్నికలకు ముందు తమ జనాదరణ పెంచుకోవడానికి ఎటువంటి కార్యక్రమాలను చేశాయో వాటిని మరింత ఉధృతంగా కొనసాగించాలి. రాజకీయ లాభాలు ఎవరికీ ఊరికే రావు. కాంగ్రెస్‌తో సహా, ఆ కూటమి పక్షాలన్నీ చేయవలసినంత పరిశ్రమ చేయలేదు కాబట్టే, అధికారానికి అల్లంత దూరానే ఆపివేశారు. వేసిన నాలుగు అడుగులకు ఉత్సాహపడితే తప్పేమీ లేదు కానీ, మరిన్ని అడుగులు వేయడానికి ఆయాసపడితేనే కష్టం.

కేంద్రంలో ప్రభుత్వం నడక ఆసక్తికరంగా, ఉత్కంఠభరితంగా ఉంటుంది. సందేహం లేదు. గతంలో వలె కాక ఇప్పుడు అనేకపాత్రాభినయం చూడవచ్చు. ప్రజలు మౌన ప్రేక్షకులుగా మిగలకుండా, తమకు నచ్చిన పాత్రధారులను ఉత్సాహపరచవచ్చు. కానీ, రేపోమాపో క్లైమాక్స్ వస్తుందని మాత్రం ఆశించవద్దు.

గేమ్ చేంజర్!

చంద్రబాబు నాయుడు నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు, జగన్మోహన్ రెడ్డి వైసీపీ 11 సీట్లకే పరిమితమైంది. ఈ మార్పు సంభవించిన తీరును ఒకసారి సింహావలోకనం చేద్దాం. 2019లో జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడి, ప్రజావేదిక ధ్వంసంతో మొదలైన విధ్వంసక పాలన ప్రతిపక్ష నాయకులపై దాడులతో, మైనింగ్ ఇసుక మాఫియాతో విశృంఖల రూపం దాల్చింది. మద్యం పాలసీ మార్చి ప్రజల చేత చీప్ లిక్కర్ తాగించారు. ఉద్యోగులు, టీచర్లు, పోలీసు వ్యవస్థలను అస్తవ్యస్తం చేశారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి, ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి తెచ్చిన డబ్బులను దోచుకుంటూ కాలం గడిపారు. ఇదంతా చూస్తూ కూడా స్పందించలేని పరిస్థితిలో కేంద్రం ఉండిపోయింది. 22 పార్లమెంటు సీట్లు, 10 రాజ్యసభ సీట్లతో కేంద్ర ప్రభుత్వానికి వైసీపీ ఇస్తున్న మద్దతే ఇందుకు కారణం. రాష్ట్రం ఈ స్థితిలో ఉన్న నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ ఒక నిర్ణయం తీసుకుంది. అప్పటికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శుల్లో ఒకరిగా ఉన్న పురందేశ్వరిని రాష్ట్ర బీజేపీకి అధ్యక్షురాలిగా నియమించింది.

అప్పటి దాకా రాష్ట్రంలో బీజేపీ తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటూ ఉన్నది. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాన్ని సమర్థిస్తూ అమరావతి, పోలవరం వంటి సమస్యల పరిష్కారానికి బీజేపీ ప్రాధాన్యత ఇవ్వటం లేదని, జగన్ చేసే అప్పులను సమర్థిస్తున్నదని, బీజేపీ రాష్ట్ర శాఖ దీనంతటికీ మద్దతు పలుకుతున్నదని ప్రజలు భావిస్తున్న నేపథ్యంలో పురందేశ్వరి మొదట కేంద్ర పెద్దలను ఒప్పించి, రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఎదురొడ్డి ప్రజా ఉద్యమం చేయడానికి నడుము కట్టారు. రాష్ట్రంలో మద్యం దోపిడీ ఎలా జరుగుతుందీ, ఎవరెవరు దీనిని తయారు చేస్తున్నారూ, దీని వలన ఖజానాకు ఎంత నష్టం జరుగుతున్నదీ, ఇందులో జగన్ ప్యాలెస్‌కి ఎంత వెళుతున్నదీ ఆమె ఆధారాలతో సహా ప్రజల ముందు ఉంచారు. అంతేగాక, క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు స్వయంగా వెళ్లి సమాచార సేకరణ చేశారు. ఆసుపత్రుల్లో మద్యం బాధితులను పరామర్శించారు. ఇలా ఉద్యమ స్థాయిలో పని చేస్తూ ప్రజలకు మద్యం దోపిడీ గురించి అర్థమయ్యేలా చేశారు.



> రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాన్ని సమర్థిస్తూ అమరావతి, పోలవరం వంటి సమస్యల పరిష్కారానికి బీజేపీ ప్రాధాన్యత ఇవ్వటం లేదని, జగన్ చేసే అప్పులను సమర్థిస్తున్నదని, బీజేపీ రాష్ట్ర శాఖ దీనంతటికీ మద్దతు పలుకుతున్నదని ప్రజలు భావిస్తున్న నేపథ్యంలో పురంధేశ్వరి మొదట కేంద్ర పెద్దలను ఒప్పించి, రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ప్రజా ఉద్యమానికి నడుం కట్టారు.

అలాగే ఇసుక ర్యాంపుల్లోకి వెళ్లి ఇసుక ఏ విధంగా అక్రమ రవాణా జరుగుతున్నదీ, ఏఏ కంపెనీలు జగన్‌కు ఎంతెంత ముట్టచెబుతున్నదీ ప్రజలకు అర్థమయ్యే రీతిలో పని చేశారు. కేంద్రం ఇచ్చిన నిధులు పంచాయతీ సర్పంచుల ఖాతాల్లోకి వెళ్లకుండా వాటిని దారి మళ్లించి వాడుకోవడం, చిన్నచిన్న కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం, వాటి కారణంగా జరిగిన ఆత్మహత్యలు... ఇలాంటి విషయాలన్నీ వెలికితీసి పురందేశ్వరి ప్రజాక్షేత్రంలో ఎండగట్టారు.

ఈ పరిస్థితిలో ఎన్నికలు సమీపించాయి. తెలుగుదేశం – జనసేన పొత్తు ప్రకటించాయి. భారతీయ జనతా పార్టీ నాయకత్వం ఈ పొత్తులో భాగస్వామి అవుతుందా లేదా అనే మీమాంసలో ప్రజలు ఉన్నారు. బీజేపీ నాయకులు కూడా పొత్తు గురించి ఏమీ తేల్చలేనటువంటి స్థితిలో ఉన్నారు. చంద్రబాబు జైల్లో ఉన్న సందర్భంలో ఆయనపై అవినీతి ఆరోపణల వెనక ఆధారాలు లేవన్న వాదనను పురంధరేశ్వరి గట్టిగా వినిపించారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలకు విషయాలు వివరించి లోకేష్‌ని ఢిల్లీ పెద్దల వద్దకు పురందేశ్వరి తీసుకెళ్ళారు. ప్రభుత్వం ఈ విషయంలో చేస్తున్న అన్యాయాన్ని, అక్రమాలను ప్రజలకు బహిర్గతం చేయడంలో తనవంతు పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ పొత్తు ఖరారు అయింది.

ఈ పొత్తు ఖరారు అవ్వడానికి అనువైన వాతావరణాన్ని రాష్ట్రంలో పురందేశ్వరి కల్పించారు. ఇదే నేపథ్యంలో కూటమి సభ మొదటిసారి చిలకలూరిపేటలో జరిగింది. అయితే ప్రధాని ఉపన్యాసంపై రాష్ట్ర ప్రజలు నిరాశకు గురయ్యారు. బీజేపీ నిజంగా ఎన్నికల సమయంలో కూటమి సభ్యులైన తెలుగుదేశం, జనసేనలకు అనువైన వాతావరణం కల్పిస్తుందా అనే అనుమానంతో కూడిన ప్రశ్న ఉత్పన్నమైంది. ఈ నేపథ్యంలో పురందేశ్వరి రాష్ట్రంలోని ముఖ్యంగా పోలీస్, రెవెన్యూ వ్యవస్థల పనితీరును జిల్లాపరంగా ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్తూ, ఎస్పీలను, డీజీపీలను, పోలీస్ ఇంటలిజెన్స్ అధికారులను మార్చాలని ఆధారాలతో సహా ఎన్నికల కమిషనర్‌కు తెలియజేశారు. ఎన్నికల కమిషన్ పురందేశ్వరి సూచనల మేరకు అధికారులను బదిలీ చేయడంతో ప్రజల్లో నమ్మకం, ధైర్యం కలిగాయి. తరువాత రాజమండ్రి సభలో ప్రధాని ప్రసంగం ఏ విధంగా ఉంటే బాగుంటుంది అనే చర్చ జరిగింది. పురందేశ్వరి సూచనల మేరకే ప్రధాని మోదీ మొదటిసారిగా జగన్ అక్రమాలపై స్పందించారు. జగన్ ప్రభుత్వాన్ని ఇసుక, మద్యం మాఫియా అని ప్రధాని ఆ సభలో తీవ్ర స్వరంతో విమర్శించారు. ఆ వెంటనే రాష్ట్రంలో గేమ్ చేంజ్ అయింది. ముందురోజు డీజీపీని మార్చటం దీనికి తోడైంది. ఇంకేముంది అధికార పార్టీ శ్రేణులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేన, బీజేపీ శ్రేణులు ఉత్సాహంతో కేరింతలు కొట్టాయి.

ఆ తరువాత వారం రోజుల్లో మే 13న ఎన్నిక వచ్చేసింది. అవినీతి, అక్రమ, విధ్వంస, కక్షపూరిత, అభివృద్ధి నిరోధక ప్రభుత్వాన్ని నిర్మూలించడానికి కసితో ప్రజలు ఉవ్వెత్తున కెరటం లాగా లేచారు. ఆంధ్ర రాష్ట్ర చరిత్రలోనే అపూర్వమైన రీతిలో అఖండ మెజారిటీతో బీజేపీ, తెలుగుదేశం, జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించారు.

అధములు ఆటంక భయంతో ఏ పనీ మొదలుపెట్టరు. మధ్యములు ఆటంకం కలగగానే మొదలుపెట్టిన పని ఆపివేస్తారు. ఉత్తములు మాత్రం ఎన్ని అవరోధాలు ఏర్పడినా ప్రారంభించిన పనిని విజయవంతం అయ్యేదాకా విడిచి పెట్టరు– అని విశాఖదత్తుడనే రాజకవి తన ముద్రారాక్షసం అనే నాటకంలో రాస్తాడు. రాష్ట్ర రాజకీయాల్లో ఉత్తమ కార్యదీక్షకు పురందేశ్వరి బలమైన ఉదాహరణగా నిలబడ్డారు.

• డాక్టర్ తాళ్లూరి ఆంజనేయులు
జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి

గ్రామ పంచాయతీలను పునరుద్ధరించాలి

గత ప్రభుత్వం చేసిన అనేక తప్పులను సరిదిద్ది ప్రజలకు సుపరిపాలన అందించడానికి కొత్త ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను రద్దు చేసి గ్రామ పంచాయతీలను తిరిగి పునరుద్ధరించాలి. ప్రస్తుతం సచివాలయం ద్వారా జరిగే అన్ని పనుల్ని గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఒక్కో గ్రామంలో జనాభాను బట్టి ఒకటి నుంచి ఐదు–ఆరు వరకు గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 11 మంది వరకు సిబ్బంది ఉన్నారు. వీరందరికీ పెద్దగా పని ఉండదు. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా అనవసర సిబ్బందిని వేరే చోటుకు సర్దుబాటు చేయాలి. గ్రామానికి ఒక్క సచివాలయం మాత్రమే ఉండేట్టు చూడాలి. వీటిలో ఒక సెక్రెటరీ, డిజిటల్ అసిస్టెంట్, ప్లంబర్ కమ్ ఎలక్ట్రీషియన్, పంచాయతీ విస్తీర్ణాన్ని బట్టి 3 నుంచి 10 మంది స్వీపర్లు ఉండేట్టు చర్యలు తీసుకోవాలి. వీరు సర్పంచ్, పాలకవర్గానికి జవాబుదారీగా ఉండేలా చూడాలి. గ్రామంలో పింఛన్లను వలంటీర్ల ద్వారా కాకుండా ప్రభుత్వ అధికారుల ద్వారా, వార్డు మెంబర్ల సమక్షంలో పంపిణీ చేయాలి.

–కనకం రామలింగేశ్వరరావు
రాజమండ్రి

సంకీర్ణాల బలం తెలిసి వ్యూహం పన్నిన పవన్

ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సంప్రదాయేతర రాజకీయాల ద్వారా పవన్ కళ్యాణ్ ఒక అపూర్వ ఘట్టానికి ఆద్యుడయ్యాడు. భిన్న ధ్రువాలుగా ఉన్న సామాజిక శక్తుల్ని ఒక్క తాటి మీదకి తెచ్చి కొత్త రాజకీయాలకి తెర లేపాడు. ఆవేశాలు, ఉద్వేగాల కంటే రాజకీయాల్లో ఆచరణాత్మకమైన అడుగులు ఎంత ముఖ్యమో నిరూపించాడు. తాను సీఎం కావాలని ఉరకలేసే అనుచరుల్ని శాంతపరిచి అధికారం వైపు అడుగులు ఎంత సహనంతో వెయ్యాలో తెలియజెప్పాడు. తగ్గడం ద్వారా ఎంత పెరగచ్చో చూపించాడు. విడిపోయి పడిపోతున్న అనేక వర్గాలకి కొత్త ఆశలు ఆలోచనలు కలిగించాడు.

2014 నుంచి జనసేన రాజకీయాల్ని గమనిస్తే మూడో ప్రత్యామ్నాయం నిర్మాణానికి ఎంతో సహనం, ఓపిక, వ్యూహాలు – ప్రతివ్యూహాలు అవసరమని పవన్ కళ్యాణ్ గమనం తెలియజేస్తున్నది. నిత్య అవమానాలు, వ్యక్తిత్వ హననాలు, పొంచి ఉన్న ప్రమాదాలు తట్టుకోలేక పవన్ కళ్యాణ్ రాజకీయాల నుంచి వైదొలుగుతాడేమోనని ఒక దశలో వ్యాఖ్యానాలు వచ్చాయి. ఇక్కడే పవన్ కళ్యాణ్ పట్టుదల, మొండితనం, ధైర్యం, వ్యూహాలు అర్థం అవుతాయి. ప్రతికూల పరిస్థితుల్లో దూకుడుగా కాకుండా నాలుగడుగులు ముందుకి, రెండడుగులు వెనక్కి అనే ధోరణిలో ఆయన రాజకీయాలు కనిపిస్తాయి. గమ్యాన్ని ఒకే రోజులో చేరుకోవాలని అత్యాశతో పరుగెత్తి కిందపడటం కంటే, ఆలస్యం అయినా పరిమిత వనరులతో, సహనంతో నడుచుకుంటూ గమ్యం చేరడం ముఖ్యం అనే విధానం ఆయన పాలిటిక్స్‌లో కనిపిస్తుంది. క్లిష్ట పరిస్థితుల్ని తట్టుకొని దీర్ఘకాలం కొనసాగాలంటే ఇదే సరైన పద్ధతి అని ఆయన గుర్తించినట్టు అర్థం అవుతుంది. ప్రత్యర్థుల నుంచి తప్పించుకునే వేగాన్ని (escape velocity) తమ పార్టీ సాధించే వరకు ఈ పద్ధతిని అనుసరించేలా జనసేన నాయకుని వ్యూహ రచన కనిపిస్తుంది. అన్నింటికీ మించి రాష్ట్రానికి ఈ దశలో సంకీర్ణ రాజకీయాల అవసరాన్ని గుర్తించడం, ప్రోత్సహించడం పవన్ కళ్యాణ్ దార్శనికతకు అద్దం పడుతుంది.

రాజకీయ లేదా సామాజిక సంకీర్ణాలు దేశానికి కొత్త కాదు. సోషల్ ఇంజినీరింగ్ పాలిటిక్స్ దశాబ్దాలుగా నడుస్తూనే ఉన్నాయి. మన రాష్ట్రంలో కాంగ్రెస్ ద్వారా ముప్పై ఏళ్ళకి పైగా అధికారంలో ఉన్న రెడ్డి సామాజికవర్గ నాయకులు కేంద్రంలో ఆ పార్టీని నడుపుతున్న బ్రాహ్మణ సామాజికవర్గంతో కలిసి నడిచారు. తెలుగుదేశం ఏర్పడేవరకు కమ్మ సామాజికవర్గ నాయకులు కూడా ఢిల్లీలో కమ్యూనిస్ట్ పార్టీని నడుపుతున్న బ్రాహ్మణ వర్గం నాయకులతోనే కలిసే నడిచారు. ఇవన్నీ ఒకరకమైన పొత్తు రాజకీయాలే. ఉత్తరప్రదేశ్‌లో కన్షీరాం రాజకీయ సంకీర్ణాలతోనే మాయావతిని మూడుసార్లు ముఖ్యమంత్రిని చేశాడు. మాయావతి 2007లో సొంతగా విజయం సాధించినప్పుడు కూడా బ్రాహ్మణ సామాజికవర్గంతో బహిరంగ పొత్తు పెట్టుకున్న విషయం మరిచి పోకూడదు. ఇది రాజకీయాల కోసం ఏర్పడిన సామాజిక సంకీర్ణమే. ప్రజాస్వామ్య విజయానికి సామాజిక, రాజకీయ సంకీర్ణాలు అవసరం అని అంబేడ్కర్ 1951లోనే తన ప్రతిష్ఠాత్మక లక్నో ఉపన్యాసంలో చెప్పడం గమనార్హం. అంబేడ్కర్ చెప్పిన పద్ధతిలోనే కన్షీరాం రాజకీయ, సామాజిక పొత్తులతో దళితులు అధికారం పంచుకోవడానికి ఉత్తర ప్రదేశ్‌లో బాటలు వేసాడు. ఇది ఏ సామాజిక వర్గానికైనా, రాజకీయ పార్టీకైనా వర్తిస్తుంది. గతంలో జనసంఘ్ – కమ్యూనిస్టులు కూడా కలిసి రాజకీయాలు చేసారు. నేపాల్‌లో మావోయిస్టులు – ప్రజాస్వామ్యవాదులు కలిసి పాలించారు. రూపం ఏదైనా నేటి రాజకీయాలకి పొత్తు కేంద్ర బిందువయ్యిందని గుర్తించాలి.

ప్రస్తుత పరిస్థితుల్లో ఏ ఒక్క కులం కానీ, రాజకీయ పార్టీ కానీ ఒంటరిగా అధికారంలోకి వచ్చే అవకాశాలు తక్కువ. ఒకవేళ వచ్చినా ఎక్కువ కాలం మనలేవు. చివరకి సంకీర్ణ రాజకీయాల్నే ఆశ్రయించాల్సి వస్తుంది. అందుకే రాజకీయ, కుల సంబంధాల్ని తెగేవరకు లాగడం సామరస్య మనుగడకి ప్రమాదకరం. శాశ్వతంగా కత్తులు దూసుకునే వర్గాల్ని కూడా కలిపి నడిపించగల సత్తా సంకీర్ణ రాజకీయాలకి ఉంది. ఈ సత్యం గుర్తించని ఏ కులమైనా, రాజకీయ పార్టీ అయినా రాజ్యాధికారంలో భాగం పంచుకోలేవు. కులాల కుంపట్లతో, ఆర్థిక అసమానతలతో నిత్యం నిప్పుల కొలిమిలా మండుతూ ఉండే ఆంధ్రప్రదేశ్‌లో రెండు ప్రధాన కులాలు ప్రాతినిధ్యం వహించే రెండు పార్టీలకి తప్ప మూడో పార్టీకి చోటు లేదు. ఈ నేపథ్యంలోనే మూడో ప్రత్యామ్నాయం కోసం గతంలో అనేక ప్రయత్నాలు జరిగినా అవి విజయవంతం కాలేదు. ఆ క్రమంలోనే జనసేన కూడా తెరమరుగౌతుందని భావించారు. కానీ తన శక్తినంతా కూడగట్టుకుని వ్యూహ ప్రతి వ్యూహాలతో పదిహేను సంవత్సరాలు పార్టీని బతికించుకుని పరిశీలకుల్ని ఆశ్చర్యపరిచాడు పవన్ కళ్యాణ్.

> పవన్ కళ్యాణ్‌కి అపారమైన వ్యక్తిగత ఆకర్షణ, ప్రజలతో ఎమోషనల్ కనెక్టివిటీ తప్ప మిగతా మార్గాలు లేవు. చుట్టూ ఒక అడుగు ముందుకి వేస్తే ఏడడుగులు వెనక్కి లాగే రాజకీయ వాతావరణం మధ్య, శత్రుశిబిరాలుగా విడిపోయిన కుల సమాజంలో అయన రాజకీయాలు కత్తి మీద సాముని తలపిస్తాయి. ఈ పరిస్థితుల్లో ఒక వైపు తన వృత్తిని కొనసాగిస్తూ మరో వైపు చాప కింద నీరులా, ఎదుటివాళ్లకి కన్ను కుట్టని విధంగా తన ప్రాబల్యాన్ని పెంచుకున్నాడు.




అధికారాన్ని సాధించటానికి ఉన్న అనేక ప్రత్యామ్నాయాల్లో వ్యక్తి ఆకర్షణ (చరిష్మా) ఒక ప్రధాన ప్రత్యామ్నాయం అన్నాడు మాక్స్ వెబర్ అనే పాలానా శాస్త్ర పండితుడు. దక్షిణ భారతదేశ రాజకీయాల్లో అధికారంలోకి వచ్చిన ఎమ్జీ రామచంద్రన్, కరుణానిధి, ఎన్టీ రామారావు, జయలలిత ముఖ్యమంత్రి పీఠం ఎక్కటం వెనుక ముఖ్యంగా వ్యక్తి ఆకర్షణే ప్రధాన పాత్ర పోషించింది. అయితే ఈ నాయకుల కాలంలో సమాజం కొంత సరళంగా, కొన్ని విలువలతో కూడి ఉండేది. కానీ పవన్ కళ్యాణ్ సొంత రాజకీయాల్ని మొదలుపెట్టే నాటికి సమాజం సంక్లిష్టం అయ్యింది. డబ్బు, కులంతో పాటు మీడియా, సోషల్ మీడియాలు వచ్చాయి. వ్యక్తిత్వ హనన రాజకీయాలు పెరిగిపోయాయి. ఏ కోణంలో చూసినా మూడో పార్టీ బతికి బట్టగట్టలేని పరిస్థితి వచ్చింది. పవన్ కళ్యాణ్‌కి అపారమైన వ్యక్తిగత ఆకర్షణ, ప్రజలతో ఎమోషనల్ కనెక్టివిటీ తప్ప మిగతా మార్గాలు లేవు. చుట్టూ ఒక అడుగు ముందుకి వేస్తే ఏడడుగులు వెనక్కి లాగే రాజకీయ వాతావరణం మధ్య, శత్రు శిబిరాలుగా విడిపోయిన కుల సమాజంలో అయన రాజకీయాలు కత్తిమీద సాముని తలపిస్తాయి. ఈ పరిస్థితుల్లో ఒక వైపు తన వృత్తిని కొనసాగిస్తూ మరో వైపు చాప కింద నీరులా, ఎదుటివాళ్లకి కన్ను కుట్టని విధంగా తన ప్రాబల్యాన్ని పెంచుకున్నాడు.

మన రాష్ట్రంలో రాజకీయ న్యాయం అందరికీ దక్కాలంటే ఈ దశలో పొత్తు రాజకీయాలు తప్పవనే వాస్తవిక పరిస్థితిని పవన్ కళ్యాణ్ బలంగా గుర్తించాడు. 2014 ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తులో పవన్ ఒక్క సీటు కూడా పోటీ చెయ్యకపోవడం అపరిపక్వతగా వ్యాఖ్యానాలు వచ్చాయి. కానీ పవన్ కళ్యాణ్ దూరదృష్టితోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తుంది. పోటీ చెయ్యకుండానే ఈ పొత్తులో భాగమై – పవన్ కళ్యాణ్ గతంతో సంబంధం లేని ఒక సరికొత్త రాజకీయ నాయకునిగా రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టాడు. అరకొర సీట్లకి ఆశపడని ఒక నైతిక రాజకీయ శక్తిగా తనను తాను ప్రెజెంట్ చేసుకోగలిగాడు. పోటీ చేసి పొందే పేరు కంటే పది రెట్లు ఎక్కువ గౌరవాన్ని పోటీ చేయకపోవటం ద్వారా ఆయన పొందాడు. ఇదంతా యాదృచ్ఛికంగా జరిగినట్టు కనిపించినప్పటికీ, పరిశీలిస్తే పవన్ కళ్యాణ్ వ్యూహంలో భాగంగానే జరిగినట్టు అర్థం అవుతుంది. ఆనాటి సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితుల్లో పోటీ చేయకపోవటం పవన్ కళ్యాణ్ రాజకీయ చతురతకి, పరిపక్వతకి నిదర్శనం. కేవలం ఐదు లక్షల ఓట్ల ఆధిక్యతతో గెలిచిన ఆనాటి కూటమిలో పవన్ కళ్యాణ్ లేకపోతే ఓటమి చూడాల్సి వచ్చేదని మేధావుల వ్యాఖ్యానాలు గుర్తు తెచ్చుకోవాలి. ఆ విధంగా నాటి కూటమి విజయానికి పనిచేసి ఆయన చర్చ మొత్తాన్ని తన వైపు తిప్పుకోగలిగాడు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా ప్రధాన స్రవంతిలో విస్మరించలేని శక్తిగా ఎదగటానికి ఎన్నో అవకాశాల్ని వదులుకున్నాడు.

ఇటీవలి ఎన్నికల్లో కూడా అనేకమంది పార్టీ కార్యకర్తలు, నాయకులు మొదట తెలుగుదేశంతో పొత్తుని వ్యతిరేకించారు. పదే పదే గత గాయాల్ని ఆయనకు గుర్తు చేసారు. పొత్తు నష్టమని అన్నారు. తర్వాత యాభై సీట్లకి తగ్గితే కష్టమన్నారు. చివరి క్షణం వరకు పొత్తు వద్దని అయన మీద పెద్ద ఒత్తిడి పెట్టారు. పవన్ కళ్యాణ్ మాత్రం వ్యూహం తనకి వదిలెయ్యమన్నాడు. తన వ్యూహం ప్రకారమే అడుగులు వేసాడు. రెండు వైపుల్ని బాలెన్స్ చెయ్యడానికి నిద్ర లేకుండా పనిచేసాడు. ఒక కొత్త సోషల్ ఇంజినీరింగ్ చేసాడు. తన మద్దతుదారులకి బలహీనమైన ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులున్నప్పటికీ, తన వ్యక్తిత్వమే పెట్టుబడిగా రాజకీయాలు చేసిన అరుదైన నాయకుడు పవన్ కళ్యాణ్. అందరు అసాధ్యం అనుకున్నప్పటికీ ఆయన మాత్రం ఈ విజయాన్ని ముందే పసిగట్టాడు. ప్రచారంలోనూ కొత్త పోకడలు చూపించాడు. నిప్పులు కురిపించాడు. తన ఆవేశంతో అన్ని వర్గాల ప్రజలకి దగ్గర అయ్యాడు. ప్రభావితం చేసాడు. రాష్ట్రం కనీ వినీ ఎరుగని విజయాన్ని చూసింది. పవన్ కళ్యాణ్ రాజకీయాలు ఇప్పటివరకు అధికారానికి దూరంగా ఉన్న సమూహాలన్నిటికి ఒక కొత్త మార్గాన్ని చూపించాయి.

■ ప్రొఫెసర్ శ్రీపతి రాముడు
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ



జోగి.. జోగి రాసుకుంటే బూడిద రాలిందో లేదో కానీ, మాజీమంత్రి జోగి రమేశ్ కుటుంబ సభ్యులంతా కలిసి దొంగపత్రాలు రాసుకుని రూ.కోట్లు కొట్టేశారు. అంబాపురంలోని సుమారు రూ.5 కోట్ల విలువైన 2160 గజాల అగ్రిగోల్డ్ భూమిని కొట్టేయడంలో పక్కా ప్లాన్ అమలు చేశారు. దొంగ పత్రాలతో అప్పనంగా కబ్జాచేసి, వేరే వారికి విక్రయించి, సొమ్ము చేసుకున్న జోగి కుటుంబ సభ్యులు ఈ భూబాగోతంపై ఇంతవరకు నోరు విప్పలేదు. తాము నిండా మునిగిపోయామని ప్లాట్లు కొన్న బాధితులు గగ్గోలు పెడుతున్నారు. అగ్రిగోల్డ్ బాధితులతో కలిసి తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు.


అంబాపురంలోని అగ్రిగోల్డ్ భూములు ఇవే..

పక్కా ప్లాన్

అగ్రి భూముల కబ్జాలో మాజీమంత్రి జోగి రమేశ్ ప్రణాళిక

- అంబాపురంలోని సర్వే నెంబరు 88లో అన్నీ పక్కా ఇళ్లే
- అయినా 2160 గజాల ఖాళీ స్థలం కొన్నట్లు డ్రామా
- ఆ తర్వాత స్వీయ సవరణ దస్తావేజుతో సర్వే నెంబరు మార్పు
- ఈ మార్పులో ఉన్నవి సీఐడీ అటాచ్‌మెంట్‌లోని అగ్రి భూములు
- అప్పనంగా కొట్టేసి వైసీపీ కార్పొరేటర్‌కు అమ్మినట్లు మాయ
- లబోదిబోమంటున్న ప్లాట్లు కొన్నవారు.. ఆందోళనకు సన్నాహాలు
- ఇంతా జరుగుతున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం అంబాపురంలో ఆర్ఎస్ నెంబరు 87లో మొత్తం 18.33 ఎకరాల పట్టా భూమి ఉంది. ఈ భూమి యజమానులుగా కళ్లెం సాంబిరెడ్డి, కాకర్లపూడి అన్నపూర్ణ, యలవర్తి దేవేంద్ర ప్రసాద్, కళ్లెం అశోక్‌రెడ్డి, కళ్లెం రంగారెడ్డి, కళ్లెం శివప్రసాదరెడ్డి, గోకరాజు ఉమాదేవి, ఆరుమళ్ల రామలింగారెడ్డి, గరికపాటి జయలక్ష్మి పేర్లు ఉన్నాయి. ఇందులో గరికపాటి జయలక్ష్మికి 2.81 ఎకరాలు ఉండగా, అందులో 0.65 సెంట్లు లేదా 3120 గజాలు అల్లూరి కృష్ణమూర్తికి ఆమె విక్రయించారు. ఆయన ఆ భూమిని అగ్రిగోల్డ్ యజమానులైన అవ్వ ఉదయభాస్కర్, వెంకట సుబ్రహ్మణ్యం తదితరులకు 2293.05 గజాలు విక్రయించారు. ఇదే భూమిలో 2160 గజాలను జోగి కుటుంబ సభ్యులు దొంగ పత్రాలతో కబ్జా చేశారు.

పకడ్బందీగా..

అంబాపురంలోని అగ్రిగోల్డ్ భూముల చెంతనే ఆర్ఎస్ నెంబరు 88లో మొత్తం 7.47 ఎకరాల పట్టా భూమి ఉంది. ఇందులో కనుమూరి వెంకట రామరాజు, కనుమూరి వెంకట సుబ్బరాజు కుటుంబ సభ్యుల పేరున 4 ఎకరాలు ఉంది. ఈ భూమిని వీరు బొమ్ము వెంకట చలమారెడ్డికి విక్రయించారు. అందులో ఒక ఎకరాన్ని చలమారెడ్డి 2001లో పోలవరపు మురళీమోహన్‌కు విక్రయించారు. 2003లో మురళీమోహన్ తాను కొన్న ఎకరాలో ప్లాట్లు వేసి విక్రయించేశారు. తిరిగి 2014లో మహాలక్ష్మి ప్రాపర్టీస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ తరఫున అడుసుమిల్లి మోహనరామదాసుకు విక్రయించారు. మోహనరామదాసు నుంచి 2022లో జోగి వెంకటేశ్వరరావు, జోగి రాజీవ్ కలిసి భూమిని కొన్నారు. అసలు తిరకాసు ఇక్కడే ఉంది. సర్వే నెంబరు 88లో 2వేల గజాల ఖాళీ స్థలమే లేదు. అక్కడ ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు ఇళ్లు కట్టేసుకోవడమో లేక ప్రహరీ నిర్మించుకోవడమో చేశారు. అలాంటిది అక్కడ జోగి కుటుంబ సభ్యులు 2160 గజాల స్థలాన్ని రెండు బిట్లుగా ఎలా కొనుగోలు చేశారన్నది ప్రశ్నార్థకం. అగ్రిగోల్డ్ స్థలాన్ని కొట్టేయాలన్న ఆలోచనతోనే జోగి కుటుంబం ఈ కథ నడిపించినట్లు తెలుస్తోంది.

స్వీయసవరణ దస్తావేజు డ్రామా

సర్వే నెంబర్ 88లో 2160 గజాలు 2022లో కొనుగోలు చేసినట్లుగా చూపిన జోగి కుటుంబ సభ్యులు.. అనంతరం దస్తావేజుల్లో తప్పు దొర్లిందని పేర్కొంటూ 2023లో స్వీయ సవరణ చేయించారు. ఈ స్వీయ సవరణ చేయించే సమయంలో అగ్రిగోల్డ్ భూములు ఉన్న సర్వే-ఆర్ఎస్ నెంబరును 87ను అసలు నెంబరుగా పేర్కొన్నారు. సర్వే నెంబరు 87లో అగ్రిగోల్డ్ భూములు ఉన్నాయన్న విషయం తెలిసే వీరు ఈ ఎత్తుగడ వేశారన్నది స్పష్టం. మంత్రిగా ఉండటంతో సర్వే నెంబరు 87లో నిషేధిత జాబితాలో ఉన్న భూములను రిజిస్ట్రేషన్ చేయకూడదన్న నిబంధనలు ఉన్నా.. నున్న సబ్ రిజిస్ట్రార్ గుడ్డిగా చేసేశారు. సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న భూములను స్వాధీనం చేసుకునేందుకు జోగి గ్యాంగ్ ఏకంగా తహసీల్దార్ నుంచి భూమి స్వాధీన ఉత్తర్వులు పొందడం గమనార్హం.

అప్పనంగా కొట్టేసి.. విక్రయించేసి..

అగ్రిగోల్డ్ భూమి కబ్జా చేయడం తీవ్రమైన నేరం. ఈ విషయాన్ని తెలిసి కూడా జోగి గ్యాంగ్ ఆ భూములను దొంగ పత్రాలతో కబ్జా చేసింది. ఆ తర్వాత ఆ భూములను వేరే వారికి విక్రయించేయడం ద్వారా మరింత వివాదాస్పదం చేసే ప్రయత్నం చేశారు. ఈ భూమిని తమ వద్ద ఉంచుకుంటే మున్ముందు ఇబ్బందులు ఎదురవుతాయన్న ఉద్దేశంతో ఆగమేఘాలపై ఈ భూమిని ప్లాట్లుగా వేసి విజయవాడ వైసీపీ కార్పొరేటర్ పగిడిపాటి చైతన్యరెడ్డి.. భర్త, మామ, అత్త, ఆడపడుచులకు విక్రయించేశారు. ఈ మొత్తం వ్యవహారంలో.. అంతా కుమ్మక్కై పక్కాగా అగ్రి భూములకు ఎసరు పెట్టారన్నది స్పష్టం. 205 గజాల చొప్పున పగిడిపాటి చైతన్యరెడ్డి కుటుంబ సభ్యులు ఏడుగురు ఈ భూమిని కొన్నారు. న్యాయస్థానాలను ఆశ్రయించి ఉపశమనం పొందేందుకే జోగి గ్యాంగ్ వైసీపీ కార్పొరేటర్‌తో కలిసి ఈ డ్రామాను నడిపించినట్లు తెలుస్తోంది. ఈ కబ్జాకాండలో ఎవరెవరు కుమ్మక్కయ్యారన్న విషయం సమగ్ర విచారణ జరిగితేనే వెలుగులోకి వస్తుంది. అడుసుమిల్లి మోహనరామదాసు, జోగి కుటుంబ సభ్యులు, వైసీపీ కార్పొరేటర్ చైతన్యరెడ్డి కుటుంబ సభ్యులు ఎవరి పాత్ర ఎంత అనేది తేటతెల్లమవుతుంది. సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న భూమిని కొనడం.. విక్రయించడం.. తమ స్వాధీనంలో ఉంచుకోవడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించి జోగి కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని అటు అగ్రి బాధితులు, ఇటు అగ్రిగోల్డ్ యాజమాన్యం డిమాండ్ చేస్తున్నారు.

నాడు వేధించి.. నేడు వేడుకోలు!

ఐదేళ్లపాటు టీడీపీ నాయకులపై వేధింపులు



గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ నివాసంపై ఈనెల 7వ తేదీన దాడి చేశారంటూ పలువురు టీడీపీ నాయకులపై మాచవరం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వాస్తవానికి టీడీపీ నాయకులను కవ్వించి రెచ్చగొట్టి ఇరువర్గాలు ఘర్షణ పడేలా చేసిన వంశీ అనుచరులపై మాత్రం ఎలాంటి కేసులు నమోదు చేయలేదు. చిత్రం ఏవిటంటే ఘటనాస్థలిలో లేనటువంటి యార్లగడ్డ సతీశ్, పరుచూరి నరేష్, చల్లగుళ్ల సందీప్ వంటి వారిపైనా పోలీసులు కేసు నమోదు చేశారు.

- గన్నవరం నియోజకవర్గంలో నేటికీ అదే తీరు..
- వంశీ ఇంటిపై దాడి ఘటనలో పలువురు టీడీపీ నాయకులపై కేసులు
- ఘటనాస్థలిలో లేనివారిపైనా కేసులు

ప్రజల పక్షం ఉండాల్సిన పోలీసులు వైసీపీ నేతలకు వంత పాడుతున్నారు. ఆ పార్టీ నేతల అడుగులకు మడుగులొత్తుతున్నారు. టీడీపీ శ్రేణులపై వైసీపీ శ్రేణులే దాడి చేసినా టీడీపీ నేతలు, కార్యకర్తలపైనే కేసులు కడతారు. అంతటితో ఆగక ఆ దాడిలో లేని వ్యక్తులనూ కేసులో చేర్చుతారు. గన్నవరం నియోజకవర్గంలో ఇప్పటికీ ఇటువంటివి కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం మారడంతో అదే పోలీసులు ఇప్పుడు టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. తమకు అనుకూలమైన ప్రాంతంలో పోస్టింగుల కోసం ప్రాధేయపడుతున్నారు.

వేధించినవారే నేడు పోస్టింగ్‌ల కోసం టీడీపీ నాయకుల చెంత పైరవీలు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : నగరంలో వంశీ నివాసం వద్ద జరిగిన ఘటనలో టీడీపీ కార్యకర్తలది ఎంత తప్పు ఉందో, వంశీ అనుచరులదీ అంతే తప్పు ఉందని టీడీపీ నాయకులు చెబుతున్నారు. వంశీ అనుచరులు కవ్వింపు చర్యలకు దిగడంతో టీడీపీ కార్యకర్తలు, వంశీ అనుచరుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో పోలీసులు ఏకపక్షంగా టీడీపీ కార్యకర్తలపై దాడి చేసి నిర్దాక్షిణ్యంగా కొట్టారు. ముఖ్యంగా యార్లగడ్డ అనుచరులను టార్గెట్ చేసి కొట్టడం గమనార్హం. ఈ ఘటనలో ఎస్బీ ఏసీపీ, టాస్క్‌ఫోర్స్ సీఐ క్రిష్ణ శ్రీధర్ కుమార్, విజయవాడలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న సీఐలు డీఎస్పీ ప్రసాద్, గుణరాం, దుర్గారావు, మోహన్‌రెడ్డి.. యార్లగడ్డ అనుచరులను టార్గెట్ చేసి మరీ కొట్టించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ దాడిలో పలువురు కార్యకర్తలకు చేతులు, కాళ్లు ప్రాక్చర్లు కావడం గమనార్హం. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు కనీస భద్రత కల్పించని పోలీసులు విజయవాడలోని వంశీ ఇంటి వద్ద పోలీసు పికెట్ నిర్వహించడం ఏమిటని టీడీపీ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.

వైసీపీ కవ్వింపులపై స్పందన నిల్

బాపులపాడు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పొట్లూరు బెనర్జీని అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు వాట్సాప్‌లో బూతులు తిడుతూ మెసేజ్‌లు పెట్టారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళుతుండగా దారి కాచి కొట్టారు. దీంతో బెనర్జీ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో గ్రామానికి వచ్చిన పోలీసులు వైసీపీ నాయకుడిని, బెనర్జీని అక్కడి నుంచి పంపించివేశారు. ఈ ఘటనపై బెనర్జీ హనుమాన్‌జంక్షన్ పోలీసులకు ఫిర్యాదు చేసి 10 రోజులు అయినప్పటికీ ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదు. ఇటువంటి చిన్న విషయాలకు కేసు కట్టేది లేదని ఎస్ఐ పేర్కొన్నారని బెనర్జీ ఆరోపిస్తున్నారు.

పోలీసుల తీరుకు ఇవిగో నిదర్శనాలు..

- నెల క్రితం వేలేరు గ్రామంలోని ఊర చెరువులో కోళ్ల వ్యర్థాలను చేపలకు మేతగా వేస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. ఇక్కడ జరిగిన వివాదంలో చాపల పాటదారు స్థానిక యువకుడిని కులం పేరుతో దూషించి కొట్టడంతో గాయపడిన యువకుడు ఏలూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొంది హనుమాన్‌జంక్షన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టినప్పటికీ పోలీసులు ఇంతవరకు కేసు నమోదు చేయకుండా జాప్యం చేస్తున్నారు. ఈ కేసు విషయంలో బాధితులు ఎస్పీని కలిసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది.
- హనుమాన్‌జంక్షన్ సీఐగా పనిచేస్తున్న నరసింహమూర్తిపై వంశీకి అనుంగు అనుచరుడన్న ముద్ర ఉంది.

- మిగతా 4లో

లోన్ రికవరీ ఆఫీసులో వైసీపీ నేతల వీరంగం

ఫర్నీచర్, కంప్యూటర్లు ధ్వంసం

విజయవాడ/సత్యనారాయణపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : రికవరీ కార్యాలయంపై వైసీపీ నేతలు విరుచుకుపడ్డారు. కార్యాలయంలోకి చొరబడి వీరంగం చేశారు. ఎదురుగా ఉన్న ఫర్నీచర్‌ను విరగ్గొట్టారు. టేబుల్‌పై ఉన్న కంప్యూటర్లను నేలకేసి కొట్టారు. దీనిపై సత్యనారాయణపురం పోలీసులు కేసు నమోదు చేశారు. గాంధీనగర్ జింఖానాగ్రౌండ్ సమీపంలో ధనీ లోన్స్ అండ్ సర్వీస్ కార్యాలయం ఉంది. ఈ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది రుణాల రికవరీలు చేస్తుంటారు. బుధవారం మధ్యాహ్నం వైసీపీకి చెందిన దుర్గాసాయి అనే మహిళతో పాటు ఏడుగురు పురుషులు, ఇద్దరు మహిళలు ఈ కార్యాలయానికి వచ్చారు. అసలు విషయం ఏమిటో, సమస్య ఏమిటో చెప్పకుండానే వీరంగం సృష్టించారు. దీనికి ఒక కారణాన్ని బయటకు చెప్పుకొచ్చారు. వ్యభిచారం జరుగుతుందని పెద్దపెద్ద కేకలు వేశారు. కనిపించిన కంప్యూటర్లను నేలకేసి కొట్టారు. సీపీయూలను ఇష్టానుసారంగా విసిరేశారు. ఫర్నీచర్ విరిచేశారు. అడ్డుకోబోయిన బొంతు శిరీష అనే మహిళపై దాడి చేశారు. వీరంతా ఏపీ39యూకే7343 నెంబరు కారులో వచ్చి మూకుమ్మడిగా దాడి చేశారు. నిమిషాల వ్యవధిలో కార్యాలయాన్ని చెల్లాచెదురు చేశారు. దీనిపై కార్యాలయంలోని సిబ్బంది సత్యనారాయణపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కొడాలి నాని అనుచరుడి ఇసుక అక్రమాలకు చెక్

గుత్తా నానీకి చెందిన 70 ట్రక్కుల ఇసుక సీజ్

గుడివాడ రూరల్ : టీడీపీ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే అక్రమార్కుల భరతం పడుతోంది. కలుగుల్లో దాగి ఉన్న వైసీపీ ఎలకలను బయటకు లాగుతోంది. వైసీపీ అధికారంలో ఉన్నంతకాలం కాలర్ ఎగరేసి అక్రమాలకు తెగబడినవారి గుట్టును బయటకు లాగుతోంది. గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నానీకి ప్రధాన అనుచరుడిగా ఉన్న గుత్తా నాని ఇసుక దందాకు చెక్ పెట్టింది. గుడివాడ మండలం శేరీ వేల్పూరు పంచాయతీ పరిధిలోని హరియాలీ పక్కన 70 ట్రక్కుల ఇసుక గుట్టను ఆర్ఐ నాగబాబు, వీఆర్వో లక్ష్మణరావు బుధవారం రాత్రి సీజ్ చేశారు. ఇసుక గుట్ట బొమ్మలూరు గ్రామానికి చెందిన కొడాలి నాని అనుచరుడు, వైసీపీ నాయకుడు గుత్తా నానీకి చెందినదిగా గుర్తించినట్లు వారు తెలిపారు. కేసు నమోదు చేస్తామని గురువారం విచారణ జరుపుతామన్నారు.

బీఎస్ఎన్ఎల్ టవర్ల సామర్థ్యం పెంపు

- 4జీ కేటాయించిన కేంద్రం
- ఏడాదిలో 5జీ సేవలకు రంగంసిద్ధం

4లో..


కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న గ్రేడ్-2 వీఆర్వోలు

పదోన్నతులు కల్పించండి

» కలెక్టర్‌కు గ్రేడ్-2 వీఆర్వోల వినతి

మోపిదేవి, జూన్ 19 : రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న గ్రేడ్-2 వీఆర్వోలకు పదోన్నతులు కల్పించాలని జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ డి.కె. బాలాజీకి వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.వి.శ్యామ్ నాథ్ ఆధ్వర్యంలో గ్రేడ్-2 వీఆర్వోలు కలెక్టర్‌ను కలిసి సమస్యలు ఏకరువు పెట్టారు. గడిచిన కొద్ది సంవత్సరాలుగా గ్రేడ్-2 వీఆర్వోలుగా సేవలందిస్తున్నామని, సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలంటూ పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


కూచిపూడిలో ఎండ తీవ్రతకు ఒడిలి పోయిన వరి నారుమడి

నారుమడులకు ఎండదెబ్బ!

కూచిపూడి, జూన్ 19 : అధిక ఉష్ణోగ్రతలకు వరి నారుమడులు ఒడిలిపోతున్నాయి. మండల పరిధిలోని కారకంపాడు, పెడసనగల్లు, పెదపూడి, మొవ్వ, భట్లపెనుమర్రు తదితర గ్రామాల్లో బోర్ల కింద, ఆయిల్ ఇంజన్ల ద్వారా రైతులు ఇప్పటికే వరి నారుమడులు పోశారు. అయితే జూన్ నెలాఖరు సమీపిస్తున్నప్పటికీ వరుణుడు కరుణించకపోవటంతో నారుమడులు ఎండిపోయే దశకు చేరుకున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. నారుమడులు రక్షించుకునేందుకు ఆయిల్ ఇంజన్ల ద్వారా అధిక మొత్తాన్ని వెచ్చించాల్సి వస్తున్నదని రైతులు పేర్కొంటున్నారు. వర్షాలు కురిస్తే నారుమడులు జీవం పోసుకునే అవకాశం ఉందన్నారు.


అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న బుద్ధప్రసాద్

సకాలంలో సాగునీరు అందిస్తాం..

» మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, జూన్ 19 : ఈ ఏడాది రైతులకు సాధ్యమైనంత మేరకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. బుధవారం అవనిగడ్డలో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇరిగేషన్ ఎస్ఈ టి.జె.హెచ్.ప్రసాద్, ఈఈ పీవీఆర్.కృష్ణారావు, ఆర్సీ డీఈ భానుబాబు, మచిలీపట్నం డీఈఈ మురళీకృష్ణ, డీఈఈ రావెళ్ల రవికిరణ్, జేఈలతో నియోజకవర్గ సాగునీటి వనరుల పరిస్థితి, నిధుల లభ్యతపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు ఇరిగేషన్, డ్రెయినేజీ వ్యవస్థలను నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితి, ప్రాజెక్టుల ద్వారా నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ అంశంపై సీఎం చంద్రబాబు తీవ్రంగా ఆలోచిస్తున్నారని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో జిల్లాలో పరిస్థితి గురించి కలెక్టర్ సమీక్ష చేయనున్నట్టు తెలిపారు.



లోకేశ్‌ను కలిసిన రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు

విజయవాడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మంత్రి నారా లోకేశ్‌ను స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు బుధవారం కలిశారు. ఆ శాఖ డీఐజీ జి.శ్రీనివాసరావు, విజయవాడలోని జిల్లా రిజిస్ట్రార్ రామారావు, గాంధీనగర్ సబ్‌రిజిస్ట్రార్ ప్రసాద్, గుణదల సబ్‌రిజిస్ట్రార్ ప్రసాద్, నల్లపాడు సబ్‌రిజిస్ట్రార్ బి.గోపాల్ కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.



ఎన్టీఆర్ జిల్లా ఈఓపీఆర్‌డీల కార్యవర్గం ఎన్నిక

వన్‌టౌన్, జూన్ 19 : ఎన్టీఆర్ జిల్లా ఈఓపీఆర్‌డీల కమిటీకి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బుధవారం కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు నాయకులు సమావేశమయ్యారు. అధ్యక్షుడిగా బొజ్జగాని శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీగా బొమ్మసాని శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ఎండీవీ ప్రసాద్, శ్రీ మనోజ్, సంయుక్త కార్యదర్శులుగా ఎంవీఎన్కే పరమాత్మ, పి.మాధవి, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.పద్మావతి, కోశాధికారిగా డీవీఎల్వీ శేషగిరిరావులను ఎన్నుకున్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించండి

మచిలీపట్నం టౌన్, జూన్ 19 : ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు నూరుశాతం ఫీజు రాయితీ కల్పించాలని మంత్రి కొల్లు రవీంద్రను జర్నలిస్టు సంఘ నాయకులు బుధవారం కోరారు. ఆర్అండ్‌బీ అతిథి గృహంలో వివిధ అధికారులు, టీడీపీ కార్పొరేటర్లు, టీడీపీ ఇన్‌చార్జిలతో జరిగిన సమావేశంలో కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. మచిలీపట్నం నగరంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బాలాజీతో పాటు డీఆర్వో కె.చంద్రశేఖర్, కమిషనర్ బాపిరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనండి

మచిలీపట్నం టౌన్, జూన్ 19 : మచిలీపట్నం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో 21వ తేదీ ఉదయం 6 గంటలకు జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో యోగసాధకులు, పోలీసులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొనాలని డీఆర్వో చంద్రశేఖర్ సూచించారు. బుధవారం డీఆర్వో కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో డీఆర్వో మాట్లాడారు. 21న ఉదయం జరిగే కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ, ఎస్పీ అద్నాన్‌నయీంఅస్మి పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ వెంకటేశ్వరరావు, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ ఝాన్సీ, ఆయూష్ అధికారి, డీవైఈవో సింగ్, ఎంఈవో దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ డే జరపండి

మచిలీపట్నం టౌన్, జూన్ 19 : జిల్లాలోని వివిధ ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో గురువారం రెవెన్యూ డే జరపాలని డీఆర్వో చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు రెవెన్యూ సేవలు, నీటి తీరువాపై అవగాహన కల్పించాలన్నారు. రెవెన్యూ శాఖలో పదవీ విరమణ పొందిన అధికారులను సత్కరించాలన్నారు.

అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టండి

» ప్రతి ఇంటికి రక్షిత నీరు అందించాలి
» కాలువలు, డ్రెయిన్‌ల మరమ్మతులపై దృష్టి
» అమృత్ 2.0 నిధులతో పనులు చేపట్టండి
» బందరు పోర్టు అభివృద్ధిపై త్వరలో సమీక్ష
» కృష్ణా అధికారులతో మంత్రి కొల్లు రవీంద్ర


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, హాజరైన జిల్లా అధికారులు

మచిలీపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేయాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన మేరకు ప్రతిఇంటికి కుళాయిలు ఏర్పాటుచేసి సురక్షిత మంచినీటిని అందించాలని గనులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుత సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో మంత్రి సమీక్షించారు. సాగునీటి కాలువలు, డ్రెయిన్‌లలో తూడు తొలగింపు, పూడికతీత, షట్టర్ల మరమ్మతులు, సాగునీటి కాలువల నిర్వహణ పనులపై మంత్రి ఆరా తీశారు. 245పనులను రూ.55కోట్లతో చేసేందుకు గతంలోనే ప్రతిపాదనలు పంపామని, అనుమతులు రావాల్సి ఉందని నీటి పారుదలశాఖ అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. వర్షాకాలం వచ్చినా ఇంతవరకు కాలువలకు మరమ్మతు పనులను ప్రారంభించకుండా ఉండటం ఏమిటని మంత్రి ప్రశ్నించారు. కృష్ణాడెల్టాకు సాగునీటిని విడుదల చేసేందుకు ఉన్న అవకాశాలపై వివిధ సాగునీటి ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వలను మంత్రి అడిగి తెలుసుకున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

మచిలీపట్నంతో పాటు ఇతర నియోజకవర్గాలల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో రూ.225 కోట్లతో 212పనులు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. తాగునీటి చెరువులను తవ్వేందుకు డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టును తనకు పంపాలని మంత్రి అధికారులకు సూచించారు. ప్రతి ఇంటికి కుళాయిని ఏర్పాటుచేసి రక్షిత మంచినీటిని అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారని మంత్రి తెలిపారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

జిల్లాలో ఖరీఫ్‌సీజన్‌కు సంబంధించి రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని వ్యవసాయశాఖ అధికారులను మంత్రి రవీంద్ర ఆదేశించారు. ముందస్తుగానే ఇండెంట్‌పెట్టి విత్తనాలు, ఎరువులను జిల్లాకు రప్పించాలని, సీజన్ ముగిసేవరకు రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందించే అంశంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బందరుపోర్టు 2025 అక్టోబరు నాటికి పూర్తిచేసేలా పనులను వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. ఇప్పటివరకు పోర్టుపనులు ఎంతమేర చేశారని వివరాలు అడిగారు. రూ. 5,156కోట్ల అంచనాలతో బందరుపోర్టు పనులు ప్రారంభించగా, ఇప్పటివరకు రూ.709కోట్ల మేర పనులు జరిగినట్టు అధికారులు తెలిపారు. బందరుపోర్టు పనులపై త్వరలో పూర్తిస్థాయి సమీక్ష నిర్వహిస్తానని, అన్ని వివరాలతో అధికారులు సిద్ధంగా ఉండాలని మంత్రి అన్నారు. మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో అమృత్ 2.0కింద రూ 57.33కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఈ నిధులతో తాగునీటి సరఫరాకు సంబంధించిన పనులను చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో పారిశుద్ధ్యచర్యలను మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. జూలై 1వతేదీన సచివాలయ సిబ్బంది ద్వారా సామాజిక పింఛన్లు అందించేందుకు తగుచర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న పింఛను దరఖాస్తులను పరిశీలనచేసి అర్హులైన వారికి వెంటనే మంజూరు చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధిపథంలో నడిపేందుకు శక్తివంచన లేకుండా కృషిచేయాలని మంత్రి అన్నారు. కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ, ఆయా నియోజకవర్గాలలో జరుగుతున్న కార్యక్రమాలపై నివేదికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి, వివిధశాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పోర్టు పనులు వేగవంతం చేయండి

» కలెక్టర్ డీకే బాలాజీ


పోర్టు పనుల మ్యాప్ పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ

మచిలీపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : బందరు పోర్టు పనులను వేగవంతం చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో బుధవారం జేసీ గీతాంజలి శర్మతో కలిసి రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షాసమావేశం నిర్వహించారు. పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోర్టు నిర్మాణం నిమిత్తం భూసేకరణ, పోర్టుకోసం భూమి ఇచ్చిన రైతులకు నష్టపరిహారం అందించే అంశాలను తెలుసుకున్నారు. పరిహారం చెల్లింపుపై త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. జూలై 5వ తేదీ నాటికి అధికారులు సంసిద్ధులు కావాలన్నారు. బందరుపోర్టు పనులు జరుగుతున్న ప్రాంతాన్ని కలెక్టర్ అధికారులతో కలసి బుధవారం పరిశీలించారు. పోర్టు పనుల్లో భాగంగా జరుగుతున్న డ్రెడ్జింగ్, బ్రేక్‌వాటర్, బెర్త్‌ల నిర్మాణం, రోడ్‌కంరైలు మార్గాల అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. భూసేకరణ అంశంలో కోర్టు వివాదాలు చాలామటుకు పరిష్కారమయ్యాయని, అసైన్డ్ భూములకునగదుచెల్లింపులకు సంబంధించిన వివాదాలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పోర్టు డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఈడీ విద్యాసాగర్, మెఘాసంస్థ జీఎం తులసీదాస్, ఆర్డీవో ఎం వాణి, తహసీల్దార్ సతీష్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

సరైన అవగాహనతో సికిల్ సెల్ నిర్మూలన

» వ్యాధికి అడ్డుకట్ట వేసేందుకు పటిష్ఠ కార్యాచరణ
» 19 నుంచి జూలై 3 వరకు అవగాహన కార్యక్రమాలు
» గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు


వైద్యాధికారులతో కలిసి పోస్టర్లు, కరపత్రాలు, మ్యాన్యువల్స్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, జూన్ 19 : సరైన అవగాహనతో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని నిర్మూలించవచ్చని జూన్ 19 నుంచి జూలై 3 వరకు గిరిజన సంక్షేమ, వైద్య ఆరోగ్యశాఖల సమన్వయంతో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. బుధవారం ప్రపంచ సికిల్ సెల్ దినం సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో గిరిజన సంక్షేమం, వైద్య ఆరోగ్య శాఖల అధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు, ఆర్డీవో వి.శ్రీనివాసరావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జె.సునీత, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, వైద్యాధికారులతో కలిసి సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్ వ్యాధి సమగ్ర సమాచారానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలు, మ్యాన్యువల్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై 15రోజులపాటు పాఠశాలలతో పాటు ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఇందుకు క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. 2047 నాటికి సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్‌లో భాగంగా వివిధ వర్గాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. సికిల్ సెల్ వ్యాధి వారసత్వంగా తల్లిదండ్రుల నుంచి అనువంశికంగా సంక్రమిస్తుందన్నారు. రక్తహీనత, కళ్లు పసుపురంగులో మారడం, తీవ్రమైన ఒళ్లు, కీళ్లనొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, తరచుగా అంటు వ్యాధులు, గర్భధారణ సమయంలో సమస్యలు, అవయవ వైఫల్యం పెరుగుదల సమస్యలు కలిగి ఉంటాయన్నారు. శరీరంలో తగినంత నీటి శాతం పాటించడం, సమతుల ఆహారం, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ముందు తరాలకు వ్యాధి వ్యాపించకుండా నిరోధించాలంటే సరైన అవగాహన ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్‌లోని ముఖ్యాంశాలు, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి లక్షణాలు, నిర్ధారణ పరీక్ష, సికిల్ సెల్ ఎనీమియా చికిత్స తదితర అంశాలపై డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.సుహాసిని వివరించారు. గిరిజన ప్రాంతాల్లో నిర్వహించే అవగాహనా కార్యక్రమాల కార్యాచరణ ప్రణాళిక, క్షేత్రస్థాయి అధికారుల సమన్వయం తదితర అంశాలను జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జె.సునీత వివరించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ బీసీకే నాయక్, డీఐవో డాక్టర్ అమృత, డీఎంవో డాక్టర్ మోతీబాబు, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ జె.సుమన్, ఆర్‌బీఎస్‌కే కార్యక్రమ అధికారి డాక్టర్ మాధవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఇందుమతి, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

బందరులో అవగాహన ర్యాలీ

మచిలీపట్నం టౌన్ : ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి బుధవారం డిఎంహెచ్‌వో కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా గీతాబాయి మాట్లాడుతూ, జిల్లాలో 0 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు గల వారికి అన్ని పీహెచ్‌సీలలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో అవగాహనర్యాలీలు, సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఎ.సీతాకుమారి, కార్యక్రమ నిర్వహణ అధికారి అరుణ్‌కుమార్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, కార్యాలయ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.


డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీలో పాల్గొన్న గీతాబాయి

బీఎస్ఎన్ఎల్ టవర్లు, సామర్థ్యం పెంపు

» 4జీ కేటాయించిన కేంద్రం
» ఏడాదిలో 5జీ సేవలకు రంగం సిద్ధం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

టెలికం రంగంలో ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ కీలక నిర్ణయం తీసుకుంది. రాజధానికి కుడి, ఎడమగా ఉన్న ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో మొబైళ్లకు సిగ్నల్స్‌ను ప్రసారం చేసే టవర్ల సంఖ్యను పెంచాలని నిర్ణయించింది. దీనికి ప్రధాన కారణం తాజాగా బీఎస్ఎన్ఎల్‌కు 4జీ సేవలను కేటాయించడమేనని ఆ శాఖ అధికారవర్గాలు చెబుతున్నాయి. టవర్ల సంఖ్యను పెంచడంతో పాటు వాటి సామర్థ్యాన్ని పెంచడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 4జీ సెటప్ పూర్తయితే 5జీ సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి ఎంతో సమయం పట్టదని చెబుతున్నారు. ఈ సేవలు అందుబాటులోకి రావడానికి ఏడాది సమయం పట్టవచ్చని తెలుస్తోంది.



రెండు నగరాల్లో 500 టవర్లు

విజయవాడ, గుంటూరు నగరాల్లో బీఎస్ఎన్ఎల్‌కు 400-500 టవర్లున్నాయి. రాష్ట్రంలో మొత్తం 4500 టవర్లు ఉన్నాయి. విజయవాడ, గుంటూరు నగరాల్లో ఉన్న 500 టవర్లు ప్రస్తుతం 3జీలో ఉన్నాయి. వాటిని అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది. ఈ టవర్ల వద్ద కోర్ ఎక్విప్‌మెంట్‌ను అమర్చాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో 3829 గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ సేవలు అందడం లేదని సాంకేతిక బృందం గుర్తించింది. ఈ ప్రాంతాల్లో కొత్తగా 1399 టవర్లను ఏర్పాటు చేయాలని బీఎస్ఎన్ఎల్ సంకల్పించింది. వాటిలో 1000 టవర్ల పనులు పూర్తిదశకు చేరుకుంటున్నాయి. రాష్ట్రంలో మొత్తం 2.30లక్షల ఫైబర్ నెట్ కనెక్షన్లు ఉన్నాయి. మొత్తం 500 ప్రదేశాల్లో 4జీ టవర్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న టవర్ల స్థానంలో 4జీ టవర్లను ఏర్పాటు చేయాలన్న యోచనలో అధికార వర్గాలు ఉన్నాయి. ఈ టవర్ల సామర్థ్యం 100 ఎంబీ ఉంటుంది. ఒక్కో టవర్ సిగ్నల్ వేగ పరిమితి 1జీబీ ఉంటుంది. ప్రస్తుతం కొత్త టవర్ల ఏర్పాటు జరుగుతున్నందున రాజధాని పరిధిలో ఉన్న విజయవాడ, గుంటూరు నగరాల పరిధిలో ఉన్న టవర్ల సామర్థ్యాన్ని పెంపుదల చేయాలని నిర్ణయించారు.

5జీకి ఎంతో సమయం పట్టదు

- శేషాచలం, బీఎస్ఎన్ఎల్ సీజీఎం

ఇప్పటి వరకు బీఎస్ఎన్ఎల్‌కు 4జీ అనుమతి లేదు. కేంద్రం కొద్దిరోజుల క్రితమే ఈ సేవలు ఇవ్వడానికి అనుమతి వచ్చింది. రాష్ట్రంలో ఉన్న అన్ని టవర్ల వద్ద 4జీ కోర్ ఎక్విప్‌మెంట్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ఇది పూర్తయిన తర్వాత 5జీ సేవలు అందివ్వడానికి ఎంతో సమయం పట్టదు. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ టవర్లు 3జీలో ఉన్నాయి. ఇక్కడ 4జీ కోర్ ఎక్విప్‌మెంట్ అమర్చిన తర్వాత 5జీ కోసం ఇలాంటివి ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదు. సాఫ్ట్‌వేర్‌లో కమాండ్‌ను అప్‌డేట్ చేస్తే సరిపోతుంది. ఏడాదిలో రాష్ట్రంలో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు 5జీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశం ఉంది.


సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

సచివాలయ అడ్మిన్ సెక్రటరీపై వేటు

» ప్లానింగ్ సెక్రటరీకి షోకాజ్ నోటీస్
» కమిషనర్ కఠిన చర్యలు

జగ్గయ్యపేట, జూన్ 19 : విధులకు డుమ్మా కొట్టిన 14వ సచివాలయ అడ్మిన్ సెక్రటరీ ఎం.శరత్‌చంద్రను కమిషనర్ నాగమల్లేశ్వరరావు సస్పెండ్ చేశారు. బుధవారం తనిఖీలకు వెళ్లిన కమిషనర్ రికార్డులు తనిఖీ చేయగా అడ్మిన్ సెక్రటరి రోజుల తరబడి విధులకు హాజరు కావటం లేదని, రికార్డులు సక్రమంగా నిర్వహించనందున సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటరీ ఎం.శరత్‌చంద్రకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రికార్డులను సక్రమంగా భద్రపరచాలని కోరారు.

వలంటీర్లను రోడ్డున పడేసిన వైసీపీ ప్రభుత్వం

మచిలీపట్నం టౌన్, జూన్ 19 : వలంటీర్లను రాజీనామాలు చేయించి వైసీపీ ప్రభుత్వం రోడ్డున పడేసిందని, ఈ వ్యవస్థపై త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర మైన్స్, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం అయన మీడియాతో మాట్లాడారు. రాజీనామా చేశాం, పొరపాటయిందని ఇంటికి వచ్చి పలువురు వలంటీర్లు చెబుతున్నారని, దీనిపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుందన్నారు. ప్రతినెలా పెన్షన్‌దారులకు ఇళ్లకు వెళ్లి పెన్షన్ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

జన సైనికుల నిరసన

మచిలీపట్నం టౌన్, జూన్ 19 : గతంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌పై అనుచిత పోస్టింగ్‌లు పెట్టినందుకు ఎలక్ట్రికల్ డీఈ మన్నెం భాస్కరరావు ఇంటి ముందు జనసేన నాయకులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పొరపాటున షేర్ చేశానని డీఈ జనసేన కార్యకర్తలకు తెలిపారు. అనంతరం పవన్‌కళ్యాణ్ చిత్రపటానికి ఎలక్ట్రికల్ డీఈ పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కొట్టె వెంకట్రావు, శాయన శివశ్రీను, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాడు వేధించి.. నేడు వేడుకోలు

(3వ పేజీ తరువాయి)

లోకేశ్ 'యువగళం' పాదయాత్ర సమయంలో రంగన్నగూడెంలో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఫ్లెక్సీకి సంబంధించి గొడవ తలెత్తింది. ఈ ఘటనపై టీడీపీ నాయకులు దేవినేని ఉమ, కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు. వారు పోలీసుస్టేషన్‌లో ఉన్న సమాచారాన్ని వంశీకి చేరవేయడంతో ఆయన ఆగమేఘాలపై స్టేషన్‌కు వచ్చి టీడీపీ వారిపై తన అనుచరులతో ఎదురు కేసు పెట్టిస్తే దానిపై వెంటనే కేసు నమోదు చేశారు.

- గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై దాడి జరిగిన సమయంలోనూ గన్నవరం ఇన్‌చార్జి సీఐగా ఉన్న నరసింహమూర్తి టీడీపీ నాయకుడు పట్టాభిని అరెస్టు చేయడంలో అత్యుత్సాహం చూపారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు నందిగామ నియోజకవర్గంలోని కంచికచర్ల సీఐగా బదిలీ చేయించుకునేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారు. స్థానిక టీడీపీ నాయకులు కోగంటి బాబు తదితరులను ఆశ్రయించి తనను కంచికచర్ల సీఐగా బదిలీ చేయించాలని కోరుతున్నట్లు సమాచారం. నిన్నటి వరకు టీడీపీ నేతలను తీవ్రంగా వేధించిన ఇలాంటి వారిని కంచికచర్ల వంటి కీలక స్థానానికి తీసుకొచ్చేందుకు ఎలా ఫైరవీలు చేస్తారంటూ టీడీపీ అభిమానులు ప్రశ్నిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	152, 161, 172
చికెన్ విత్ స్కిన్	296
చికెన్ స్కిన్‌లెస్	306
నెక్ కోడిగుడ్డు ధర	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.85	

పవన్ కల్యాణ్‌కు రామ్మోహనరావు అభినందనలు

గవర్నర్‌పేట, జూన్ 19: ఉపముఖ్యమంత్రి హోదాలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణ, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌ను సివిల్ కోర్టుల సమీపంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఐక్య కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు బేతు రామ్మోహనరావు కలిసి అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సరికొత్త మార్గాన్ని చూపాలని విజ్ఞప్తి చేశారు.





హోం మంత్రికి జాస్తి సత్కారం

వన్‌టౌన్, జూన్ 19: హోంమంత్రి వంగలపూడి అనితను ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు సత్కరించారు. సచివాలయం రెండో బ్లాకులోని ఆమె చాంబర్‌లో ఆయన కలిసి దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. జే.అమర్ శేషేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా

శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం

● నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని వైనం
● 44వ డివిజన్ పారిశుధ్య సిబ్బంది ఇబ్బందులు



భవానీపురం, జూన్ 19 : విద్యాధరపురం స్టేడియం ప్రాంతంలో లేబర్ కాలనీలో ఆర్భాటంగా వేగవంతంగా నిర్మించిన 44వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఇంకా ప్రారంభానికి నోచుకోకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఈ భవనం ఈ ఏడాది జనవరిలోనే నిర్మాణం పూర్తయినా అప్పటి ఎమ్మెల్యేకు తీరిక లేకపోవడంతో నిరుపయోగంగా ఉంచేశారు. ఆయన్ని సెంట్రల్‌కు మార్చడంతో పశ్చిమ అభివృద్ధిని వెలంపల్లి శ్రీనివాస్ పట్టించుకోలేదు. మేయర్ చేయాల్సిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో ఈయన అతిగా స్పందించి, అన్ని నేనే అన్న రీతిలో వ్యవహరించడంతో దీన్ని ప్రారంభించకుండా వదిలేశారు. వైసీపీ ప్రభుత్వం కథ ముగిసిపోయిన నేపథ్యంలో ఇప్పుడు మేయర్, కార్పొరేటర్లు కలిసి వినియోగంలోకి తేవాలని శానిటరీ సిబ్బంది కోరుతున్నారు. అరకొర వసతుల నడుమ లేబర్ కాలనీలో వీఎంసీ కల్యాణమండపంలోనే మస్తర్లు వేసుకుని, సామగ్రిని సిబ్బంది నిల్వ చేసుకుంటున్నారు. లక్షల పోసి కట్టినా కాంట్రాక్టర్ తాళాలు ఇంకా అప్పగించలేదని సమాచారం. ఈ వ్యవహారంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

దుర్గగుడిలో

కన్నులపండువగా పల్లకీసేవ



వన్‌టౌన్, జూన్ 19: దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో బుధవారం సాయంత్రం కన్నుల పండువగా పల్లకీసేవను నిర్వహించారు. ప్రతిరోజూ సాయంత్రం వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ భక్తుల కోలాహలం మధ్య పల్లకిసేవను నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో నిర్వహించిన పల్లకీసేవలో ఈవో కేఎస్ రామారావు పల్లకిని మోసి అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ● కనకదుర్గమ్మ వారికి బుధవారం సాయంత్రం ప్రదోష వేళలో పంచహారతులు సమర్పించిన తరువాత భక్తులతో పాటుగా ఈవో కేఎస్ రామారావు క్యూలో నడిచి వచ్చారు. ఇదే సందర్భంలో భక్తులతో మాట్లాడుతూ ఆలయంలో వసతి సౌకర్యాలపై అభిప్రాయ సేకరణ చేశారు. సామాన్య భక్తుడిలా క్యూ మార్గంలో వచ్చిన ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు.

విజయవాడను ప్రపంచస్థాయి నగరంగా నిలబెడతాం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్


13వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న గద్దె రామ్మోహన్

పటమట, జూన్ 19 : విజయవాడను ప్రపంచ స్థాయిలో అగ్రగామి నగరాల సరసన నిలబెడతామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 13వ డివిజన్ జేడీ నగర్‌లో రూ.20 లక్షలతో నిర్మాణం చేపట్టే సిమెంట్ రోడ్డు, ఎలక్ట్రిసిటీ కాలనీలో రూ.15లక్షల వ్యయంతో జిమ్ ఏర్పాటుకు రామ్మోహన్ బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు నిర్లక్ష్యంగా కారణంగా నియోజకవర్గంలోని భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ అంతా అస్తవ్యస్తంగా మారిందన్నారు. చంద్రబాబు హయాంలో ప్రజలకు సంక్షేమం, అభివృద్ధిని సమంగా చేసి చూపిస్తారన్నారు. జేడీనగర్‌లోని అన్ని రహదారులను పునర్నిర్మిస్తామన్నారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, గద్దె ప్రసాద, పోతంశెట్టి నాగేశ్వరరావు, కొర్రపాటి శ్రీను, శొంఠి నాగేశ్వరరావు, సెక్రటరీ సాంబశివరావు, మూల్పూరి బాలకృష్ణ, పి.సుబ్బయ్యలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

12వ డివిజన్ సంజయ్ గాంధీ కాలనీలో దామోదరం సంజీవయ్య నగర పాలక సంస్థ పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పుస్తకాలు, బ్యాగులను, యూనిఫారాలను పంపిణీ చేశారు. హెచ్‌ఎం కే. ఏకాంబేశ్వరరావు, కార్పొరేటర్లు పొట్లూరి సాయిబాబు, ముమ్మనేని ప్రసాద్, శాయన బుజ్జి, జక్కుల సుబ్బారావు, మాదల చిన్నతల్లి, ఎన్. సూర్యనారాయణ, బాలు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి కేబీఎన్‌లో

ఇండియన్ స్టార్టప్స్‌పై అంతర్జాతీయ సదస్సు


సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేబీఎన్ కళాశాల యాజమాన్యం

వన్‌టౌన్, జూన్ 19: కాకరపర్తి భావనారాయణ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో ఇండియన్ స్టార్టప్స్-సమస్యలు-సవాళ్లు-అవకాశాలు అంశంపై అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు చెప్పారు. ఈ సందర్భంగా ఆ కళాశాల కమిటీ కార్యాలయంలో సదస్సు పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజుల అంతర్జాతీయ సదుస్సను నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ అంతర్జాతీయ సదస్సుకు సంబంధించి 21న జరిగే ప్రారంభసభకు స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరి ముఖ్య అతిథిగా, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సదరన్ రీజనల్ సెంటర్ డైరెక్టర్ ఆచార్య బి.సుధాకర్‌రెడ్డి గౌరవ అతిథిగా హాజరవుతారన్నారు. మలేషియాకు చెందిన ఏషియన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆచార్యులు ఆచార్య షరన్‌కుమార్‌షెట్టి కీలక ఉపన్యాసకుడిగా,యూఎస్‌ఏకు చెందిన ఆచార్య సత్యనారాయణ పరియిటమ్ ప్రధాన వక్తగా పలు విశ్వవిద్యాలయాలు, పారిశ్రామిక సంస్థలకు చెందిన ప్రముఖులు వక్తలుగా హాజరవుతారని వివరించారు. వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేష్, అధ్యాపకులు హేమంత్‌కుమార్, అరుణ్‌కుమార్, రవికిరణ్ పాల్గొన్నారు.

బొండా ఉమా అన్యాయాలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

● మాజీ కార్పొరేటర్ జగదీష్

ధర్నాచౌక్, జూన్ 19: విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా చేసిన అన్యాయాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తానని వైసీపీ నేత, మాజీ కార్పొరేటర్ నందెపు జగదీష్ తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. 2019లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన బొండా ఉమామహేశ్వరరావుకు మద్దతు ఇవ్వలేదనే కక్షతో అనుమతులు లేవనే సాకుతో రెండు భవనాలను వీఎంసీ అధికారులతో తొలగించారన్నారు. తన భవనాలతో పాటు మరో వంద భవనాలు అక్కడ ఉన్నాయని వాటిని ఏం చేస్తారని అధికారులను ప్రశ్నించారు. దళితుడుని కాబట్టే తనపై ఈ విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. 2014లో బొండా ఉమా గెలుపునకు ఎంతో కృషి చేశానన్నారు. ఇప్పుడు సెంట్రల్ నియోజకవర్గంలో జరుగుతున్న దౌర్జన్యాలు మరెక్కడా జరగడం లేదన్నారు. సీఎం చంద్రబాబు తనకు న్యాయం చేయకపోతే శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపడతానని హెచ్చరించారు.

'అసహజ మరణాల తగ్గింపునకు యోగా' పై అవగాహన



ధర్నాచౌక్, జూన్ 19: సమాజంలో పెరిగిన అసహజ మరణాలతో ప్రజల్లో పెరిగిన ఆందోళనలను తగ్గించాల్సిన బాధ్యత అందరిపై ఉందని యోగ శక్తి సాధన వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు. 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో బుధవారం 'అసహజ మరణాల తగ్గింపునకు యోగా శక్తి చికిత్స' అనే అంశంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద కళాశాల విద్యార్థినులకు యోగా శక్తి చికిత్స వైద్య విధానాన్ని వివరించారు. కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా డే రేపు

ధర్నాచౌక్, జూన్ 19: అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ ఆధ్వర్యంలో ఈ నెల 21న 10వ అంతర్జాతీయ యోగా డే వేడుకలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పీవీ రమణ, యోగా గురువు అంకాల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెంజ్‌సర్కిల్ సమీపంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్‌లో ఉదయం 5.30 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. సూర్య నమస్కారాలు, పలు యోగాసనాలతో పాటు ప్రాణాయామం శిక్షణ పొందిన 200 మందికి పైగా యోగా సాధకులు ప్రదర్శిస్తారన్నారు. కార్యక్రమ అనంతరం అతిథుల చేత యోగా సాధకులను ప్రసంసా ప్రతాలతో పాటు మెడల్స్ అందజేస్తామన్నారు.

యువకుడు ఆత్మహత్య



వన్‌టౌన్, జూన్ 19: పండిట్ నెహ్రూ బస్టాండ్ వద్ద మంగళవారం రాత్రి 12 గంటల సమయంలో సుమారు 35 సంవత్సరాల వయస్సు గల యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కృష్ణలంక గుంటూరు వారి వీధికి చెందిన తాడికొండ రాము సదరు యువకుడి మృతిపై కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతుడి శరీరంపై కాషాయరంగు హాఫ్ టీ షర్టు, సిమెంట్ కలర్ హాఫ్ నిక్కర్ ఉన్నాయి. వివరాలు తెలిసిన వారు కృష్ణలంక సీఐ ఏ.మురళీకృష్ణ 9440627086, ఎస్ఐ వై.దుర్గారావు 9492028570కు తెలియపరచాలని కోరారు.

ప్రమాద ఘటనపై కేసు

విద్యాధరపురం, జూన్ 19: ఊర్మిళానగర్‌కు చెందిన కామినేని మల్లికాంబ(62) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ఈమె గుప్తా సెంటర్‌లోని ఓ కవర్ల కంపెనీలో పనిచేస్తుంటుంది. ఆమె ఈ నెల 17న పెనమలూరులో ఉంటున్న సోదరుడి ఇంటికి వెళ్లి తిరిగి బస్సులో వచ్చి గుప్తా సెంటర్‌లో దిగింది. నడుచుకుంటూ వెళుతున్న సమయంలో ముగ్గురు వ్యక్తులతో వస్తున్న ఓ బైకు అతివేగంగా, నిర్లక్ష్యంగా, హారన్ కొట్టకుండా డ్రైవ్ చేసుకుంటూ ఆమెను ఢీకొన్నారు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకుని ఆమె కుమారుడు సంఘటన ప్రదేశానికి వచ్చి ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎనీమియా వ్యాధికి సత్వరమే చికిత్స తీసుకోవాలి



వన్‌టౌన్, జూన్ 19: ఎనీమియా వ్యాధి (సికిల్ సెల్)కి సత్వరమే చికిత్స తీసుకోవాలని 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం డివిజన్‌లో జరిగిన సికిల్ సెల్ అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమందిలో జన్యుసంబంధ మార్పుల వల్ల ఎర్రరక్తకణాలు కొడవలి ఆకారంలోకి మార్పు చెందుతాయని ఈ సందర్భంలో ఒకటి సికిల్ సెల్‌గాను ఒకటి సాధారణంగా ఉన్నట్లయితే వాటిని సికిల్ సెల్ క్యారియర్లు అని పిలుస్తారన్నారు. సాధారణంగా ఇటువంటి వారికి ఎటువంటి ఆరోగ్య సమస్యలుండవని, అయితే వివాహితులలో ఇటువంటి లక్షణాలు ఉన్నట్లయితే పుట్టే పిల్లల్లో రక్తకణాలలో రెండు జన్యువులు కొడవలి ఆకారంలో ఉంటాయన్నారు. దీంతో పుట్టుకతోనే ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. సికిల్‌సెల్ నశించిపోయేంత వేగంగా ఎర్ర రక్తకణాలు ఉత్పత్తి కాకపోవడంతో రక్తహీనతకు గురవుతారన్నారు. ఈ వ్యాధి ఉన్న వారు వెంటనే తగిన చికిత్స చేయించుకోవాలని తెలిపారు. డాక్టర్ శ్రీనివాసరావు, హెచ్‌వీ మస్తాన్, ఏఎన్ఎంలు, ఆషా వర్కర్‌లు పాల్గొన్నారు.

నేషనల్ షూటింగ్‌లో ముకేష్‌కు పతకాలు



విజయవాడ స్పోర్ట్స్, జూన్ 19 : మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో ఈనెల 2 నుంచి 19 వరకు జరిగన 22వ కుమార్ మెమోరియల్ నేషనల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముకేష్ నెలవల్లి వివిధ ఈవెంట్లలో సత్తా చాటి మూడు స్వర్ణాలు, రెండు రజతాలు, మూడు కాంస్యాలను వశం చేసుకున్నాడని ఏపీ రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తొట్టెంపూడి సలలిత్, డి.రాజ్‌కుమార్‌లు తెలిపారు. అన్ని ఈవెంట్లతో తనదైన శైలిలో ముకేష్ రాణించి ఏపీకి పతకాలను సాధించాడని వారు అభినందించారు.

మర్యాదపూర్వక కలయిక



వన్‌టౌన్,జూన్ 19: రాష్ట్ర ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను బుధవారం విజయవాడలో ఫ్యాప్సియా బృందం కలిసింది. మంత్రిని కలిసిన వారిలో ఫ్యాప్సియా అధ్యక్షుడు వాసిరెడ్డి మురళీకృష్ణ, కోశాధికారి జీవీ రెడ్డి, కార్యవర్గ సభ్యులు సుంకాని శ్రీనివాస్, ఈడుపుగంటి సాయి ఆదిత్య ఉన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

● డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాసరావు

వన్‌టౌన్, జూన్ 19: రానున్న వర్షాకాలంలో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీవో) బి. శ్రీనివాసరావు సంబంధిత అధికారులకు సూచించారు. విజయవాడ డివిజనల్ అధికారి కార్యాలయంలో విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రేడ్ -5 కార్యదర్శులతో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ వర్షాల సీజన్ ప్రారంభం సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. డ్రమ్ముల్లో, టైర్లలో లార్వా పెరగకుండా నీటి నిల్వలను తొలగించాలన్నారు. మురుగును, గార్బేజ్‌ను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. గ్రామాల్లో ప్రతివార్డులోను బ్లైటెక్స్, మలాథిన్‌ను చల్లించాలని తెలిపారు. వాటర్ హెడ్ ట్యాంక్‌లు, సెప్టిక్ ట్యాంక్‌లపై మూతలను ఏర్పాటు చేయాలన్నారు. కలుషిత నీరు మంచినీటి కుళాయిల్లోకి ప్రవేశించకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా మంచినీటిలో క్లోరినేషన్ చేయించే విషయంలో వైద్యాధికారి సూచనలను అమలు చేయాలన్నారు. డెంగ్యూ, మలేరియా, విషజ్వరాల బారిన పడినట్లయితే తక్షణ చర్యలు తీసకోవాలన్నారు. తగు విధంగా స్పందించని పంచాయతీ కార్యదర్శులపై తగు చర్యలు నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని చెప్పారు

ఎస్‌కే 30 షురూ



ఇప్పటిదాకా లవ్‌స్టోరీలు, మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌లతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన సందీప్ కిషన్ తన పంథా మార్చారు. తన కెరీర్‌లో చేయని సరికొత్త కథాంశంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన హీరోగా రూపొందుతున్న 30వ చిత్రం (ఎస్‌కే 30)లో ఓ సరికొత్త పాత్రలో అలరించబోతున్నారు. ప్రేమ, భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాలు చుట్టూ అల్లుకున్న కథ ఇది. బుధవారం ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. పలు బ్లాక్‌బస్టర్ ఎంటర్టైనర్‌లను అందించిన త్రినాథరావు నక్కిన 'ఎస్‌కే 30'కు దర్శకత్వం వహిస్తున్నారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ కలయికలో రాజేశ్ దండా భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. రావు రమేశ్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రసన్నకుమార్ బెజవాడ కథ, మాటలు అందిస్తున్నారు. లియోన్ జేమ్స్ సంగీత సారథ్యం వహిస్తున్నారు. డీవోపీ: నిజార్ షఫీ. ఎడిటర్: చోటా కే ప్రసాద్. బాలాజీ గుత్తా సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

కూల్ అవ్వండి మేడం గారు



విభిన్న భాషల్లో సినిమాలు చేస్తూ నటుడిగా జాతీయ స్థాయిలో చక్కని గుర్తింపు సొంతం చేసుకున్నారు దుల్కర్ సల్మాన్. తెలుగులోనూ 'మహానటి', 'సీతారామం' లాంటి చిత్రాలతో విజయాలను అందుకున్నారు. ఆయన తాజాగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్‌మెంట్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. 'లక్కీ భాస్కర్' చిత్రంలో బ్యాంక్ క్యాషియర్‌గా మునుపెన్నడూ చూడని కొత్త లుక్‌లో దుల్కర్ సల్మాన్ కనిపించనున్నారు. ఈ చిత్రం నుంచి 'కోపాలు చాలండి శ్రీమతి గారు..కొంచెం కూల్ అవ్వండి మేడం గారు' అంటూ సాగే గీతాన్ని యూనిట్ బుధవారం విడుదల చేసింది. జీవీ ప్రకాశ్ కుమార్ ప్రత్యేక శైలిలో స్వరపరిచిన ఈ గీతాన్ని విశాల్ మిశ్రా, శ్వేతా మోహన్‌లు ఆలపించారు. శ్రీమణి సాహిత్యం ఈ గీతానికి ప్రత్యేకాకర్షణగా నిలిచింది. దుల్కర్ సరసన మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నిమిష్ రవి, ఎడిటర్:నవీన్ నూలి

'నింద' అందరికీ నచ్చుతుంది



'కాంద్రకోట మిస్టరీ' అని మా సినిమా పోస్టర్ వదిలినప్పుడు అందరూ ఇది ఘోస్ట్ సినిమా అనుకున్నారు. టీజర్ తర్వాత అందరికీ ఓ క్లారిటీ వచ్చింది. వరుణ్ సందేశ్‌కు ఇది తగిన క్యారెక్టర్. ఆయనకు ఇది కమ్ బ్యాక్ సినిమా అవుతుంది' అన్నారు రాజేశ్ జగన్నాథం. వరుణ్‌సందేశ్ హీరోగా ఆయన స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'నింద' చిత్రం ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఈ కథ మీద నాకు నమ్మకం ఉంది. నిర్మాతల కోసం ప్రయత్నించా. ఆ తర్వాత వేరే వాళ్ల ఎందుకని నేనే నిర్మాతగా మారా. నాకు క్రియేటివ్ ఫీల్డ్ అంటే ఇష్టం. దర్శకత్వ శాఖ నాకు నచ్చింది. సినిమా తీయడం ఇష్టం కూడా. అయితే తీసిన సినిమాను విడుదల చేయడం ఎంత కష్టమో ఇప్పుడు అర్థమవుతోంది' అన్నారు. 'నింద' సినిమాలో ప్రతి పాత్ర అందరికీ గుర్తుండి పోతుంది. వరుణ్‌సందేశ్ కొత్తగా కనిపిస్తారు. చక్కని ఆర్టిస్టులతో ఈ సినిమా తీశాను. 'నింద' చూసిన తర్వాత మలయాళంలోనే కాదు తెలుగులోనూ కాన్సెప్ట్ బేస్డ్ చిత్రాలు వస్తున్నాయి అని ప్రేక్షకులు ఫీల్ అవుతారు' అన్నారు జగన్నాథం. తన దగ్గర స్క్రిప్టులు సిద్ధంగా ఉన్నాయనీ, ఇకపై దర్శకత్వం మీదే ఫోకస్ పెడతానని ఆయన చెప్పారు.



నా కెరీర్‌లో కల్కి లాంటి సినిమా చేయలేదు

అమితాబ్ బచ్చన్

'కల్కి 2898 ఏడీ' చిత్రంలో భాగమవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఇదో కొత్త ప్రపంచం, నా కెరీర్‌లో ఇప్పటిదాకా ఇలాంటి సినిమా చేయలేదు. 'కల్కి' చిత్రీకరణలో అనుభవాలను ఎప్పటికీ మర్చిపోలేను' అని అమితాబ్ బచ్చన్ అన్నారు.

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన చిత్రమిది. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ సహా పలువురు అగ్రనటులు కీలకపాత్రలు పోషించారు. దీపికా పదుకొనే, దిశాపటానీ కథానాయికలు. వైజయంతీ మూవీస్ బేనర్‌పై సి. అశ్వనీదత్ నిర్మించారు. ఈ నెల 27న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం ముంబైలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా అమితాబ్ బచ్చన్ మాట్లాడుతూ 'ఓ వినూత్నమైన చిత్రానికి రూపకల్పన చేసిన నాగ్ అశ్విన్, అతని బృందానికి నా అభినందనలు. ఆయన ఈ కథ చెప్పినప్పుడు ఆశ్చర్యపోయాను. అయన ఇలాంటి కథని ఎలా ఆలోచించగలిగాడో అనిపించింది. ఈ చిత్రంలో విజువల్స్ అసాధారణంగా ఉంటాయి. తన ఆలోచనలను తెరపైన అద్భుతంగా ఆవిష్కరించగలిగాడు. ఈ ఫ్యూచరిస్టిక్ ప్రాజెక్ట్ ఓ మహా అద్భుతం' అని నాగ్ అశ్విన్‌ను ప్రశంసించారు.



తన పాదాలకు నమస్కరించబోతున్న అమితాబ్‌ను వారిస్తున్న అశ్వనీదత్

కమల్‌హాసన్ మాట్లాడుతూ 'నాగ్ అశ్విన్ కూడా మా గురువుగారు బాలచందర్‌లా సాదాసీదాగా కనిపిస్తాడు కానీ అసాధారణ ప్రజ్ఞావంతుడు. తన ఆలోచనలను సృజనాత్మకంగా తెరకెక్కించగల నేర్పు నాగ్ అశ్విన్‌లో అపారంగా ఉంది. ఇందులో ప్రతినాయక ఛాయలున్న పాత్ర నాది. మంచి వినోదం పంచుతుంది. నా ఫస్ట్‌లుక్‌లానే సినిమా కూడా మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తుంది' అన్నారు.

ప్రభాస్ మాట్లాడుతూ 'దిగ్గజాలతో పనిచేసే అవకాశం కల్పించిన అశ్వనీదత్, నాగీకి ధన్యవాదాలు. దేశవ్యాప్తంగా పాపులారిటీ సాధించిన తొలి భారతీయ నటుడు అమితాబ్‌బచ్చన్. ఆయన నుంచి చాలా నేర్చుకున్నాను. నా చిన్నప్పుడు కమల్‌హాసన్ గారి సినిమాలు చూసి ఆయనలా నటించేవాణ్ణి. దీపిక అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. ఇంతమంది గొప్ప నటులతో కలసి నటించానంటే నమ్మలేకపోతున్నాను' అని చెప్పారు.

దీపికా పదుకొనే మాట్లాడుతూ 'నాగీ క్రియేట్ చేసిన మ్యాజిక్ 'కల్కి' చిత్రం. ఆయనో జీనియస్. తనలో చాలా స్పష్టత ఉంది. సినిమాను అద్భుతంగా తీశారు. నటిగా నాకు గొప్ప అనుభవం మిగిల్చిన సినిమా ఇది' అన్నారు.

అశ్వనీదత్ మాట్లాడుతూ 'అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, ప్రభాస్, దీపిక సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించినందుకు ఆనందంగా ఉంది. 'కల్కి' గొప్ప విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాను' అన్నారు.

ఆకట్టుకునే సినిమా కథ



అభిరామ్, వెన్నెల, మనోహర్, పవన్, కృష్ణ, మంజుల హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఇట్లు.. మీ సినిమా' ఈ నెల 21న విడుదల కానుంది. నలుగురు యువకులు సినిమా మీదున్న ప్యాషన్‌తో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి ఎటువంటి సవాళ్లు ఎదుర్కొన్నారు.. అనే కథాంశంతో రూపుదిద్దుకున్న చిత్రమిది. లవ్, రొమాన్స్, కామెడీ, సెంటిమెంట్ అంశాలతో రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి హరీశ్ చావా దర్శకుడు. నేరి నాగప్రసాద్ నిర్మాత. ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసిన సందర్భంగా ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దర్శకుడు హరీశ్ చావా మాట్లాడుతూ 'సినిమా కథ కోసం అన్వేషిస్తున్నప్పుడు ఏ కథో ఎందుకు.. సినిమా ఇండస్ట్రీలో పడే ఇబ్బందుల గురించి సినిమా తీద్దాం అన్నారు మా నిర్మాత. పరిశ్రమలోకి అడుగుపెట్టే వారికి అవగాహన కల్పించే విధంగా మా సినిమా ఉంటుంది. ప్రేక్షకులందరికీ తప్పకుండా నచ్చుతుంది' అని చెప్పారు. 'పరిశ్రమలోకి వచ్చే కొత్త వాళ్లు పడే ఇబ్బందుల్ని ఆసక్తికరంగా, ప్రేక్షకులకు నచ్చే రీతిలో చూపించాం. ఈ నెల 21న విడుదల చేస్తున్నాం. చిన్న సినిమా కనుక దయచేసి అందరూ థియేటర్లకు వెళ్లి చూడండి' అని కోరారు నిర్మాత నాగప్రసాద్. ఈ కార్యక్రమంలో హీరో అభిరామ్, హీరోయిన్ వెన్నెల, తెలుగు నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నప్పటి నిర్ణయమే సక్సెస్ ఇచ్చింది



విజయానికి అడ్డతోవలు లేవనేది లోకోక్తి. కథానాయిక నేహాశెట్టి కూడా అదే మాట చెబుతున్నారు. ముందస్తు ప్రణాళికతో సిద్ధమవ్వడం వల్లే ఏ రంగంలో అయినా సక్సెస్ సొంతం అవుతుందంటున్నారు ఇందుకు తన సొంత అనుభవాన్నే ఉదాహరణగా చూపుతున్నారు. తన స్కూల్ రోజుల్లోనే నటనపై దృష్టి సారించాలని నిర్ణయం తీసుకున్నారట. ఇక అప్పటి నుంచి నటనకు సంబంధించిన వివిధ అంశాల గురించి తెలుసుకోవడం, డైలాగ్స్ చెప్పడం, డాన్స్ ప్రాక్టీస్ చేయడం ప్రారంభించారట. టాలీవుడ్‌లో అవకాశాలు వచ్చాకనే తెలుగు భాష నేర్చుకున్నాను. ఇలా విభిన్న అంశాలమీద అవగాహన సాధించడం సినిమాల్లోకి అడుగుపెట్టినప్పుడు ఎంతగానో ఉపయోగపడిందని అన్నారు. మొదట్లో విజయాలు రాకపోయినా మన కష్టానికి తగిన అవకాశాలు వెతుక్కుంటూ రావడంతో హీరోయిన్‌గా నిలదొక్కుకున్నాను అని ఆమె చెప్పారు. ఇటీవలే విడుదలైన 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రంలో కథానాయికగా ఆకట్టుకున్నారు నేహా.

ఆర్కిటెక్ట్ నిత్య



'మనమే' చిత్రంతో మంచి హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు శర్వానంద్. ఇప్పుడు తన తదుపరి చిత్రం ('శర్వా 37-వర్కింగ్ టైటిల్) షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ చిత్రానికి 'సామజవరగమన' సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకున్న రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. 'ఏజెంట్' చిత్రంలో తన గ్లామర్‌తో అలరించిన సాక్షి వైద్య శర్వాకు జోడీగా నటిస్తున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. బుధవారం సాక్షి పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం ఆమె పాత్రను పరిచయం చేసింది. ఆర్కిటెక్ట్ నిత్య పాత్రలో సాక్షి కనిపించనున్నారు. ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తుండగా, జ్ఞానశేఖర్ వీఎస్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. అజయ్ సుంకర సహ నిర్మాత.

బెస్ట్ థ్రిల్లర్

నవీన్‌చంద్ర హీరోగా తెలుగు, తమిళ భాషల్లో రూపొందిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'లెవెన్'. లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వంలో అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను హీరో నిఖిల్ ట్విట్టర్ ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హీరో నవీన్‌చంద్ర మాట్లాడుతూ 'ఈ కథ వినగానే నచ్చేసింది. ఎనిమిది నెలలు ప్రీ ప్రొడక్షన్ వర్క్ చేసి, తెలుగు, తమిళ భాషల్లో విడివిడిగా షాట్స్ తీశారు. స్క్రిప్ట్ కోసం ఇంత ప్యాషన్‌గా పని చేసిన నిర్మాతలను నేను చూడలేదు. తప్పకుండా మంచి విజయం సాధిస్తారు. నా కెరీర్‌లో బెస్ట్ థ్రిల్లర్ అవుతుంది. కథ, స్క్రీన్‌ప్లే, యాక్షన్, యాక్టింగ్.. అన్నీ అద్భుతంగా ఉంటాయి' అని చెప్పారు. నిర్మాతల్లో ఒకరైన



రేయా హరి మాట్లాడుతూ 'తెలుగులో నాకు ఇది మొదటి సినిమా. ఇందులో భాగం కావడం ఆనందంగా ఉంది' అన్నారు. 'మాకు ఇది మూడో సినిమా. మొదటి రెండు చిత్రాలూ హిట్ అయ్యాయి. తెలుగు, తమిళ భాషల్లో విడివిడిగా తీశాం. ఇది ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్. అందరికీ నచ్చుతుంది' అని మరో నిర్మాత అక్బర్ చెప్పారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందనీ, త్వరలోనే థియేటర్లలో చిత్రాన్ని విడుదల చేస్తామనీ నిర్మాతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజా రవీంద్ర కూడా పాల్గొన్నారు. రేయా హరి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో అభిరామి, దిలీపన్, రిత్విక, రవివర్మ తదితరులు ఇతర ముఖ్య పాత్రధారులు.

ఆధ్యాత్మిక అంశాలతో...



అశ్విన్‌బాబు, అర్బాజ్‌ఖాన్, దిగంగనా సూర్యవంశీ ప్రధాన తారాగణంగా రూపొందుతున్న చిత్రం 'శివం భజే'. బ్రహ్మాజీ, దేవి ప్రసాద్, కాశీ విశ్వనాథ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. అప్సర్ దర్శకత్వంలో మహేశ్వర్‌రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. బుధవారం 'శివంభజే' టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఆధ్యాత్మిక అంశాలకు యాక్షన్ హంగులను మేళవించి రూపొందించిన చిత్రమిదని టీజర్‌ను బట్టి తెలుస్తోంది. జూలైలో 'శివం భజే'ను విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు. టైటిల్‌తోనే మా సినిమా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిందని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం:వికాస్ బడిస, సినిమాటోగ్రఫీ: దాసరథి శివేంద్ర

సస్పెన్స్ థ్రిల్లర్



ప్రవీణ్ కేవీ నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'మహిష' చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నటుడు శ్రీకాంత్ విడుదల చేసి, టీమ్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు రామకృష్ణ గౌడ్ కూడా పాల్గొన్నారు. 'ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ 'ఇది సస్పెన్స్ థ్రిల్లర్. నూతన నటీనటులు నటించారు. సినిమాలో ఐదు పాటలు ఉన్నాయి. శ్రీవెంకట్ సంగీతం అందించారు. త్వరలో పాటలను విడుదల చేస్తాం' అని చెప్పారు. పృథ్వీ, యశిక, వైష్ణవి, కపిల్, మౌనిక, దీపు తదితరులు నటించిన ఈ చిత్రానికి ఫొటోగ్రఫీ: సతీశ్, వివేక్.

ఇంటర్మీడియెట్ టీనేజ్ లవ్‌స్టోరీ



ప్రణవ్ ప్రీతమ్, షాజ్ఞశ్రీ వేణున్ జంటగా నటించిన 'ప్రభుత్వ జూనియర్ కళాశాల' చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఓ యథార్థ సంఘటన ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి శ్రీనాథ్ పులకురం దర్శకత్వం వహించారు. భువన్‌రెడ్డి కొవ్వూరి నిర్మాత. బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ 'ఎన్నో ఇబ్బందుల్ని దాటుకొని మా సినిమాను విడుదలకు తీసుకురావడమే పెద్ద విజయంగా భావిస్తున్నాం. ఇంటర్మీడియెట్ టీనేజ్ లవ్‌స్టోరీ ఇది. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది. కొన్ని నెలల పాటు వర్క్ షాప్ నిర్వహించి షూటింగ్‌కు వెళ్లాం. ఆర్టిస్టులను మా ఊరు పుంగనూరు తీసుకు వెళ్లి రాయలసీమ యాస నేర్పించాం. సినిమా మీద ప్యాషన్‌తోనే ఇదంతా చేశాం' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'చిత్ర పరిశ్రమలో నాకు ఎవరితోనూ పరిచయాలు లేవు. మా దర్శకుడు శ్రీనాథ్‌కు సినిమా అంటే ఎంతో ప్యాషన్, కమిట్‌మెంట్ ఉన్నాయి. ఆయన త్వరలోనే పెద్ద సినిమాలు చేస్తాడనే నమ్మకం ఉంది. మేం ఇచ్చిన తక్కువ బడ్జెట్‌లోనే సినిమాను బాగా తీశాడు' అన్నారు. చిత్రంలో నటించే అవకాశం కల్పించిన దర్శకనిర్మాతలకు హీరో ప్రణవ్ ప్రీతమ్, హీరోయిన్ షాజ్ఞ కృతజ్ఞతలు తెలిపారు.



నవ్వించే మంచి దెయ్యం

వెన్నెల కిశోర్, నందితా శ్వేత, నవమి గాయక్ ముఖ్య పాత్రలు పోషించిన హారర్, కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓఎంజీ'(ఓ మంచి ఘోస్ట్) ఈ నెల 21న విడుదల కానుంది. శంకర్ మార్తాండ్ దర్శకత్వంలో డాక్టర్ అబినికా ఇనాబతుని నిర్మించారు. మంగళవారం సాయంత్రం జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో దర్శకుడు మాట్లాడుతూ 'సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ వల్లే ఈ సినిమా ప్రారంభమైంది. మా మీదున్న నమ్మకంతో అబినికా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆర్టిస్టులంతా అద్భుతంగా నటించారు. అనూప్ ఇచ్చిన రీరికార్డింగ్ సినిమాను మరో స్థాయికి తీసు కెళ్లింది' అని తెలిపారు. 'ఇది మాకు తొలి సినిమా. శంకర్ కథ ఎంత బాగా చెప్పారో అంతకుమించి అనేలా సినిమాను తీశారు. అందరూ చూడతగ్గ చిత్రమిది' అని చెప్పారు డాక్టర్ అబినికా. నందితా శ్వేత మాట్లాడుతూ 'నాకు కామెడీ అంటే చాలా ఇష్టం. స్టోరీ నెరేట్ చేస్తున్నంత సేపూ నవ్వుతూనే ఉన్నా. అందరినీ నవ్వించేలా మా సినిమా ఉంటుంది' అన్నారు.

...అందుకే ధ్యానం చేయాలి!

మెడిటేషన్ వల్ల మెదడు ఆరోగ్యమే కాదు.. శారీరకంగా ఎంతో మంచిది. మెడిటేషన్ చేయటం వల్ల మరి కొన్ని ఫలితాలున్నాయి. అవే ఇవి...

- జీవితంలో ఎక్కువగా మెంటల్ పొల్యూషన్ ఉండటం వల్ల కచ్చితమైన నిర్ణయాలు తీసుకోలేరు. కన్ఫ్యూజ్‌కు గురవుతుంటారు. ఇలాంటి సమయంలోనే ఆలోచనల్లో క్లారిటీ అవసరం. అందుకే మెడిటేషన్ చేయటం అలవరుచుకోవాలి. అప్పుడే మెంటల్ ఫాగ్ పోతుంది. దీనివల్ల చక్కటి ఆలోచనలు కలుగుతాయి. ముఖ్యంగా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. తన మీద తనకు.. నమ్మకం కుదురుతుంది. ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లో అయినా.. ఆగకుండా ముందుకు నడిచి.. అద్భుతమైన విజయాలు సాధిస్తారు.
- మనిషి అంటేనే భావోద్వేగాలకు బానిస. ఆనందం, జాలి, బాధ.. లాంటి ఎమోషన్స్ వెంట వెంటనే.. బయటకు కనపడేట్లు ప్రకటిస్తే.. ఒక్కోసారి తోటి వాళ్ల ముందు చులకన అవుతారు. అవి వారి వ్యక్తిత్వం మీద ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే రోజుకు కనీసం పది నిముషాల పాటు మెడిటేషన్ చేస్తే.. భావోద్వేగాల ప్రవాహాన్ని బ్యాలెన్స్ చేయవచ్చు. ఎమోషనల్ బ్యాలెన్స్ ఉన్నప్పుడే ఏదైనా సాధించగలరు.
- కొందరు కొన్ని పనులు చేసేప్పుడు ఎక్కువగా ఆలోచిస్తారు. ముఖ్యంగా చేసే పనిలో విజయం దక్కుతుందో లేదో అనే ఆందోళనకు, భయానికి లోనవుతుంటారు. యాంగ్జయిటీకి గురయ్యేవారు కచ్చితంగా మెడిటేషన్ చేస్తేనే.. చక్కటి ఫలితం ఉంటుంది.
- మెడిటేషన్ చేయటం వల్ల సమస్యలను పరిష్కరించే నేచర్ అలవడుతుంది. ముఖ్యంగా ఏదైనా సమస్య వస్తే రెండే దారులుంటాయి. ఏ దారిలో వెళితే సులువుగా పరిష్కారం వైపు వెళ్తామనేదే ప్రశ్న. ధ్యానం చేసేవారిలో ఎలాంటి ఇతర ఆలోచనలు లేకపోవడం వల్ల.. అద్భుతాలు క్రియేట్ చేస్తారు.
- ధ్యానం చేసేవారిలో ఏకాగ్రత అద్భుతంగా ఉంటుంది. ఏ పని చేసినా మంచి విజయాన్ని సాధిస్తారు. లక్ష్యాల మీద దృష్టి ఉంచి అటువైపునే పయనించి విజయాలను అందుకుంటారు.




గొంతు నొప్పికి ఉపశమనం...

ఆహారం వల్ల కావొచ్చు.. వాతావరణం మారినపుడు కావొచ్చు.. కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. వాటిలో గొంతు నొప్పి ఒకటి. మంటతో పాటు తిన్న ఆహారం మింగలేకపోవటం లాంటి సమస్యలుంటాయి. ఈ గొంతు నొప్పినుంచి ఉపశమనం పొందాలంటే ఈ చిట్కాలు పాటించాలి.

- గొంతు నొప్పి ఉన్నప్పుడు చల్లని నీరు తాగకూడదు. గోరు వెచ్చని నీళ్లు తాగాలి. వెనిగర్‌ను పుక్కిలించటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. అల్లంలో బ్యాక్టీరియాను పోగొట్టే లక్షణాలుంటాయి. అందుకే చిన్న ముక్క వేసి నీళ్లు కాచుకోవాలి. ఆ నీటిని తాగాలి లేదా అల్లం టీ తాగవచ్చు.
- నీళ్లలో తులసి ఆకులు వేసి మరిగించాలి. చల్లార్చిన తర్వాత తాగాలి. లేకుంటే రెండు స్పూన్ల తులసిరసంలో స్పూన్ తేనె కలిపి తాగాలి. గొంతు నొప్పి తగ్గిపోతుంది.
- నీటిలో టీస్పూన్ అల్లం రసం వేసి అందులోకి తేనే కలిపి తాగితే తక్షణ ఉపశమనం లభిస్తుంది.
- గోరు వెచ్చని పాలల్లో చిటికెడు పసుపు వేసి తాగటం వల్ల కూడా చక్కని ఫలితం ఉంటుంది.
- మూడు కప్పులు నీళ్లలో కొద్దిగా వాము వేసి మరిగించాలి. గోరు వెచ్చని వాము నీళ్లను తాగాలి.
- తమలపాకు రసంలో కొద్దిగా తేనె వేసి కలిపి తాగాలి. సూప్‌లు తాగితే ఉపశమనం ఉంటుంది. కారం, మసాలా, ఐస్‌క్రీమ్స్ జోలికి పోకూడదు. మరీ ఇబ్బందిగా ఉంటే మాత్రం వైద్యుడిని సంప్రదించాలి.



ప్రేరణ



నిరక్షరాశ్యత, ఉద్యోగావకాశాల్లో పరిమితులు, ఆర్థిక సమస్యల వల్ల మహిళలు పేదరికంలోనే మగ్గిపోవలసిన పరిస్థితి నెలకొంటోంది. ఈ సమస్యను పరిష్కరించాలనే సంకల్పంతో ప్రగతి సంస్థ ద్వారా ఆడపిల్లల విద్యావసరాలకు సహాయపడుతోంది ఎడ్యుకేట్ గర్ల్స్ ఫౌండర్, **సఫీనా హుస్సేన్**. ఆవిడ ఇంటర్వ్యూలో వెల్లడైన విశేషాలివి!

అమ్మాయిలను బడి బాట పట్టిస్తూ..

• ప్రగతి ఆలోచన ఎక్కడి నుంచి వచ్చింది?

భారతదేశంలోని మారుమూల గ్రామాల్లోని నిరక్షరాశ్య సమాజాలను ఆడపిల్లల చదువుల వైపు నడిపించే లక్ష్యంతో ఏర్పడిన సంస్థ ఎడ్యుకేట్ గర్ల్స్. గత 16 ఏళ్లుగా విద్యాహక్కులో భాగంగా ఎనిమిదో తరగతి వరకూ ఆడపిల్లలను చదివించడం మీదే మేం దృష్టి పెట్టాం. ప్రభుత్వ సహాయసహకారాలతో పాటు, భారీ కమ్యూనిటీ వాలంటీర్ల సహాయంతో ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థ ద్వారా ఇప్పటివరకూ లక్షల



మంది ఆడపిల్లలను బడుల్లో చేర్పించాం. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, బీహార్‌లలోని 29 వేల గ్రామాల్లోని ఆడపిల్లలకు చదువును చేరువ చేయగలిగాం! పేదరికం, పితృస్వామ్యం, ప్రయాణ సౌకర్యాల లేమి, సమాజాల్లో సెకండరీ స్కూల్ మౌలిక సదుపాయాల లోపం లాంటి కారణాల వల్ల ఆడపిల్లలు ఎనిమిదో తరగతి తర్వాత బడులు మానేస్తున్నారు. దాంతో కనీస విద్యార్హతలు లేక చిన్న స్థాయి వృత్తుల్లోకి కూడా వాళ్లు ప్రవేశించలేకపోతున్నారు. అంతకుమించి స్వతహాగా సంక్రమించిన హక్కుల పట్ల అవగాహన లేక, కేవలం శారీరక శ్రమతో కూడిన కూలీ పనులు, ఇంటి పనులకే పరిమితమైపోతున్నారు.

అలాగే భౌతిక, లైంగిక, కుటుంబపరమైన నిర్ణయాల పట్ల కూడా వాళ్లు నియంత్రణ కోల్పోతున్నారు.

ఇలాంటి మహిళల సమస్యలను పరిష్కరించడం కోసం మేం 2021లో ప్రగతి అనే మరొక కార్యక్రమాన్ని చేపట్టాం!

• ప్రగతి ప్రధాన లక్ష్యం?

15 నుంచి 29 ఏళ్ల మహిళలు ప్రభుత్వ బడుల నుంచి కనీసం పదో తరగతి పాసయ్యేలా చూడడం మా లక్ష్యం.

> నేను ఢిల్లీలో పుట్టి పెరిగాను. కొన్ని క్లిష్టమైన పరిస్థితుల్లో టీనేజీ వయసులోనే చదువు మానుకుని పెళ్లి చేసుకోవలసి వచ్చింది. అయితే మా అంటీ ప్రమేయంతో నేను ఆ ప్రమాదం నుంచి గట్టెక్కగలిగి చదువును కొనసాగించగలిగాను. అంతే కాకుండా ఉన్నత చదువుల కోసం లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌కు వెళ్లగలిగాను. అప్పట్లో కూడా "కూతురి మీద అంత డబ్బు ఎందుకు ఖర్చు చేస్తున్నావు. ఆడపిల్ల ఎప్పటికైనా పెళ్లి చేసుకోవలసిందే, అలాంటప్పుడు అంత పెట్టుబడి పెట్టడం ఎందుకు?" అని మా నాన్నను అడిగినవాళ్లున్నారు. ఏదేమైతేనేం చివరకు అవరోధాలను జయించి, ఉన్నత చదువు చదువుకోగలిగాను. నాలా అమ్మాయిలందరికీ ఆదరణ, సహాయసహకారాలు దొరకడం కష్టం. కాబట్టే ఆడపిల్లలకు విద్యను అందించడం కోసం నా వంతు కృషి చేస్తున్నాను.

ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు, వొకేషనల్ ట్రైనింగ్‌లలో ప్రవేశాలకు పదో తరగతి పాసై ఉండడం కీలకం కాబట్టి అమ్మాయిలు పదో తరగతి పూర్తి చేయగలిగే వరకూ బడులు మానుకోకుండా చూసుకోవడం మీదే మేం దృష్టి పెడుతున్నాం. ప్రగతి సంస్థ, చదువు పూర్తి చేసిన ఆడపిల్లలకు ఉద్యోగావకశాలను కల్పించడంలో కూడా సహాయపడుతుంది. ఆరు నెలల సుదీర్ఘమైన విలేజ్ క్యాంప్స్ సహాయంతో స్థానిక పెద్దల తోడ్పాటుతో ఆడపిల్లలు పదో తరగతి పాసయ్యేలా బహిరంగ బడి పాఠ్యప్రణాళికలను అనుసరించేలా ఆడపిల్లలను ప్రోత్సహిస్తుంది. ఈ విషయంలో గ్రామ పెద్దలు ప్రధాన భూమిక పోషిస్తూ ఉంటారు. చదువు ఈడున్న ఆడపిల్లలను గుర్తించి, పరీక్షలు రాసేవరకూ వాళ్లకు మార్గ నిర్దేశం చేసి, భవిష్యత్తు ఉద్యోగావకాశాల పట్ల వాళ్లకు అవగాహన కల్పిస్తూ ఉంటారు.

• బడికి వెళ్లలేని ఆడపిల్లలకు మీరెలాంటి సౌకర్యాలు, సౌలభ్యాలు కల్పిస్తూ ఉంటారు?

మేం కేవలం పాఠ్యపుస్తకాలు, సబ్జెక్టులకే పరిమితం కాకుండా, ప్రాజెక్టు వర్క్స్, జీవన నైపుణ్యాలను మెరుగపరిచే అంశాల పట్ల కూడా అవగాహన ఏర్పరుస్తూ ఉంటాం. సెల్ఫ్ స్టడీ టెక్నిక్స్‌తో పాటు, పీర్ సపోర్ట్ నెట్‌వర్క్స్ అభివృద్ధికి తోడ్పడతాం. అలాగే పరిస్థితులను బట్టి మసలుకోవడం, చాకచక్యంగా మెలగడం, సమస్యలను పరిష్కరించడం లాంటి మెలకువలను కూడా నేర్పిస్తాం. అలాగే పరీక్షా కేంద్రాలకు చేరుకోగలిగే ప్రయాణ మార్గాలు, సాధనాల గురించి కూడా అవగాహన కల్పిస్తాం.

• మీ భవిష్యత్తు ప్రణాళికలు?

రాబోయే పదేళ్లలో కోటి మంది ఆడపిల్లలు పదో తరగతి పూర్తి చేసేలా సహాయపడాలన్నదే మా లక్ష్యం. ప్రభుత్వ సహకారంతో మారుమూల గ్రామాల్లో బహిరంగ బడలను నెలకొల్పి ఆడపిల్లలు చదువుకుని, స్వయంస్వావలంబన సాధించడంలో సహాయపడాలని భావిస్తున్నాం. కలలు కనే ప్రతి ఆడపిల్లా ఆ కలలను నిజం చేసుకోవడంలో విద్య కీలక పాత్ర పోషిస్తుంది. విద్య అనేది ఒక ప్రత్యేక హక్కు కాదు, అది జన్మహక్కు. చదువు, మన మీద మనం పెట్టుకునే పెట్టుబడి. తరగని ఆస్తి. ఈ వాస్తవం నగీనా బానో మాటల్లోనే వెల్లడైంది. నగీనా... హింసకు గురై, పట్టించుకోకుండా వదిలేసిన బాల వధువు. ఆ అమ్మాయి చదువుతో తన జీవితాన్ని సరిదిద్దుకుని, పిల్లలకు మంచి భవిష్యత్తును అందించగలిగింది. ఆ చదువుల ఛాంపియన్ తన అనుభవం గురించి మాట్లాడుతూ... "నా చదువే నా సొంత ఆస్తి. దాన్నెవరూ నా నుంచి దూరం చేయలేరు. దాన్నెవరూ దొంగిలించలేరు. ఎలాంటి వరదలూ, కరవులూ దాన్ని నా నుంచి లాగేసుకోలేవు. చనిపోయేవరకూ నా చదువు నాతోనే ఉంటుంది" అని ఒక సందర్భంలో నాతో చెప్పింది. నగీనాలా ఆడపిల్లలందరూ చదువు విలువను తెలుసుకుని తమ జీవితాలను తీర్చిదిద్దుకోవాలనే లక్ష్యంతోనే నేను ప్రగతి సంస్థను నెలకొల్పాను. అర్థాంతరంగా చదువును మానేసే అమ్మాయిలు ఎంతో మంది ఉన్నారు. కర్షున అనే అమ్మాయి తొమ్మిదో తరగతిలో రెండు సబ్జెక్టుల్లో ఫెయిలైంది. ఆ అమ్మాయికి చదువుకోవాలని ఉన్నా, చదువులో వెనకబడడంతో ఆమెను చదువు మాన్పించేశారు. వాళ్ల గ్రామంలో ప్రగతి క్యాంప్ ఏర్పాటైనప్పుడు, ఆ అమ్మాయి చదువును కొనసాగించాలనే కోరికను బయల్పరిచింది. అలా మా ప్రగతి సంస్థ సహాయంతో తన గ్రామంలోనే ఒక చిన్న దుకాణాన్ని నెలకొల్పుకోగలిగింది. అలాగే తన చదువును పూర్తి చేసి, వ్యాపారాన్ని విస్తరించుకోగలిగింది.

• గోగుమళ్ల కవిత

ఆరేళ్ళ క్రితం వరకూ ఆమె సాధారణ గృహిణి... భర్త, కుమార్తె మరణంతో కలిగిన కుంగుబాటును తట్టుకుంటూ... కొడుకు సంకల్పాన్ని గెలిపించడానికి... అరవయ్యేనిమిదో ఏట మోడలింగ్‌లో అడుగుపెట్టారు. కొత్త దారిలో అడుగులు వెయ్యడానికి వయసుతో పని లేదంటున్న రుక్మిణి పీతాంబరన్... వెండితెరపై కూడా మెరుస్తున్నారు.



మోడల్ మదర్

"ఇప్పుడైతే నన్ను చాలామంది గుర్తుపట్టేస్తున్నారు కానీ.. కొన్నేళ్ళ క్రితం వరకూ మా పక్కవీధివారికే నేను పెద్దగా తెలీదు. కేరళలోని అళప్పుజాలో స్థిరపడిన మధ్యతరగతి కుటుంబం మాది. నేను పెద్దగా చదువుకోలేదు. పెళ్ళయ్యాక... గృహిణిగా తీరికలేకుండా ఉండేదాన్ని" అని గుర్తు చేసుకున్నారు రుక్మిణి. ఆమె భర్త పీతాంబరన్. వాళ్ళకొక అమ్మాయి... అంగవైకల్యంతో పుట్టింది. దాన్ని సరి చేయించడానికి తిరగని ఆసుపత్రులు లేవు, కలవని వైద్యులు లేరు. కానీ ఫలితం లేకపోయింది. ఈలోగా ఆమె భర్త కూడా అనారోగ్యానికి గురయ్యారు. "అప్పుడే మేము ఒక అబ్బాయిని దత్తత తీసుకొని పెంచాం. అతనే రాజీవ్. మా ఆశలన్నీ వాడిమీదే. అందుకు తగ్గట్టే వాడు కూడా మమ్మల్ని ఎంతో ప్రేమగా చూసుకొనేవాడు. కానీ తోటి విద్యార్థులు, ఇరుగుపొరుగువారు దత్తపుత్రుడంటూ మాటలతో ఎంతగానో వేధించేవారు. అవన్నీ నాతో చెప్పుకొని బాధపడేవాడు" అని చెప్పారు రుక్మిణి. చదువులో రాజీవ్ చాలా చురుగ్గా ఉండేవారు. కళలన్నా, పెయింటింగ్ అన్నా ఎంతో ఇష్టం. హైస్కూల్లో చదువుతున్నప్పుడే... ఫ్యాషన్ డిజైనర్ అవ్వాలనుకున్నారు. ముంబయి 'నిఫ్ట్'లో... పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. "పర్యావరణ అనుకూలమైన, ఏ కాలానికైనా ప్రత్యేకంగా కనిపించే దుస్తులతో ఒక బ్రాండ్ సృష్టించాలన్నది నా కల. కానీ దానికోసం పెట్టుబడి సమకూర్చుకోవడానికి కొంతకాలం పట్టింది" అంటారు రాజీవ్. ప్రకటనల రంగం, సినీ, నాటక రంగాలు... ఇలా ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ పని చేశారు. డబ్బు కూడబెట్టారు. తన పేరుతో చేనేత దుస్తుల బ్రాండ్‌ను కొచ్చిలో ప్రారంభించారు.



ఆట పట్టిస్తున్నాడనుకున్నా...

"అయితే ఆ దుస్తులకు మోడల్స్‌ను కుదుర్చుకోవడం కష్టమయింది. ఈ ఇబ్బందుల్లో ఉండగా... నాన్న, అక్క మరణించారు. ఆ విషాదాన్ని మేం తట్టుకోలేకపోయాం. ముఖ్యంగా అమ్మ వేదనను చూడలేకపోయేవాణ్ణి. ఆమెను మళ్ళీ మామూలు మనిషిని చెయ్యాలనుకున్నాను. ఆమె దృష్టిని వేరే విషయాలవైపు మళ్ళించాలని ఆలోచన చేశాను. నా పని గురించి ఆమెతో చర్చించేవాణ్ణి. నేను డిజైన్ చేసిన చీరల్ని ఆమెకు చూపించేవాణ్ణి. వాటిని ఆమె కట్టుకుంటే... ఫొటోలు తీసేవాణ్ణి. ఆ తరువాత నేను ఏ చీర డిజైన్ చేసినా... ఇది అమ్మ కట్టుకుంటే ఎలా ఉంటుంది? అని ఊహించుకొనేవాణ్ణి" అని చెప్పారు రాజీవ్. అప్పుడే... అమ్మనే మోడల్‌గా పెట్టుకోవాలనుకున్నారు. మామూలుగా ఆమె అయితే ఇష్టపడదని తెలుసు. వేరే మోడల్స్‌ను తీసుకోవడానికి తనకున్న ఇబ్బందులను ఆమెకు వివరించారు. "నేను తయారు చేసిన చీరలకి నువ్వే మోడల్‌గా ఉండాలని రాజీవ్ చెప్పినప్పుడు... ఏదో సరదాగా ఆటపట్టిస్తున్నాడని అనుకున్నాను. ఆ తరువాత... వాడు తన సమస్యలు చెప్పగానే... 'సరే' అన్నాను. అయితే... 'ఈ వయసులో... నేనిది చెయ్యగలనా? ఈవిడ మోడల్ ఏంటని అందరూ నవ్వితే... వాడికి అవమానం కదా!' అనిపించింది. కానీ ఈ లోకంలో నాకున్నది వాడొక్కడే. వాడి సంతోషమే నాకు ముఖ్యం" అంటారు రుక్మిణి.

నటన కష్టం కాదు...

మెల్లగా... మోడలింగ్ వాతావరణానికి ఆమె అలవాటు పడ్డారు. ఆ తరువాత... గత ఆరేళ్లుగా... రాజీవ్ డిజైన్ చేసిన చీరలకు ఆమే మోడల్. కొద్ది రోజుల్లోనే ఆమె విపరీతమైన పాపులారిటీ సాధించారు. వేరే బ్రాండ్లు కూడా తమ దుస్తులకు, నగలకు మోడలింగ్ చెయ్యాలంటూ ఆమెను ఆహ్వానిస్తూనే ఉన్నాయి. "ఇతర బ్రాండ్లకు నేను మోడల్‌గా ఉండను. ఎందుకంటే ఇదంతా చేస్తున్నది మా అబ్బాయి కోసం" అంటారు రుక్మిణి. ఆమె పాపులారిటీని గుర్తించి... సినీ రంగం కూడా అవకాశాచ్చింది. రాహుల్ సదాశివన్ దర్శకత్వంలో 'భూతకాలమ్', అన్వర్ రషీద్ దర్శకత్వంలో 'ట్రాన్స్'... తదితర చిత్రాల్లో ఆమె కనిపించారు. "తెరమీద నన్ను చూసుకొని... నేనే నమ్మలేకపోయాను. సినిమాల్లో నటించడం మంచి అనుభవం. నటన నాకు కష్టంగా అనిపించలేదు. దర్శకుడు చెప్పింది చేసేస్తాను అంతే" అంటారామె నవ్వుతూ. రుక్మిణి... ఇప్పుడు సెలబ్రిటీ. ఎక్కడికి వెళ్ళినా జనం ఆమెను గుర్తుపట్టి పలకరిస్తారు. యువత ఫొటోలు దిగితే... పెద్దలు మాట కలిపి అభినందిస్తూ ఉంటారు. "అందరికీ ఎన్నో కలలు ఉంటాయి. చాలామందికి వాటిని నెరవేర్చుకోవడం కష్టమవుతుంది. కానీ నేను ఎప్పుడూ కలలోనైనా ఊహించలేనివి నా జీవితంలో జరిగాయి. దేనికైనా వయసుతో నిమిత్తం లేదు. మనకు దొరికిన పని చిత్తశుద్ధితో చేస్తే చాలు. కాస్త ఆలస్యమైనా అనుకున్నవి జరుగుతాయి. కాబట్టి ఎప్పుడూ నిరాశ పడకూడదు... నా బిడ్డకైనా, ఎవరికైనా నేను చెప్పేది ఇదే" అంటున్నారీ మోడల్ మదర్.


కౌన్సెలింగ్

లవ్ అడిక్షన్

Q A

డాక్టర్! మా అబ్బాయికి 25 ఏళ్లు. ఎంతో మంది అమ్మాయిలతో ప్రేమ వ్యవహారాలు నడిపించాడు. ఏ అమ్మాయితో ఉన్నా, ఆ అమ్మాయే లోకంగా జీవిస్తూ, మమ్మల్నీ, చదువునీ, బాధ్యతలనూ వదిలేస్తూ ఉంటాడు. అబ్బాయి ధోరణితో మాకు భయంగా ఉంది. జీవితంలో వెనకపడిపోతాడేమో నని ఆందోళనగా కూడా ఉంది. ఇలాంటి ప్రవర్తన సాధారణమైనదేనా? **- ఓ సోదరి, హైదరాబాద్.**

మద్యం, మాదకద్రవ్యాల మాదిరిగానే ప్రేమను వ్యసనంగా మలుచుకునే వాళ్లు ఉంటారు. మీ అబ్బాయి ఆ కోవకు చెందినవాడే నని అనిపిస్తోంది. ఎలాంటి వ్యసనపరులైనా వారి బాల్యంలో ఏదో ఒక ట్రామా (మానసిక గాయం)ను ఎదుర్కొని ఉంటారు. నిర్లక్ష్యానికి గురవడం లేదా హింస (లైంగిక, మానసిక, శారీరక)కు గురయి ఉంటారు, లేదా తల్లితండ్రులు పట్టించుకోకుండా వదిలేయడం, తల్లితండ్రుల నుంచి తగినంత ప్రేమ దక్కకపోవడం, విపరీతమైన ఒత్తిడుల మధ్య పెరగడం, లేదా ఇంకేదైనా ట్రామాకు గురవడం జరిగి ఉంటుంది. ప్రేమ వ్యసనపరులుగా మారడానికి ప్రధాన కారణం బాల్యంలో వారి మీద జరిగిన లైంగిక దాడులే! బాల్యంలో ఎలాంటి ట్రామాకు గురైనా పెరిగి పెద్దయ్యాక ఆరోగ్యకరమైన సామాజిక అనుబంధాలు ఏర్పరుచుకోవడంలో వీళ్లకెప్పుడూ ఇబ్బందులు ఉంటూనే ఉంటాయి. అనుబంధాలు ఏర్పరుచుకోవడంలో భయం కూడా కొందర్లో ఉంటుంది. ఆరోగ్యకరమైన అనుబంధాలు ఏర్పరుచుకునే మెలకువల లోపానికి బాల్యంలోనే బీజాలు పడితే అవి వయసుతో పాటు పెరిగి, భవిష్యత్తులో లవ్ అడిక్షన్‌కు కచ్చితంగా దారి తీస్తాయి. బాల్యం లేదా యుక్తవయసులో గురయ్యే ట్రామాల వల్ల ఆత్మన్యూనత, డిప్రెషన్, ఆందోళన మొదలైన మానసిక సమస్యలు తలెత్తి, వాటి ఫలితంగా లవ్ అడిక్షన్‌కు గురయ్యే అవకాశాలూ ఉంటాయి. లవ్ అడిక్ట్స్... అవమానం, భయం, డిప్రెషన్, ఆందోళన మొదలైన ఇబ్బందికరమైన భావోద్వేగాల ప్రభావం అనుభవం కాకుండా ఉండేలా మొద్దుబారడం కోసం ప్రేమ అనే ఊహాలోకంలో విహరించడం బాల్యం నుంచే అలవరుచుకుంటారు. ఇందుకోసం ప్రేమలోకి తోసేందుకు ఉపయోగపడే మెదడులో న్యూరోకెమికల్స్ ఉత్పత్తిని పెంచుకుంటారు. క్లుప్తంగా చెప్పాలంటే... ఒక లవ్ అడిక్ట్‌కి ఎవరైనా ఆకర్షణీయంగా కనిపిస్తే, వాళ్లతో తమ జీవితం ఎంత అద్భుతంగా ఉంటుందోనని ఊహించుకుంటూ, ఆ క్రమంలో తనకు, ఎదుటి వ్యక్తికి ఎదురయ్యే వీలుండే ఇబ్బందులు, సమస్యల గురించిన ఆలోచనలను పక్కన పెట్టేస్తాడు. అయితే ఇతర వ్యసనపరులు కూడా ఇలాంటి లక్ష్యాన్నే.. డ్రగ్స్ వాడడం, జూదం ఆడడం, వీడియో గేమ్స్ ఆడడం, డబ్బులు ఖర్చుపెట్టడం, సెక్స్ లేదా ఇతర వ్యసనాలకు లోను చేసే పదార్థాల ఆధారంగా అందుకుంటారు. ఇలా తనంతట తానుగా మెదడులో పెంచుకునే న్యూరోకెమికల్ రియాక్షన్ వల్ల క్రమేపీ జీవితంలోని ఇబ్బందుల నుంచి గట్టెక్కే మెలకువలనూ అలవరుచుకుంటారు. క్లుప్తంగా చెప్పాలంటే ప్రేమ వ్యసనపరులు వెతుకులాడేది ప్రేమ కోసం కాదు, తమ భావోద్వేగాలను అదుపు చేయగల సాధనం కోసమే!



లవ్ అడిక్షన్ లక్షణాలు

సాధారణంగా ప్రేమ వ్యసనం పురుషులకంటే స్త్రీలకే ఈ సమస్య ఎక్కువ అనుకుంటే పొరపాటు. ఇద్దర్లోనూ ఈ సమస్య ఉంటుంది. లవ్ అడిక్షన్‌లో ఉన్న వ్యక్తుల ప్రధాన లక్షణాలు ఇలా ఉంటాయి. అవేంటంటే...

- లైంగిక సంబంధాన్ని ప్రేమానుబంధం, అంతేలేని అనురాగ బంధం అనుకోవడం
- ఎవరితోనూ రిలేషన్‌షిప్‌లో లేకపోతే ఒంటరిగా భావిస్తూ, అనుబంధం కోసం వెంపర్లాడడం
- ఆ కొత్త రిలేషన్‌షిప్ వెతుకులాటలో ఆత్మీయులు, కుటుంబీకులు, స్నేహితుల పట్ల నెరవేర్చాల్సిన బాధ్యతలను నిర్లక్ష్యం చేయడం
- ఒక రిలేషన్‌షిప్‌లో ఉండగానే వేరొక అనుబంధం కోసం వెతుకుతూ ఉండడం
- నడుస్తున్న రిలేషన్‌షిప్‌ను లైంగికంగా/ప్రేమపరంగా మరింత దృఢంగా ఉంచడం కోసం పరితపించడం
- ఉన్న భాగస్వామిని పోగొట్టుకోకుండా ఉండే /ఒక కొత్త వ్యక్తితో రిలేషన్‌షిప్‌లోకి అడుగుపెట్టే క్రమంలో ఇతర పనుల మీద ఆసక్తి కనబరచకపోవడం
- మానసిక భావోద్వేగాలు, ఇతరత్రా ఒత్తిడికి లోను చేసే ఏ పరిస్థితి నుంచి తప్పించుకోవడానికైనా ప్రేమ మీద ఆధారపడడం

ఏది ఏమైనా లవ్ అడిక్ట్స్ తమ సమయాన్నంతా ఉన్న రిలేషన్‌షిప్‌ని నిలిపి ఉంచుకోవడానికి లేదా కొత్త రిలేషన్‌షిప్‌లో మునిగిపోవడానికే కేటాయిస్తూ ఉంటారు. వీళ్ల ప్రపంచమంతా 'ప్రేమ' చుట్టూనే తిరుగుతుంది. తినే తిండి మొదలు, వేసుకునే దుస్తులు, చేసే ఉద్యోగం, కాలక్షేపం కోసం వెళ్లే ప్రదేశాలు... ఇలా ప్రతిదీ తమని పరిపూర్ణం చేసే ఒక 'పర్‌ఫెక్ట్' పార్ట్‌నర్‌ని దొరకబుచ్చుకునే వీలుండే మార్గాల్లోనే కూర్చబడుతూ ఉంటుంది. మీ అబ్బాయి ఈ కోవకే చెందుతాడు కాబట్టి మానసిక నిపుణుల చేత కౌన్సెలింగ్ ఇప్పించడం అవసరం.

డాక్టర్ కల్యాణ చక్రవర్తి, క్లినికల్ సైకాలజిస్ట్, ల్యూసిడ్ డయాగ్నొస్టిక్స్, హైదరాబాద్.

నిజ్జర్‌కు కెనడా పార్లమెంటు నివాళి





న్యూఢిల్లీ, జూన్ 19: ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ మరణించి ఏడాది పూర్తయిన సందర్భంగా కెనడా పార్లమెంటు అతనికి నివాళి అర్పించింది. మంగళవారం పార్లమెంటులో సభ్యులు కొద్దిసేపు మౌనం పాటించారు. దీనిపై స్పందించిన భారతదేశం 1985లో ఎయిర్ ఇండియాకు చెందిన కనిష్క విమానాన్ని ఉగ్రవాదులు బాంబుతో పేల్చివేసిన ఘటనలో మరణించిన 329 మంది ప్రయాణికుల స్మారక కార్యక్రమాన్ని ప్రకటించింది. కెనడాలోని స్టాన్లీ పార్కు వద్ద ఉన్న సెపెర్లీ క్రీడామైదానంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు స్మారక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వాన్కోవెర్‌లోని భారత కాన్సులేట్ జనరల్ 'ఎక్స్'లో వెల్లడించారు. ప్రపంచానికే ముప్పుగా పరిణమించిన ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భారత్ ముందుంటుందన్నారు. 2024 జూన్ 23న ఆ మృతుల 39వ వర్ధంతి అని తెలిపారు. 1984లో ఆపరేషన్ బ్లూస్టార్‌కు ప్రతీకారంగానే సిక్కు ఉగ్రవాదులు కనిష్క విమానాన్ని పేల్చివేసినట్లు ఆరోపణలు వచ్చాయి. కాగా, భారత్‌లో నిషేధిత ఉగ్రవాద సంస్థ ఖలిస్థానీ టైగర్ ఫోర్స్(కేటీఎఫ్)కు చీఫ్‌గా నిజ్జర్ వ్యవహరించాడు. భారతదేశం ప్రకటించిన 40 మంది ఉగ్రవాదుల జాబితాలో నిజ్జర్ పేరు కూడా ఉంది. సిక్స్ ఫర్ జస్టిస్ అనే వేర్పాటువాద సంస్థలోనూ అతని భాగస్వామ్యం ఉంది. 2017లో భారతదేశంలోని లూథియానాలో బాంబు పేలుడు, పాటియాలాలో ఓ ఆలయం వద్ద బాంబు పేలుడులో అతని పాత్ర ఉన్నట్టు పంజాబ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. కెనడాలో గతేడాది జూన్ 18న నిజ్జర్‌ను కొందరు కాల్చి చంపారు. ఈ హత్యలో భారత ప్రభుత్వ పాత్ర ఉందని కెనడా ఆరోపించడంతో ఇరుదేశాల సంబంధాలు దెబ్బతిన్నాయి.

పార్కిన్సన్స్‌ను ఏడేళ్ల ముందే గుర్తించే పరీక్ష

లండన్, జూన్ 19: నాడీ వ్యవస్థను క్రమంగా క్షీణింపజేసి.. కాళ్లు చేతులు వణకడం, మతిమరుపు వంటి సమస్యలు కలిగించే పార్కిన్సన్స్ వ్యాధిని ఇప్పటిదాకా లక్షణాల ఆధారంగానే నిర్ధారిస్తున్నారు! అలా కాకుండా.. లక్షణాలు బయటపడడానికి ఏడేళ్ల ముందే ఆ మహమ్మారిని గుర్తించే సాధారణ రక్తపరీక్షను యూనివర్సిటీ కాలేజ్ లండన్ (యూకే) శాస్త్రజ్ఞుల నేతృత్వంలోని పరిశోధక బృందం అభివృద్ధి చేసింది. ప్రయోగాల్లో భాగంగా.. ర్యాపిడ్ఐ మూమెంట్ బిహేవియర్ డిజార్డర్ (ఐఆర్‌బీడీ)తో బాధపడుతున్న 72 మంది రక్త నమూనాలను సేకరించి వాటిని మెషీన్ లెర్నింగ్ ఆధారంగా విశ్లేషించారు. ఐఆర్‌బీడీ సమస్యతో బాధపడేవారిలో 75 నుంచి 80% మంది మెదళ్లలో అల్ఫాసైన్యూక్లిన్ అనే ప్రొటీన్ అసాధారణంగా పేరుకుపోతున్నట్టు ఆ టూల్ గుర్తించింది. అలాగే.. ఆ 72 మందిలో 16 మంది పార్కిన్సన్స్ బారిన పడే ప్రమాదం ఉందని ఆ టూల్ సరిగ్గా అంచనా వేసినట్టు పదేళ్ల పరిశీలన అనంతరం తేలింది. "పార్కిన్సన్‌ను ముందే గుర్తిస్తే తొలి దశల్లోనే చికిత్స అందించి ఆ వ్యాధి పురోగతిని ఆపవచ్చు. లేదా నిరోధించవచ్చు" అని ఈ పరిశోధకులు చెప్పారు.

లోకం తీరు



విశ్వ జ్ఞాన కేంద్రంగా
భారత్‌ను తిరిగి నిలబెడతా

» నలంద వర్సిటీ కొత్త క్యాంపస్ ప్రారంభోత్సవంలో మోదీ

రాజ్‌గిర్ (బిహార్), జూన్ 19: విశ్వజ్ఞాన కేంద్రంగా భారత్‌ను తిరిగి నిలపడటమే తన లక్ష్యమని ప్రధాని మోదీ ప్రకటించారు. బిహార్‌లోని నలంద యూనివర్సిటీ నూతన క్యాంపస్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. భారతీయ జ్ఞాన వారసత్వానికి నలంద చిహ్నమని, దేశాల మధ్య వారధిలా అది నిలబడి ఉందని తెలిపారు. "నలంద కేవలంపేరు కాదు. అదొక తారకమంత్రం. పుస్తకాలను తగలబెట్టవచ్చు, కానీ జ్ఞానాన్ని కాదు అనేందుకు నలంద అస్తిత్వమే తిరుగులేని నిదర్శనం" అని ఆయన అన్నారు. మరికొద్ది రోజుల్లో జరుపుకోబోతున్న ప్రపంచ యోగా దినం ప్రస్తావన తెస్తూ... ప్రపంచానికి తన సంస్కృతిని భారత్ అందిస్తూనే ఉందన్నారు. భారత్‌ను విశ్వ జ్ఞాన కేంద్రంగా నిలపడంలో భాగంగా ఇప్పటికే తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు కోటి మందికి పైగా పిల్లలకు సాంకేతిక విషయాలను నేర్పిస్తున్నాయనీ, చంద్రయాన్, గగన్‌యాన్ మిషన్లు వారి జిజ్ఞాసను పెంచుతున్నాయని మోదీ వివరించారు. ఇదిలా ఉండగా, 12వ శతాబ్దంలో మగధపై దండెత్తిన ఆఫ్ఘాన్లు నలంద వర్సిటీని ధ్వంసం చేశారు. విధ్వంస చరిత్రకు నిదర్శకంగా నలందలో మిగిలిన శిథిల భాగాలను మోదీ బుధవారం పరిశీలించారు. కొత్తగా నలందలో నెలకొల్పిన క్యాంపస్‌ను నెట్ జీరో పద్ధతిలో గ్రీన్ క్యాంపస్ రూపంలో దీనిని తీర్చిదిద్దారు. వంద ఎకరాల్లో విస్తరించిన క్యాంపస్‌లో సోలార్ ప్లాంట్లు, నీటి శుద్ధి కేంద్రాలు, జల పునర్వినియోగ ప్లాంట్లు, చెరువులు, ఇతర పర్యావరణ అనుకూల ఏర్పాట్లు ఉన్నాయి.

పంజాబ్‌లో 10 వేల మంది పోలీసుల బదిలీ!

చండీగఢ్, జూన్ 19: పంజాబ్ సీఎం భగవంత్ మాన్ డ్రగ్ మహమ్మారిని నిర్మూలించడంలో భాగంగా అసాధారణ నిర్ణయం తీసుకున్నారు. ఏకంగా 10 వేల మంది పోలీసులను బదిలీ చేయాలని ఆదేశించారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి అధికారుల వరకు మొత్తం 10 వేల మందికి స్థానచలనం కల్పించారు. మున్ముందు మరిన్ని బదిలీలు ఉంటాయని చెప్పారు. డ్రగ్ విక్రయదారులతో పోలీసులకూ సంబంధాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ విషయమై అనేక ఫిర్యాదులు అందాయని చెప్పారు. కొన్ని చోట్ల ఎస్‌హెచ్‌వోలు 10 నుంచి 20 ఏళ్లుగా పనిచేస్తున్నారని.. అలాంటి ఠాణాల్లో పోలీసులపై ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అందుకే 10 వేల మంది పోలీసులపై బదిలీ వేటు వేసినట్లు వెల్లడించారు.

తమిళనాడులో కల్తీసారాకు 13 మంది బలి

చెన్నై, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కళ్లకుర్చి జిల్లా కరుణాపురంలో కల్తీ సారా తాగి 13 మంది మృతి చెందారు. మరో 60 మంది అస్వస్థతకు గురై వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు ప్రకటించారు. మంగళవారం రాత్రి సుమారు 75 మంది కల్తీసారా తాగారు. బుధవారం వేకువజామున వీరంతా వాంతులు, విరేచనాలు, కడుపులో మంటతో బాధపడుతుండటంతో కుటుంబీకులు వారిని ఆసుపత్రులకు తరలించారు. చికిత్స పొందుతూ 13 మంది మృతి చెందారు. మృతుల్లో మహిళ కూడా ఉన్నారు.

అమెజాన్ పార్సిల్‌లో నాగుపాము



బెంగళూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థ అమెజాన్‌లో వీడియో గేమ్‌కు సంబంధించిన ఎక్స్‌బాక్స్ కంట్రోలర్ బుక్ చేసుకున్న వినియోగదారుడికి చేదు అనుభవం ఎదురైంది. ఆ సంస్థ నుంచి వచ్చిన పార్సిల్‌లో పాము ప్రత్యక్షమైంది. బెంగళూరు సర్జాపురలో నివసించే సాఫ్ట్‌వేర్ దంపతులు వారం కిందట అమెజాన్‌లో ఎక్స్‌బాక్స్ కంట్రోలర్‌ను ఆర్డర్ చేశారు. పార్సిల్ మంగళవారం రావడంతో తెరిచే ప్రయత్నం చేయగా.. నాగపాము పడగవిప్పి ప్రత్యక్షమైంది. పార్సిల్ బాక్స్‌కు చుట్టిన ప్లాస్టిక్ టేప్‌కు పాము అతుక్కుపోయి ఉండడంతో బయటకు రాలేకపోయింది. వెంటనే ఆ పార్సిల్‌ను ఓ బకెట్‌లో ఉంచి.. వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీనిపై అమెజాన్ కంపెనీ విచారం వ్యక్తం చేసింది. బాధితులు ఎక్స్‌బాక్స్‌కు చెల్లించిన మొత్తాన్ని వాపసు చేసింది. విషపూరితమైన పాము ఎలా వచ్చిందనే దానిపై విచారణ జరుపుతామని పేర్కొంది.

స్వదేశీ ఆహారం కొనండన్న సునాక్‌పై ట్రోల్స్

లండన్, జూన్ 19: "మనం విదేశీ ఆహారం మీద ఆధారపడకూడదు. బ్రిటిష్‌వి కొనండి" అని బ్రిటన్ ప్రధాని సునాక్ పిలుపునివ్వడం సామాజిక మాధ్యమాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కొందరు యూజర్లు ఆయనకు మద్దతు తెలపగా మరికొందరు అది ఎప్పటికీ సాధ్యం కాదంటూ విమర్శిస్తున్నారు. బ్రిటిష్‌వే కొనండన్న సునాక్ పోస్టు.. భారత స్వాతంత్రోద్యమంలో మహాత్మా గాంధీ 'స్వదేశీ' విధానాన్ని గుర్తుచేస్తోందని మరికొందరు పేర్కొన్నారు. కాగా, జులై 4న అక్కడ సార్వత్రిక ఎన్నికలు జరుగనున్నాయి.

అనారోగ్యంతో శిరీష్ భరద్వాజ్ కన్నుమూత

హైదరాబాద్, జూన్ 20: సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు శిరీష్ భరద్వాజ్ (39) అనారోగ్యంతో మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో కన్నుమూశారు. ఊపిరితిత్తులు పాడవడంతో కొన్నాళ్లుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. 2007లో ఓ ప్రముఖ నటుడి కుమార్తెను ప్రేమ వివాహం చేసుకుని.. అప్పట్లో ఆయన వార్తల్లో నిలిచారు. ఒక పాప పుట్టాక 2014లో వారిద్దరూ విడిపోయారు. ఆ తర్వాత డాక్టర్ విహనను వివాహం చేసుకున్న శిరీష్.. కొంతకాలంగా చెన్నైలో ఉంటున్నట్టు సమాచారం. కొన్నాళ్ల క్రితం ఆయన బీజేపీలో చేరినా క్రియాశీలంగా లేరు.

ఏఐ ఊహా సుందరి



చిత్రంలో ఉన్న ఈ అమ్మాయి.. అమ్మాయి కాదు.. ఏఐ పుట్టించిన అందం. రాహుల్ చౌదరి అనే వ్యక్తి ఈ డిజిటల్ భామను సృష్టించారు. జారా శతావరీ అని పేరు కూడా పెట్టారు. ఈ జారా ఇప్పుడు అందాల పోటీల్లో పాల్గొని టాప్ 10లో నిలిచింది. జారా లాంటి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఊహా సుందరుల కోసం 'ఫ్యాన్ వ్యూ' అనే సంస్థ ఈ అందాల పోటీలను నిర్వహిస్తోంది. ఇందులో విజేతగా నిలిచిన డిజిటల్ సుందరికి 'మిస్ ఏఐ' అని టైటిల్ ఇవ్వనున్నారు. జారా ఈ రేసులో ఉంది.

ఢిల్లీకి వడదెబ్బ



గడిచిన వారం రోజుల్లో 20 మంది మృత్యువాత

» నోయిడాలో ఒక్కరోజే 10 మంది మృతి!

» ఆస్పత్రుల్లో పదుల సంఖ్యలో బాధితులు

» వడదెబ్బ బాధితులకు వేగంగా చికిత్స అందించాలంటూ కేంద్రం మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండే ఎండలు, భీకరమైన వడగాలులు, తీవ్రమైన నీటి కొరత ఢిల్లీ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఎండలు, వడగాలులతో ఢిల్లీలో గడిచిన వారం రోజుల్లో 20 మంది చనిపోయారు. ఢిల్లీ పక్కనే ఉన్న నోయిడాలో ఒక్కరోజులోనే 10మంది మృత్యువాత పడ్డారు. వడదెబ్బతో ఢిల్లీలోని రామ్‌మనోహర్ లోహియా ఆస్పత్రిలో మే 27 నుంచి 45 మంది చేరారు. ఇక్కడ రెండు రోజుల్లోనే 9 మంది చనిపోయారు. సఫ్దర్ జంగ్ ఆస్పత్రిలో బుధవారం ఒక్కరోజే ఐదుగురు చనిపోయారు. ఈ హాస్పిటల్‌లో మొత్తంగా తొమ్మిది మంది చనిపోయారు. ఎల్‌ఎన్‌జే ఆస్పత్రిలో ఏడు రోజుల్లో ఇద్దరు మృతిచెందారు. ఆస్పత్రుల్లో చేరకుండా చనిపోతున్న వృద్ధుల సంఖ్య ఇంతకంటే ఎక్కువగా ఉంటుందని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఢిల్లీ రాజధాని ప్రాంతంలో వడదెబ్బతో పదుల సంఖ్యలో బాధితులు చికిత్స పొందుతున్నారు.

మరణాల రేటు ఎక్కువగా..

ఢిల్లీలో వడగాలుల నేపథ్యంలో కేంద్ర ఆరోగ్యశాఖ.. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఆస్పత్రులకు మార్గదర్శకాలను జారీ చేసింది. వడదెబ్బతో వచ్చే రోగులకు త్వరగా చికిత్స అందించాలని సూచించింది. ఆస్పత్రుల సన్నద్ధతపై కేంద్ర ఆరోగ్య మంత్రి నడ్డా కూడా బుధవారం సమీక్ష నిర్వహించారు. వడదెబ్బ బాధితుల కోసం ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా విభాగాలు ఏర్పాటు చేయాలన్నారు. వడదెబ్బతో ఆస్పత్రిలో చేరుతున్నవారిలో మరణాల రేటు అధికంగా ఉందని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ అజయ్ శుక్లా చెప్పారు. పరిస్థితి విషమించాక బాధితులను ఆస్పత్రులకు తీసుకువస్తున్నారని, వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలు మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు బయటకు రావొద్దని ఢిల్లీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సూచించింది. నెల రోజులగా ఢిల్లీని వడగాలులు భయపెడుతున్నాయి. ఇక్కడ రోజువారీ కనిష్ఠ ఉష్ణోగ్రతలే 35 డిగ్రీల దాకా నమోదు అవుతున్నాయి. ఇది సాధారణం కంటే చాల ఎక్కువ. గరిష్ఠ ఉష్ణోగ్రతలు రోజూ 45డిగ్రీలు దాటి నమోదు అవుతున్నాయి. రాత్రిపూట కూడా వేడిగాలులు వస్తుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

హజ్ యాత్రలో 550 మంది మృత్యువాత!

ఎడారి దేశం సౌదీ అరేబియాల్లో మండే ఎండలు ఈ ఏడాది హజ్ యాత్రికుల్లో వందలాది మందిని బలిగొన్నాయి. యాత్రకు వచ్చి ఎండల కారణంగా 550 మంది చనిపోయారని సౌదీలోని అధికార వర్గాలు వెల్లడించాయి. వారి పేర్లతో కూడిన ఓ జాబితా ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అవుతోంది. అయితే, దీనిపై సౌదీ అరేబియా ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. మరోవైపు, యాత్రికుల్లో 645 మంది మరణించారని అందులో 68 మంది భారతీయులు ఉన్నారని సౌదీ అరేబియాకు చెందిన దౌత్యవేత్త ఒకరు వెల్లడించారు. కాగా, ఈ ఏడాది ఐదు రోజుల హజ్ యాత్ర బుధవారంతో ముగిసింది.

నీటి కొరతను 2 రోజుల్లో పరిష్కరించండి

లేకపోతే నిరవధిక నిరాహార దీక్ష

ప్రధానికి ఢిల్లీ మంత్రి అతిశీ లేఖ



ఢిల్లీలో నీటి సంక్షోభాన్ని కేంద్రప్రభుత్వం రెండు రోజుల్లో పరిష్కరించాలని, లేకపోతే తాను శుక్రవారం నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తానని ఢిల్లీ తాగునీటి సరఫరా మంత్రి అతిశీ ప్రధాని మోదీకి లేఖ రాశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. ఢిల్లీకి రావాల్సిన నీటి వాటాను హరియాణా ప్రభుత్వం సక్రమంగా విడుదల చేయడం లేదని ఆమె ఆరోపించారు. "ఢిల్లీకి రోజుకు 613 మిలియన్ గ్యాలన్ల నీటిని విడుదల చేయాల్సి ఉండగా మంగళవారం హరియాణా ప్రభుత్వం కేవలం 513 గ్యాలన్ల నీటిని మాత్రమే సరఫరా చేసింది. ఒక్కో మిలియన్ గ్యాలన్ల నీటిని 28,500 మంది వాడుకుంటారు. అంటే హరియాణా ప్రభుత్వం 28 లక్షల మందికి సరిపోయేంత నీటిని ఆపేసిందన్నమాట" అని వివరించారు.

టెస్టుల తర్వాతే యాంటీ బయాటిక్‌లు!

వైద్య సంస్థలకు ఎన్ఎంసీ మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, జూన్ 19: పేషంట్లు ఆరోగ్య పరీక్షలు (డయాగ్నస్టిక్ టెస్ట్‌లు) చేయించుకున్న తర్వాత ఆ రిపోర్టుల ఆధారంగా, అవసరమైతేనే యాంటీబయాటిక్ ఔషధాలను సిఫార్సు చేయాలని వైద్యులకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) సూచించింది. ఆరోగ్య పరీక్షలు జరగక ముందు యాంటీబయాటిక్‌లను సిఫార్సు చేయరాదని స్పష్టం చేసింది. దేశంలో యాంటీబయాటిక్ ఔషధాల వినియోగం విచ్చలవిడిగా పెరిగిపోయి యాంటీ మైక్రోబియల్ నిరోధకతకు దారితీయటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వ్యాధికారక సూక్ష్మజీవులు ఔషధాలకు లొంగని విధంగా తయారుకావటాన్ని యాంటీ మైక్రోబియల్ నిరోధకతగా పేర్కొంటారు. కాగా, ఈ ఏడాది జనవరిలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్.. యాంటీబయాటిక్ ఔషధాలను సిఫార్సు చేసిన ప్రతిసారీ అందుకు కారణాలను ప్రిస్క్రిప్షన్‌పై స్పష్టంగా రాయాలని వైద్యులకు ఆదేశాలు జారీ చేసింది.

గాలి కాలుష్యంతో 81లక్షల మంది మృతి

న్యూఢిల్లీ, జూన్ 19: 2021లో ప్రపంచవ్యాప్తంగా వాయుకాలుష్యం కారణంగా 81 లక్షల మంది చనిపోయారని, ఇందులో భారత్‌లో 21 లక్షల మరణాలు నమోదయ్యాయని బుధవారం విడుదలైన నివేదిక పేర్కొంది. యూనిసెఫ్ భాగస్వామ్యంతో అమెరికాకు చెందిన హెల్త్ ఎఫెక్ట్స్ ఇన్‌స్టిట్యూట్ (హెచ్ఈఐ) ఈ నివేదికను ప్రచురించింది. 2021 సంవత్సరంలో భారత్‌లో ఐదేళ్లకన్నా తక్కువ వయసున్న 1,69,400 మంది చిన్నారులు వాయుకాలుష్యం వల్ల మరణించినట్టు నివేదిక పేర్కొంది. 2021లో ప్రపంచవ్యాప్తంగా సంభవించిన మొత్తం మరణాల్లో 12 శాతం వాయు కాలుష్యం వల్లనేనని వివరించింది.

యూజీసీ-నెట్ పరీక్ష రద్దు

న్యూఢిల్లీ, జూన్ 19: నీట్ పరీక్ష ర్యాంకింగ్‌లు, గ్రేస్ మార్కుల వ్యవహారంతో అభాసుపాలై.. సుప్రీంకోర్టు ఆగ్రహానికి గురవుతున్న జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ(ఎన్‌టీఏ) తాజాగా మరో అపవాదును మూటగట్టుకుంది. ఆ సంస్థ దేశవ్యాప్తంగా నిర్వహించిన యూజీసీ-నెట్ పరీక్షను రద్దు చేస్తున్నట్టు కేంద్ర విద్యాశాఖ బుధవారం రాత్రి ప్రకటించింది. దేశంలోని విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో జూనియర్ రిసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్), పీహెచ్‌డీ ప్రవేశాలు, అసిస్టెంట్ ప్రొఫెసర్ కొలువులకు అర్హతకు ఎన్‌టీఏ ఏటా జూన్, డిసెంబరు సెషన్లలో జాతీయ అర్హత పరీక్ష(యూజీసీ-నెట్)ను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.! జూన్ సెషన్‌కు సంబంధించి దేశవ్యాప్తంగా మంగళవారం రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరిగాయి. అయితే.. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేసే సైబర్ క్రైమ్ హెచ్చరికల విశ్లేషణ యూనిట్-- ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) యూజీసీ-నెట్ పరీక్ష సమగ్రతకు భంగం(లీకేజీ అనుమానాలు!) వాటిల్లినట్లు బుధవారం కేంద్ర ప్రభుత్వానికి సమాచారమిచ్చింది. దీంతో.. ఆ పరీక్షను రద్దు చేస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. తదుపరి పరీక్ష తేదీని త్వరలో వెల్లడిస్తామని స్పష్టం చేసింది. యూజీసీ-నెట్ పరీక్ష రద్దుపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ తీవ్రంగా స్పందించారు. "బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యం, అవినీతితో యువత జీవితాలతో చెలగాటమాడుతోంది. నీట్ తర్వాత ఇప్పుడు నెట్ వంతు వచ్చింది. అవకతవకలను కప్పిపుచ్చుకోవడానికే నెట్ పరీక్షను రద్దు చేశారు" అని ఆమె ఎక్స్‌లో విరుచుకుపడ్డారు.

నీట్ అక్రమాలపై నిరసనల యుద్ధం

రేపు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆందోళనలు.. అన్ని రాష్ట్రాల పీసీసీ చీఫ్‌లకు ఇప్పటికే లేఖలు

» పార్లమెంటు సమావేశాల్లోనూ పోరు

న్యూఢిల్లీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నీట్ అక్రమాలపై దేశవ్యాప్త ఆందోళనలకు కాంగ్రెస్ సిద్ధమైంది. ఆ పరీక్ష నిర్వహణలో మోదీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ.. పేపర్ లీకేజీలతో అన్యాయానికి గురైన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం (21న) అన్ని రాష్ట్రాల్లోని తమ పార్టీ ప్రధాన కార్యాలయాల వద్ద నిరసనలు చేపట్టాలని నిర్ణయించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ మేరకు అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, పార్టీ శాసనసభాపక్ష నేతలకు లేఖ రాశారు. సీనియర్ నాయకులు, కార్యకర్తలు అందరూ ఈ ఆందోళనలలో పాల్గొనాలని ఆదేశించారు. బిహార్, గుజరాత్, హరియాణాలో చేసిన అరెస్టులతో.. నీట్ నిర్వహణలో వ్యవస్థీకృత అవినీతి జరిగిందని స్పష్టమవుతోందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో మాల్ ప్రాక్టీస్ జరుగుతోందని ఈ అరెస్టులతో తెలిసిందన్నారు. సోమవారం నుంచి కొత్త లోక్‌సభ తొలి సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో నీట్ అక్రమాలపై ఉధృతపోరుకు కాంగ్రెస్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇక.. పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకులను బీజేపీ వ్యవస్థీకృతం చేస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సందీప్ పాఠక్ ధ్వజమెత్తారు. నీట్ నిర్వహణలో అక్రమాలపై ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని.. కేంద్ర విద్యాశాఖ మంత్రిని సస్పెండ్ చేయాలని.. లేదా ఈ అవకతవకలకు బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఆప్ యువ విభాగం నేతలు.. నీట్ పరీక్ష రద్దు కోరుతూ కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్ ఇంటి బయటన నిరసనకు దిగారు. ఇదిలా ఉండగా, నీట్‌లో అక్రమాలు, అరెస్టులపై కేంద్ర విద్యాశాఖ బిహార్ పోలీసుల నుంచి నివేదిక కోరింది.



గురుగ్రాంలో ఆప్ శ్రేణుల నిరసన

నకిలీ పత్రాలతో కోర్టుకు..

జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ తన నీట్ ఫలితాన్ని వెల్లడించలేదని, తన ఓఎంఆర్ షీట్ చినిగిపోయినట్టు తెలిపిందని పేర్కొంటూ ఆయుషి పటేల్ అనే విద్యార్థిని అలహాబాద్ హైకోర్టులో వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. తన ఆరోపణలకు సంబంధించి ఆమె నకిలీ పత్రాలను కోర్టుకు సమర్పించిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయుషి ఆరోపణలను అప్పట్లోనే ఎన్‌టీఏ తీవ్రంగా ఖండించింది. ఆమె ఓఎంఆర్ షీట్ చినిగిపోలేదని, ఆమెకు 335 మార్కులు వచ్చాయని ప్రకటించింది. కానీ ఆ మార్కులు తనవి కావని.. వేరొకని నంబర్‌తో తనకు ఆ మార్కులు ఇచ్చారని వాదిస్తూ ఆయుషి ఓ వీడియోను విడుదల చేసింది. కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ ఆ వీడియోను షేర్ చేశారు.

మద్దతు ధర పెంపు

వరి, జొన్న, పత్తి సహా 14 పంటలకు

» కేంద్ర క్యాబినెట్ తొలి సమావేశంలో నిర్ణయం

న్యూఢిల్లీ, జూన్ 19: కేంద్రంలో కొత్తగా కొలువైన ఎన్డీయే సర్కారు రైతులకు తీపికబురు చెప్పింది. ప్రధాని మోదీ నేతృత్వంలో బుధవారం సమావేశమైన కొత్త క్యాబినెట్.. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి, గోధుమ, పత్తి సహా 14 పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పెంపు సహా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆయా పంటల ఉత్పత్తి ఖర్చుకు 50 శాతం జోడించి ఈ ధరలను నిర్ణయించినట్టు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. కనీస మద్దతు ధర అనేది.. ఉత్పత్తి ఖర్చుకు ఒకటిన్నర రెట్లు ఉండాలంటూ 2018 బడ్జెట్‌లో కేంద్రం స్పష్టమైన విధాన నిర్ణయాన్ని తీసుకుందని గుర్తుచేశారు. బుధవారం క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం అందుకు అనుగుణంగానే ఉందని తెలిపారు. దేశవ్యాప్తంగా కనీస మద్దతు ధరలను పెంచుతూ కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో.. రైతులు నిరుటితో పోలిస్తే రూ.35వేల కోట్ల మేర అదనంగా లబ్ధి పొందుతారని అంచనా. కాగా.. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలంటూ రైతులు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. హరియానా, మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల శాసనసభలకు ఈ ఏడాది ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్రం 14 పంటలకు కనీస మద్దతు ధరను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

పంట		మద్దతు ధర (క్వింటాలుకు)
వరి	సాధారణం	రూ.2,300
	గ్రేడ్ ఏ	రూ.2320
జొన్న	హైబ్రిడ్	రూ.3,371
	మాల్దండి	రూ.3,421
పత్తి	మధ్యరకం	రూ.7,121
	పొడుగు పింజ	రూ.7,521
సజ్జలు		రూ.2,625
రాగులు		రూ.4,290
మొక్కజొన్న		రూ.2,225
కందులు		రూ.7,550
పెసర్లు		రూ.8,682
మినుములు		రూ.7,400
వేరుశనగ		రూ.6783
పొద్దుతిరుగుడు		రూ.7,280
సోయాబీన్ (ఎల్లో)		రూ.4,892
నువ్వులు		రూ.9,267

మరికొన్ని నిర్ణయాలు..

● మహారాష్ట్రలోని వధావన్‌లో రూ.76,200 కోట్లతో భారీ గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి ఆమోదం; నిర్మాణం పూర్తయితే.. ప్రపంచంలోని టాప్-10 పోర్టుల్లో ఒకటిగా నిలిచే అవకాశం ఉంది.

● తీరప్రాంత పవనశక్తి ప్రాజెక్టులకు సంబంధించి.. రూ.7,453 కోట్లతో వయబులిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) స్కీమ్ అమలుకు పచ్చజెండా. తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లోని తీర ప్రాంతాల్లో 500 మెగావాట్ల చొప్పున నిర్మించే ఒక గిగావాట్ పవనశక్తి కేంద్రాల నిర్మాణానికి అయ్యే రూ.6,853 కోట్లు ఈ పథకం ద్వారానే ఖర్చుపెట్టనున్నారు.

● రూ.2,870 కోట్లతో.. వారాణసీ నగరంలోని లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయ అభివృద్ధి ప్రతిపాదనలకు అంగీకార ముద్ర. ఆ విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ భవన నిర్మాణంతోపాటు, రన్‌వేను విస్తరణకు చేసిన ప్రతిపాదనలను క్యాబినెట్ ఆమోదించింది.

● రూ.2,254 కోట్ల ఖర్చుతో.. 2024-2029 నడుమ దేశవ్యాప్తంగా ఫోరెన్సిక్ మౌలిక సదుపాయాల విస్తరణకు క్యాబినెట్ అంగీకారం తెలిపింది. ఈ నిధులతో.. ఫోరెన్సిక్ ల్యాబుల ఏర్పాటు, ఢిల్లీలో ఉన్న నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీకి దేశవ్యాప్తంగా కొత్త క్యాంపస్‌ల అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నారు.

మన ఈవీఎంలు వేరే లెవల్!

» వాటిని మరో పరికరంతో అనుసంధానించడం కుదరదు

» ఈవీఎంల రూపకల్పనలో సహకరించిన ఐఐటీ ప్రొఫెసర్ల వివరణ

న్యూఢిల్లీ, జూన్ 19: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లపై ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఇటీవల చేసిన వ్యాఖ్యలతో వాటి విశ్వసనీయతపై ఆందోళన మొదలైంది. ఈవీఎంల పారదర్శకతను నిర్ధారించాలని, లేకపోతే ఆ యంత్రాలను పూర్తిగా రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీతో పాటు విపక్ష నేతలు కేంద్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. అయితే భారతీయ ఈవీఎంలు పూర్తి సురక్షితమైనవని, అవి ట్యాంపరింగ్ ప్రూఫ్ అని పలువురు భారతీయ ఇంజనీర్లు, డొమైన్ నిపుణులు పేర్కొంటున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో 60కోట్ల మందికి పైగా ఓటర్లు ఉపయోగించిన ఎం3 (మోడల్ 3) ఈవీఎంలో బహుళ భద్రతా ఫీచర్లు ఉన్నాయని వీటిని రూపొందించడంలో సహకరించిన ఐఐటీ ప్రొఫెసర్లు చెబుతున్నారు. ఈవీఎం ఒక సాధారణ కాలిక్యులేటర్ వంటిదని, దానిని హ్యాక్ చేయలేమని ఐఐటీ గాంధీనగర్ డైరెక్టర్, ఈవీఎం టెక్నికల్ ప్యానెల్‌లో సభ్యుడు రజత్ మూనా తెలిపారు.. 2019లో ప్రవేశపెట్టిన ఎం3 మోడల్‌ను ఎవరైనా ట్యాంపరింగ్ చేస్తే అందులోని ఆటోమేటెడ్ ఫంక్షన్లు, సాంకేతికలు దీన్ని వెంటనే ఫ్యాక్టరీ రీసెట్ చేసేస్తాయని వివరించారు. వీటిని ఇంటర్నెట్‌కు, మరే ఇతర పరికరాలకు అనుసంధానం చేయడం సాధ్యంకాదని, ఈ ఫీచర్ వాటి భద్రతను మరింత పెంచుతుందని చెప్పారు. 'ప్రపంచంలోని ఇతర ఈవీఎంల కంటే భారత ఈవీఎంలు భిన్నంగా ఉంటాయి. ఎం3 ఈవీఎంలకు ఇతర పరికరాలతో కనెక్షన్ ఉండదు. దీనికి విద్యుత్తు సరఫరా కూడా లేదు. వీటిని కేవలం ఓటింగ్ కోసమే రూపొందించారు. అందుకు మాత్రమే తప్ప మరి దేనికీ అవి పనికిరావు. వాటిలో మరే ఇతర సాఫ్ట్‌వేర్ కానీ, ప్రోగ్రామ్‌లు కానీ లోడ్ చేయలేం' అని ఐఐటీ బాంబేలో గౌరవాచార్యుడు, మైక్రో ఎలక్ట్రానిక్స్ నిపుణుడు దినేశ్ శర్మ వెల్లడించారు.

అనేక తనిఖీలు... భద్రత ఏర్పాట్లు

అభ్యర్థుల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించడం, థర్డ్ పార్టీ సాఫ్ట్‌వేర్ సమీక్షలతో పాటు ఈవీఎంలను అనేక తనిఖీలు నిర్వహిస్తారని నిపుణులు చెబుతున్నారు. నాసిక్ సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ నుంచి కరెన్సీ నోట్లకు ఉపయోగించే కాగితంతో సీల్ చేస్తారు. అభ్యర్థులు, వారి ప్రతినిధుల పర్యవేక్షణలో, కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈవీఎంలను సురక్షితమైన ప్రదేశంలో భద్రపరుస్తారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సార్వత్రిక ఎన్నికల సమయంలో ర్యాండమ్‌గా ఎంపిక చేసిన 20,625 వీవీప్యాట్ల బ్యాలెట్ స్లిప్‌లను కంట్రోల్ యూనిట్ల నుంచి సేకరించి, వాటిని ఈవీఎంలలో నమోదైన ఓట్లతో సరిపోలుస్తారు.

ఐఏఎస్, ఐపీఎస్‌లే వ్యవస్థలను భ్రష్టుపట్టించారు

- వైసీపీ ప్రభుత్వంలో మా కుటుంబానికి తీరని అన్యాయం: జేసీ ప్రభాకర్‌రెడ్డి



అనంతపురం జూన్ 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో కొందరు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు వ్యవస్థలను భ్రష్టుపట్టించారని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. అనంతపురంలోని తన నివాసంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. వైసీపీ పాలనలో తన కుటుంబానికి జరిగిన అన్యాయం గురించి వివరిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. కొందరు అధికారులతోపాటు ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి పేర్నినానిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'వైసీపీ ప్రభుత్వంలో నా కుటుంబానికి తీవ్ర అన్యాయం జరిగింది. మమ్మల్ని దొంగోళ్లను చేశారు. నాతోపాటు నా భార్య, కొడుకు, కోడళ్లపై కేసులు పెట్టారు. నన్ను, నా కొడుకును జైలుకు పంపించారు' అని ప్రభాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రోద్బలంతోనే ఇదంతా జరిగిందని ఆరోపించారు. మహిళా అధికారులను తాను బెదిరిస్తున్నానని జగన్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని జేసీ ప్రభాకర్ మండిపడ్డారు. మరోసారి ఇలాంటి అసత్య వార్తలను ప్రసారం చేస్తే ఖచ్చితంగా జగన్ పత్రిక కార్యాలయాన్ని మూసివేయిస్తానని ఆయన హెచ్చరించారు.

నాగార్జున వర్సిటీ వీసీ క్షమాపణ చెప్పాలి

- చాంబర్ ఎదుట రాజధాని రైతులు, విద్యార్థి సంఘాల ధర్నా
- గతంలో మూడు రాజధానులకు మద్దతు తెలపడంపై ఆగ్రహం

గుంటూరు, జూన్ 19: వైసీపీ ప్రభుత్వానికి వంత పాడుతూ మూడు రాజధానులకు మద్దతు తెలిసిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ ఆచార్య రాజశేఖర్ వెంటనే క్షమాపణ చెప్పాలని అమరావతి జేఏసీ రైతులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అమరావతి జేఏసీ రైతులు, టీఎన్ఎస్ఎఫ్, జనసేన, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు వర్సిటీ మెయిన్ గేటు ఎదుట బుధవారం ధర్నా చేశారు. వారిని లోనికి రానివ్వకుండా మెయిన్ గేట్‌కు తాళాలు వేయించిన, వీసీ పోలీసుల సహాయంతో లోనికి వెళ్లిపోయారు. దీంతో వారు గేట్లు దూకి లోపలికి ప్రవేశించి వీసీ భవనాన్ని ముట్టడించారు. అనంతరం వీసీ చాంబర్ ఎదుట నిరసన వ్యక్తంచేశారు. మూడు రాజధానులకు మద్దతుగా గతంలో వీసీ సెమినార్ నిర్వహించడంపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



వీసీ భవనం ఎదుట నిరసన తెలుపుతున్న అమరావతి రైతులు, విద్యార్థి సంఘాల నాయకులు

పిల్లల చిక్కీల్లోనూ మేత

- అప్పనంగా రూ.150 కోట్ల కాంట్రాక్టు
- టెండర్లు ఎత్తివేసి రెండేళ్లు పొడిగింపు
- న్యాయ సమీక్ష కళ్లుగప్పి దోపిడీ
- ఓ మాజీ మంత్రికి 10శాతం కమీషన్
- టెండర్లను ఉద్దేశపూర్వకంగా మర్చిపోయిన వైనం
- గడువు ముగిసే వరకూ అధికారుల మౌనం
- చివరికి పొడిగింపు ఉత్తర్వులు



అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జగన్ సర్కారులో నేతలు పిల్లలకిచ్చే చిక్కీలను వదల్లేదు. ఓ మాజీ మంత్రి కమీషన్‌కు కక్కుర్తిపడి రూ.150 కోట్ల కాంట్రాక్టును ఏ ప్రక్రియా లేకుండానే పొడిగించేలా చేశారు. పద్ధతి ప్రకారం టెండర్లు పిలిచి కాంట్రాక్టును అప్పగించాల్సిన అధికారులు సదరు మాజీ మంత్రి చెప్పినదానికి తలాడించారు. పట్టించుకోవాల్సిన ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు మౌనం దాల్చారు. పిల్లలకు చిక్కీలు తెచ్చిన ఘనత తమదేనంటూ గొప్పలు చెప్పుకున్న జగన్ సర్కారు యథాప్రకారం ఈ దోపిడీ తనకేమీ పట్టనట్లు ఊరుకుంది. వంద కోట్లు పైబడిన కాంట్రాక్టులపై న్యాయ సమీక్షకు వెళ్లిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని చెప్పుకున్న నాటి ప్రభుత్వం చిక్కీల కాంట్రాక్టును ఇష్టారీతిని పొడిగించినా కిమ్మనలేదు. ఒకటి నుంచి పదో తరగతి వరకు చదివే పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో భాగంగా రోజు మార్చి రోజు చిక్కీలు పంపిణీ చేస్తున్నారు. దాదాపు 36 లక్షల మందికి వీటిని పంపిణీ చేస్తున్నారు. ఈ చిక్కీలు సరఫరా చేసే బాధ్యతను 2021లో ఆరు సంస్థలు దక్కించుకున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాలకు రావులపాలెనికి చెందిన కంపెనీ, ఉభయగోదావరి జిల్లాలకు విశాఖపట్నంకు చెందిన కంపెనీ, కృష్ణా, గుంటూరు జిల్లాలకు శ్రీకాకుళం కంపెనీ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు జైపూర్ కంపెనీ, చిత్తూరు, కడప జిల్లాలకు విజయనగరం కంపెనీ, అనంతపురం, కర్నూలు జిల్లాలకు హైదరాబాద్‌కు చెందిన కంపెనీలు ఈ కాంట్రాక్టును అప్పట్లో దక్కించుకున్నాయి. వారి కాంట్రాక్టు 2022 డిసెంబరుతో ముగిసింది. నిబంధనల ప్రకారం మళ్లీ టెండర్లు పిలిచి ఈ కాంట్రాక్టు అప్పగించాలి. కానీ పాఠశాల విద్యాశాఖ దీనిపై ఏకపక్ష నిర్ణయం తీసుకుంది. ఎలాంటి టెండర్లూ లేకుండా పాత కాంట్రాక్టర్లకే తిరిగి కాంట్రాక్టును పొడిగించింది. 'కాంట్రాక్టు పొడిగించాలని కాంట్రాక్టర్లు లేఖలు రాశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం పరిశీలించి కాంట్రాక్టు పొడిగించాలని నిర్ణయించింది' అని అప్పట్లో పాఠశాల విద్యాశాఖ వివరణ ఇచ్చింది. దీనిపై అప్పట్లో పెద్ద దుమారం రేగినా మధ్యాహ్న భోజనం విభాగం అధికారులు కనీసం స్పందించలేదు. జగన్ ప్రభుత్వం కూడా దీనిపై కిమ్మనలేదు.

విజిలెన్స్ తనిఖీల్లో దొరికినా...

చిక్కీల్లో నాణ్యత లేదని విజిలెన్స్ తనిఖీల్లో తేలినా ప్రభుత్వం పట్టించుకోలేదంటే కాంట్రాక్టర్ల వెనుక ఎవరి హస్తం ఉందో అర్థమవుతోంది. ఉత్తరాంధ్రకు చెందిన అప్పటి ఓ కీలక మంత్రికి ఇందులో 10శాతం కమీషన్లు అందాయని ఆరోపణలు వచ్చినా స్పందించలేదు. మధ్యాహ్న భోజనం నాణ్యత, ఇతరత్రా అంశాలపై విద్యాశాఖలో అప్పట్లో విజిలెన్స్ తనిఖీలు చేసింది. కొన్ని జిల్లాల్లో పాఠశాలల్లో కాలం చెల్లిన(ఎక్స్‌పైర్డ్) చిక్కీలు పంపిణీ చేస్తున్న విషయాన్ని విజిలెన్స్ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇది పిల్లల ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం అని తెలిసినా ప్రభుత్వం విచారణకు ఆదేశించలేదు. పైగా ఇవన్నీ తెలిసినా పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు తమకేం తెలియదన్నట్టుగా వ్యవహరించారు. అసలు తనిఖీలే జరగలేదని అప్పట్లో బుకాయించే ప్రయత్నమూ చేశారు.


పక్కా ప్లాన్‌తోనే పొడిగింపు

చిక్కీల కాంట్రాక్టర్లకు మేలు చేసి తద్వారా కమీషన్లు కొట్టేయాలని అప్పటి ప్రభుత్వ పెద్దలు ముందుగానే ప్లాన్ చేశారు. వారి ఆదేశాలతో అధికారులు టెండర్లు పిలవాలనే విషయాన్ని ఉద్దేశపూర్వకంగా మర్చిపోయారు. డిసెంబరుతో కాంట్రాక్టు ముగుస్తుంది అనుకున్నప్పుడు కనీసం మూడు నెలలు ముందుగా టెండర్లు పిలిచే ప్రక్రియను అధికారులు ప్రారంభించాలి. కానీ గడువు సమీపించేవరకూ అధికారులు టెండర్లను పక్కనపెట్టారు. చివరికి గడువు ముగిసే సమయంలో వేరే దారి లేదన్నట్టుగా పొడిగింపు ఉత్తర్వులు జారీచేశారు. ముందుగానే పాత కాంట్రాక్టర్లకు ఇవ్వాలనే ప్లాన్ లేకపోతే టెండర్ల ప్రక్రియకు అధికారులు ఎందుకు చర్యలు చేపట్టలేదు? కనీసం దానిపై లేఖలు ఎందుకు రాయలేదు? కాంట్రాక్టు పొడిగించాలని సరఫరాదారులు రాసిన లేఖల తేదీలు ఎందుకు మాయం చేశారు? అనే సందేహాలకు సమాధానం చెప్పాలి. పైగా రూ.వంద కోట్లు దాటిన టెండరు అయినా న్యాయ సమీక్షకు కూడా వెళ్లకుండా, టెండర్లే లేకుండా అప్పగించారు. అదే కొత్తగా టెండర్లు పిలిచి న్యాయ సమీక్షకు వెళ్లి ఉంటే అక్రమాలు బయటపడేవి. ఈ ఉద్దేశంతోనే నేరుగా పొడిగించి న్యాయ సమీక్ష కళ్లుగప్పారు.

విద్యాశాఖలో.. ప్రవీణ్ ప్రకాశ్ ఇష్టారాజ్యం!

ఎక్కువ ధరకు ఇంటర్ పుస్తకాల ముద్రణకు ఆదేశం

- పేజీ 29 పైసలకు చేయిస్తున్న తెలుగు అకాడమీ
- 33 పైసలకు పాతవారితో చేయించాలని జీవో
- విషయం మంత్రి లోకేశ్‌కు చెప్పకుండానే జారీ
- ఆర్థిక శాఖ అనుమతి కూడా తీసుకోలేదు
- వెలుగులోకి రావడంతో అధికారుల హడావుడి



అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ తీరు మళ్లీ వివాదాస్పదం అవుతోంది. గత ప్రభుత్వానికి అత్యంత సన్నిహితంగా వ్యవహరించిన ఆయన తీరు ఇప్పటికీ మారలేదు. గత ప్రభుత్వంలో ఆయన ఆదేశాలు అనేకసార్లు గందరగోళం సృష్టించగా, ఇప్పుడూ అదే పంథా కొనసాగుతోంది. తాజాగా ప్రభుత్వ కాలేజీల్లో చదివే ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ తొలి సమీక్షలో ఆదేశించారు. ఆయన ఆదేశాలకు అనుగుణంగా పాఠ్య పుస్తకాల ముద్రణ ఆర్డర్లు, పంపిణీపై పాఠశాల విద్యాశాఖ మంగళవారం రాత్రి జీవో జారీచేసింది. పదో తరగతి పాఠ్యపుస్తకాలు ముద్రణ చేసిన వారికే ఇంటర్ పుస్తకాల ముద్రణ ఆర్డర్ ఇవ్వాలని అందులో స్పష్టంచేశారు. 1 నుంచి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాల ముద్రణకు పేజీకి 33 పైసలు ధర నిర్ణయించారు. ఇంటర్‌లో విక్రయించే పాఠ్య పుస్తకాలు(సేల్ బుక్స్)ను పేజీ 29పైసలకే చేసేందుకు టెండర్లు ఖరారయ్యాయి. అది కూడా మంగళవారం మధ్యాహ్నం సేల్ బుక్స్ టెండర్లు ఖరారు కాగా.. రాత్రికే పదో తరగతి పుస్తకాలు ముద్రించిన వారితో చేయించాలని ప్రవీణ్ ప్రకాశ్ జీవో జారీచేశారు. అంటే ఇంటర్ పుస్తకాలకు టెండర్లు పిలిచిన తెలుగు అకాడమీని పాఠశాల విద్యాశాఖ సంప్రదించలేదు. పైగా ఈ ధరల విషయాన్ని మంత్రి లోకేశ్ దృష్టికీ తీసుకెళ్లలేదు. ఆర్థిక శాఖ అనుమతికి ఫైలు కూడా పెట్టలేదు. ఇవేం లేకుండానే ఆకస్మికంగా జీవో జారీచేసి ఆగమేఘాలపై చర్యలు ప్రారంభించాలని ఆదేశాలిచ్చారు. బుధవారం ఉదయం ఈ ధరల వ్యత్యాసం విషయం మంత్రి దృష్టికి వెళ్లింది. దీంతో అధికారులు హడావుడిగా సమీక్ష నిర్వహించారు. తెలుగు అకాడమీకి 10 శాతం అడ్మినిస్ట్రేటివ్ చార్జెస్ చెల్లించాలనే నిబంధన ఉంది. అది తొలగిస్తే దాని ద్వారానే తక్కువ ధరకు పుస్తకాలు వస్తాయి. ఎవరికి అప్పగిస్తే ముద్రణ ధర తగ్గుతుందో వివరిస్తూ.. తుది నిర్ణయం కోసం అధికారులు మళ్లీ ప్రభుత్వానికి ఫైలు పెట్టారు. అయితే ధరలపై మంత్రికి సమాచారం ఇవ్వకపోవడం, ఆర్థిక శాఖ అనుమతి పొందకుండా ప్రవీణ్ ప్రకాశ్ జీవో జారీ చేయడంపై అధికార వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. గతంలో జీఏడీలో, సీఎంవోలో ఉన్నప్పుడు కూడా ఆయన అడ్డగోలుగా వ్యవహరించారని గుర్తు చేసుకుంటున్నాయి. తాజా బదిలీల్లో ప్రభుత్వం ఆయనకు పోస్టింగ్ ఇవ్వకుండా జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశించింది.

శాస్త్రోక్తంగా జ్యేష్ఠాభిషేక ఉత్సవాలు ప్రారంభం



వజ్ర కవచాలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి

తిరుమల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో జ్యేష్ఠాభిషేక ఉత్సవాలు బుధవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. జ్యేష్ఠా నక్షత్రానికి ముగిసేట్టు ఏటా మూడు రోజుల పాటు ఈ వేడుక నిర్వహిస్తారు. తరతరాలుగా అభిషేకాలతో అత్యంత ప్రాచీనమైన స్వామి ఉత్సవమూర్తులు అరిగిపోకుండా పరిరక్షించేందుకు 1990 నుంచి ఈ ఉత్సవాలను టీటీడీ నిర్వహిస్తోంది. తొలిరోజు సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణమండపంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఉత్సవమూర్తులకు వజ్రకవచాన్ని అలంకరించి సహస్రదీపాలంకార సేవలో కొలువుదీర్చారు. సేవ అనంతరం స్వామివారు ఆలయ మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం ముత్యపు కవచం, శుక్రవారం స్వర్ణ కవచంతో స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.5.41 కోట్లు

తిరుమల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి హుండీ ఆదాయం భారీగా లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించగా రూ.5.41 కోట్లు లభించినట్టు టీటీడీ తెలిపింది. కాగా, మంగళవారం 75,125 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 31,140 మంది తలనీలాలు సమర్పించారు.

ఆర్థిక బకాయిలు చెల్లించండి: ఆప్టా

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ట్రెజరీ ఆమోదం పొంది సీఎఫ్ఎంఎస్‌లో నిలిచిపోయిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం(ఆప్టా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణపతిరావు, ప్రకాశ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీఎఫ్ఎంఎస్‌లో ఆగిపోయిన సరెండర్ లీవులు, ఏపీజీఎల్ఐ, పీఎఫ్, మెడికల్ బిల్లులు చెల్లించాలన్నారు.

ఆన్‌లైన్ అడ్మిషన్ల విధానాన్ని తొలగించాలి

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో సమస్యలు పరిష్కరించాలని అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహా సంఘం మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరింది. ఆ సంఘం ప్రతినిధులు రంగనాథ్, శ్రీధర్, జయప్ప, రాజశేఖర్ తదితరులు బుధవారం ఉండవల్లిలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా డిగ్రీలో ఆన్‌లైన్ అడ్మిషన్ల విధానం, సింగిల్ మేజర్ సబ్జెక్టుల విధానాన్ని తొలగించాలని కోరారు. అధ్యాపకులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలన్నారు.

ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి

- ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ హిమాన్షు పాఠక్

గుంటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పొగాకుతో పాటు మిర్చి, పసుపు, అశ్వగంధ వంటి పంట దిగుబడులకు సంబంధించి ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులపై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్(ఐసీఏఆర్) దృష్టి కేంద్రీకరించిందని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ తెలిపారు. బుధవారం ఆయన గుంటూరులోని సెంట్రల్ టుబాకో రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌ను తొలిసారి సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. అనంతరం అధికారులతో జరిగిన సమావేశంలో పాఠక్ మాట్లాడుతూ.. పంటల సాగులోకి టెక్నాలజీ శరవేగంగా చొచ్చుకు వస్తోందని, అవసరం లేని పాత విధానాలకు చెప్పాల్సిన అవసరం ఉందని తెలిపారు.

రైల్వే ట్రాక్‌కు అడ్డంగా ఇనుప కడ్డీ

- లోకో పైలెట్ అప్రమత్తతతో తప్పిన ముప్పు

ధర్మవరం, జూన్ 19: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని గాంధీనగర్ రైల్వే అండర్ బ్రిడ్జి ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తులు ఇనుప కడ్డీ అడ్డంగా ఉంచారు. లోకో పైలెట్ అప్రమత్తంగా వ్యవహరించడంతో యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రమాదం తప్పిందని ఆర్పీఎఫ్ సీఐ బోయకుమార్ బుధవారం తెలిపారు. యశ్వంత్‌పూర్ నుంచి బీదర్‌కు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం రాత్రి 8.30 గంటలకు ధర్మవరం చేరుకుంది. రైల్వే ట్రాక్‌కు అడ్డంగా ఇనుప కడ్డీ ఉండటాన్ని లోకో పైలెట్ గమనించి ఎమర్జెన్సీ బ్రేక్ వేశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది.

దేశ ప్రగతిలో వ్యవసాయం కీలకం

- ప్రపంచ దేశాలకు దిక్సూచిగా భారత్
- ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్



బాపట్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రగతిలో వ్యవసాయానిదే కీలక పాత్ర అని, సేద్యంలో ప్రపంచ దేశాలకే భారత్ దిక్సూచిగా మారిందని గవర్నర్, వ్యవసాయ యూనివర్సిటీ చాన్సలర్ అబ్దుల్ నజీర్ అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ 56వ స్నాతకోత్సవం బాపట్ల ఏజీ కళాశాలలో ఉన్న టీపీ నాథ్ ఆడిటోరియంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ చాన్సలర్ హోదాలో గవర్నర్ హాజరై విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేసి మాట్లాడారు. దశాబ్దాల తరబడి వ్యవసాయ రంగం పురోగతికి తన వంతు సేవలందిస్తున్న ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీ నుంచి డిగ్రీలు పొందిన వారందరికీ అభినందనలను తెలియజేశారు. ఈ యూనివర్సిటీకి 60 సంవత్సరాల నుంచి రైతు సేవలో తరించిన విశిష్ట చరిత్ర ఉందన్నారు. కృషి విజ్ఞాన కేంద్రాలతో పాటు ఆన్ ఫార్మ్ ట్రయల్స్ వంటివి యూనివర్సిటీ పరిధిలో చేపట్టడంతో అధిక ఉత్పాదకత సాధ్యమైందన్నారు. సేద్యం వంటి కీలక రంగం గాడి తప్పితే మిగిలినవన్నీ కూడా సరిగా జరిగే అవకాశం ఉండదని భారతరత్న డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ మాటలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పాలు, పప్పులు, సుగంధ ద్రవ్యాలను ప్రపంచదేశాలన్నింటిలో కల్లా ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్న దేశంగా భారత్ నిలుస్తోందని పేర్కొన్నారు. యూనివర్సిటీ నుంచి డిగ్రీ పట్టా అందుకుంటున్న విద్యార్థులందరూ ఈ ఒరవడిని కొనసాగించడంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ సెక్రటరీ హిమాన్షు పాఠక్ మాట్లాడుతూ అన్నదాతలకు ఎంతో సేవ చేస్తున్న ఈ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. దేశంలో ఉన్న 77 వ్యవసాయ యూనివర్సిటీల్లో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ ఒక వజ్రం లాంటిదని కొనియాడారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా మీ ప్రయాణం ఉండాలని డిగ్రీలు అందుకుంటున్న విద్యార్థులకు పాఠక్ సూచించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి పాల్గొని యూనివర్సిటీ ప్రగతిపై నివేదిక సమర్పించారు. కాగా.. స్నాతకోత్సవంలో భాగంగా యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో విద్యనభ్యసించిన 1,576 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. 1,319 అండర్ గ్రాడ్యుయేట్, 193 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్, 64 మంది పీహెచ్‌డీలు పట్టాలు అందుకున్నారు. అగ్రికల్చరల్ సైన్స్‌లో పరిశోధనలకు డాక్టర్ శరత్ కుమార్ ప్రధాన్.. గవర్నర్ నుంచి అవార్డు అందుకున్నారు.

రబీ నష్టం రూ.300 కోట్లు

- క్షేత్రస్థాయిలో పరిశీలించి.. ప్రభుత్వానికి నివేదిస్తాం
- రితీశ్ చౌహాన్ నేతృత్వంలోని కేంద్ర బృందం వెల్లడి
- నష్టంపై అనంత జిల్లా కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష
- నెల్లూరు జిల్లా కలిగిరి, కొండాపురం మండలాల్లో పర్యటన
- దెబ్బతిన్న పంటలు పరిశీలన, రైతులతో ముఖాముఖి



నెల్లూరు జిల్లా కొండాపురం మండలం గొట్టిగుండాల గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న కరువు బృందం

అనంతపురం టౌన్/కలిగిరి/కొండాపురం/నెల్లూరు, జూన్ 19: 2023-24 రబీ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో రైతాంగానికి సుమారు రూ.300 కోట్లు నష్టం వాటిల్లిందని కేంద్ర కరువు బృందం తెలిపింది. పంటనష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి కేంద్రం నుంచి ప్రత్యేక బృందాలు రాష్ట్రానికి వచ్చాయి. ఐఏఎస్ రితీష్ చౌహాన్ నేతృత్వంలో ఐఏఎస్ చిన్మయ్ పుండ్లిక్ రావ్ గోత్మారే, ఐఏఎస్ కూర్మనాథ్ బృందం అనంతపురం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రితీష్ చౌహాన్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో గతేడాది రబీలో పంటనష్టం వాటిల్లిదని తెలిపారు. ప్రకాశం జిల్లాలో 31, నెల్లూరు జిల్లాలో 10, కర్నూలు జిల్లాలో 18, నంద్యాల జిల్లాలో 13, అనంతపురం జిల్లాలో 14, శ్రీసత్యసాయి జిల్లాలో ఒక మండలం కలిపి మొత్తం 87 మండలాలను రాష్ట్ర ప్రభుత్వం కరువు ప్రాంతాలుగా ప్రకటించిందని వివరించారు. పరిశీలన అనంతరం నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని, ఆ తర్వాత కేంద్రం నుంచి కరువు నిధులు మంజూరు అవుతాయని పేర్కొన్నారు. అనంతపురం కలెక్టరేట్‌లో కరువు పరిస్థితులను వివరించే ఫొటోల ప్రదర్శనను ఈ బృందం పరిశీలించింది. కార్యక్రమంలో అనంతపురం జిల్లా కలెక్టరు వినోద్‌కుమార్, జేసీ కేతన్ గార్గ్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయాం.. ఆదుకోండి: అన్నదాతల వేడుకోలు

తీవ్ర దుర్భిక్షంతో పంటలు ఎండిపోయి పూర్తిగా నష్టపోయిన తమను ఆదుకోవాలని కేంద్ర కరువు బృందానికి రైతులు విజ్ఞప్తి చేశారు. గత రబీ సీజన్‌లో జరిగిన పంట నష్టాలను అంచనా వేసేందుకు కేంద్ర కరువు బృందం సభ్యులు మన్నుజి ఉపాధ్యాయ్, ఎస్‌సి కస్యప్, మదన్‌మోహన్ మౌర్య, బి. అనురాధ బుధవారం సాయంత్రం శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కలిగిరి, కొండాపురం మండలాల్లో పర్యటించారు. తొలుత కలిగిరి మండలంలోని గంగిరెడ్డిపాలెం, తెల్లపాడు గ్రామాల్లో దెబ్బతిన్న వినుము పంటను బృంద సభ్యులు పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయాల్లో రైతులతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను రైతులు కేంద్ర బృందం దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి ఏడాది విత్తనాల కోసం పడుతున్న ఇబ్బందులు, నాసిరకం విత్తనాలతో నష్టపోయిన వైనాన్ని వివరించారు. గంగిరెడ్డిపాలెం పంచాయతీలో భూగర్భ జలం అడుగంటడంతో బోర్లు ఎండిపోయాయని పేర్కొన్నారు. తెల్లపాడు పంచాయతీలోని రైతులు తమకు ఉపాధి పనులు కల్పించాలని కోరారు. అలాగే, పంట నష్ట పరిహారం పూర్తిస్థాయిలో అందలేదని, రికార్డులు పరిశీలించాలని కోరారు. మెట్ట పైర్లే తమకు ఆధారమని, కరువు ప్రభావంతో తీవ్రంగా నష్టపోయాయని, తాము పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకోవాలని కోరారు. రైతుల అభిప్రాయాలను సావధానంగా విన్న బృందం సభ్యులు పూర్తినివేదికను కేంద్రానికి అందజేసి ఆదుకుంటామని పేర్కొన్నారు. కొండాపురం మండలంలోని గొట్టిగుండాల గ్రామంలో దెబ్బతిన్న దాదాపు 80 ఎకరాల్లోని మినుము, మిరప పంటలను పరిశీలించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాగా, నెల్లూరు కలెక్టరేట్‌లో జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ హరినారాయణన్ కరువు బృందానికి వివరించారు. పంటలు, పశుసంపదను కోల్పోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

మండిన కోస్తా

- ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- జంగమహేశ్వరపురంలో 39 డిగ్రీల ఉష్ణోగ్రత
- విశాఖలో 38.4, నెల్లూరులో 38.1, బాపట్లలో 38
- నేడు వర్షాలు.. తీరంలో బలమైన గాలులు

విశాఖపట్నం, అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు బలహీనంగా ఉండడంతో కోస్తాలో ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. పడమర నుంచి పొడిగాలులు, సముద్రం నుంచి తేమగాలులు వీస్తుండడంతో ఉక్కపోత తోడైంది. మధ్యాహ్న సమయంలో ప్రజలు భరించలేనంత వేడి వాతావరణం నెలకొంటోంది. తొలకరి పనులు చేసుకునే రైతులు ఎండ తీవ్రతకు ఇబ్బంది పడుతున్నారు. వేడిగాలులకు ఆరుబయట పనులుచేసే వారు సొమ్మసిల్లుతున్నారు. బుధవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. జంగమహేశ్వరపురంలో అత్యధికంగా 39 డిగ్రీలు, విశాఖ ఎయిర్‌పోర్టులో 38.4, నెల్లూరులో 38.1, కావలి, బాపట్లలో 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా తెలంగాణ, కోస్తా పరిసరాల్లో ఆవరించిన ఉపరితల ఆవర్తనంతో బుధవారం పలుచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని, కోస్తా తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరించింది. అలాగే, రాష్ట్రంలో రానున్న 48గంటల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కోస్తాంధ్ర నుంచి తెలంగాణ మీదుగా ఉన్న ఆవర్తనం, తెలంగాణ నుంచి బంగాళాఖాతం వరకు కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు పడతాయని తెలిపింది. గురువారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, నెల్లూరు, కడప, అన్నమయ్య తిరుపతి జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

గోవుల అప్పగింతపై వివరాలు సమర్పించండి

- ఇచ్చే ముందు కనీసం ఆధారాలు తీసుకోరా?: హైకోర్టు
- బక్రీద్ నేపథ్యంలో వధించేందుకు 195 ఆవులు, ఎద్దులు
- ఆధీనంలోకి తీసుకున్న విజయవాడ భవానీపురం పోలీసులు
- తానే యజమానిని అంటూ వచ్చిన వ్యక్తికి అప్పగింత
- నిర్ధారించుకోకుండానే అప్పగించిన ఖాకీలు
- ఈ చర్యను నిరసిస్తూ హైకోర్టులో పిటిషన్
- పోలీసుల తీరును తప్పుపట్టిన ధర్మాసనం, విచారణ నేటికి వాయిదా



అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ సందర్భంగా వధించేందుకు తెచ్చిన 195 ఆవులు, ఎద్దులు, దూడలను ఎలాంటి వివరాలు తీసుకోకుండా, వాటికి యజమానిని తానే అని చెప్పిన ఓ వ్యక్తికి, విజయవాడ భవానీపురం పోలీసులు అప్పగించడాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ఆ వ్యక్తికి సంబంధించిన కనీస వివరాలు తీసుకోకుండా గోవులను ఎలా అప్పగిస్తారని ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలను కోర్టు ముందు ఉంచాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించింది. విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. బక్రీద్ సందర్భంగా వధించేందుకు తెచ్చిన 195 ఆవులు, ఎద్దులు, దూడలను విజయవాడ భవానీపురం పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. బక్రీద్ ముగిసిన తరువాత ఆ పశువులను వాటి యజమానిని అంటూ వచ్చిన ఓ వ్యక్తికి పోలీసులకు అప్పగించారు. అప్పగించే సమయంలో పోలీసులు ఆ వ్యక్తికి సంబంధించిన ఎలాంటి వివరాలను తీసుకోలేదు. ఈ నేపథ్యంలో పోలీసుల చర్యలను సవాల్ చేస్తూ విజయవాడకు చెందిన సూరాబత్తుల గోపాలరావు, తోట సురేష్‌బాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పశువులను పోలీసులు తమ ఆధీనంలో ఉంచుకునే సమయంలో నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించలేదని, జంతు హింస నిరోధక చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించారని వారు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ధర్మాసనం బుధవారం విచారణ జరిపి పోలీసుల తీరును తప్పుపట్టింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలు సమర్పించాలని ఆదేశించింది.

ఫలించిన పదకొండేళ్ల నిరీక్షణ

- 2013లో అరెస్టైన బంగ్లా దేశీయుడు బిశ్వాస్
- వివరాలు లేక శిక్ష పూరైనా ఇప్పటికీ పోలీస్ స్టేషన్‌లోనే
- సోషల్‌మీడియాలో పోస్ట్ చేసిన నాగాయలంక ఎస్సై
- గుర్తించి, హర్షం వ్యక్తం చేసిన బంధువులు



బంగ్లా దేశస్థుడితో నాగాయలంక పోలీసులు

నాగాయలంక, జూన్ 19: పదకొండేళ్ల క్రితం తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ తెలిసి బంధువుల ఆనందానికి హద్దులు లేవు. ఎల్లలు దాటి దేశం కాని దేశంలో బతుకుతున్నట్టు సోషల్ మీడియా ద్వారా తెలుసుకుని హర్షం వ్యక్తంచేశారు. అందుకు కారణమైన కృష్ణా జిల్లా నాగాయలంక ఎస్సై సుబ్రహ్మణ్యానికి కృతజ్ఞతలు తెలిపారు. నాగాయలంక మండల పరిధిలోని నాచుగుంట గ్రామంలో 2013లో బంగ్లాదేశ్‌కు చెందిన బిశ్వాస్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు విదేశీ చట్టం 1946 ప్రకారం అరెస్టు చేశారు. మత్స్యకారుడైన బిశ్వాస్ సముద్రంలో ఈదుకుంటూ పొరపాటున ఇక్కడికి వచ్చాడని భావించి అవనిగడ్డ కోర్టులో హాజరుపర్చగా, రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. 2015లో విడుదలైనా అతని బంధువులు ఎవరో తెలియకపోవటంతో నాగాయలంక పోలీసుల రక్షణలోనే ఉంచారు. అప్పటి నుంచి బిశ్వాస్ పోలీస్‌స్టేషన్‌లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో నాగాయలంకకు ఎస్ఐగా వచ్చిన సుబ్రహ్మణ్యం సోషల్ మీడియాలో బిశ్వాస్ ఫొటోలు పెట్టి, తమ వద్ద సురక్షితంగా ఉన్నాడని పోస్ట్‌చేశారు. అతనికి సంబంధించిన వారు స్పందించాలని కోరారు. ఈ పోస్ట్ చూసి అతని బంధువులు సంతోషించారని, బిశ్వాస్ కోసం 10 సంవత్సరాల నుంచి అన్వేషిస్తున్నట్టు సమాచారం ఇచ్చారని ఎస్ఐ బుధవారం తెలిపారు.

జగన్‌పై భయంతోనే నాకు ఓటు వేయలేదు

● ప్రజలు బలంగా మార్పును కోరుకున్నారు: షర్మిల



అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికలు జగన్‌కు వ్యతిరేకంగా జరిగాయని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం విజయవాడ ఆంధ్ర రత్న భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. 'కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి భయపడే నాకు ఓటు వేయలేదు. అందుకే ఓటమిపాలయ్యా. రాష్ట్రంలో జరిగిన ఎన్నికలు చాలా విచిత్రం. ఊహించని ఫలితాలు వచ్చాయి. మార్పు కావాలని ప్రజలు బలంగా నిర్ణయించుకున్నారు. ఈసారి ప్రజలు తమ ఓటుకు న్యాయం జరగాలని కోరుకున్నారు. ఒక్క ఓటు కూడా వృథా కావొద్దని ప్రజలు కోరుకున్నారు. అందుకే ఈసారి కాంగ్రెస్‌కు తగినన్ని ఓట్లు రాలేదు' అని షర్మిల అన్నారు. రాహుల్ గాంధీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ఆమె... రాహుల్‌ను ఫైటర్‌గా అభివర్ణించారు. ఎన్నికల్లో విజయం సాధించిన చంద్రబాబుకు షర్మిల శుభాకాంక్షలు తెలిపారు.

పోలవరం బాధ్యత కేంద్రానిదే

● నిర్వాసితుల పునరావాస ప్యాకేజీ 33,000 కోట్ల కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచండి

● సీఎం చంద్రబాబుకు సీపీఐ రామకృష్ణ లేఖ

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన నిర్వాసితుల పునరావాస ప్యాకేజీకి సంబంధించిన రూ.33 వేల కోట్ల నిధులు వెంటనే విడుదల చేసేలా కేంద్రంపై ఒత్తిడి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రాజెక్టు నిర్మాణ కాలంలోనే నిర్వాసితులకు పునరావాసం కల్పించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందించాలని పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు బుధవారం ఆయన లేఖ రాశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనతికాలంలోనే పోలవరం ప్రాజెక్టును సందర్శించి, అక్కడ చోటుచేసుకున్న లోపాలపై మాట్లాడటం అభినందనీయమని రామకృష్ణ ప్రశంసించారు.

నేడు బీజేపీ ప్రజాప్రతినిధులకు అభినందన సభ

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన బీజేపీ ప్రజాప్రతినిధులకు గురువారం అభినందన సభ ఏర్పాటు చేశారు. విజయవాడలోని వెన్యూ కన్వెన్షన్‌లో సాయంత్రం 5 గంటలకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బీజేపీకి చెందిన ముగ్గురు ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలను ఘనంగా సత్కరించనున్నారు. నరసాపురం నుంచి గెలుపొంది కేంద్ర మంత్రిగా ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన భూపతిరాజు శ్రీనివాసవర్మకు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికి.. అక్కడి నుంచి అభినందన సభావేదిక వరకు భారీ ర్యాలీ నిర్వహించేందుకు బీజేపీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జగన్ పాలనలో ఆర్థిక విధ్వంసం: లంకా దినకర్

న్యూఢిల్లీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల జగన్ పాలనలో ఏపీలో ఆర్థిక విధ్వంసం జరిగిందని లంకా దినకర్ తెలిపారు. బుధవారం ఢిల్లీలో ఏపీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'జగన్ పాలనలో రాష్ట్రం తేరుకోలేనంతగా ఆర్థిక విధ్వంసానికి గురైంది. అప్పుల్లో ప్రథమం, ఆస్తుల కల్పనలో అధమం, ఆదాయ సృష్టిలో శూన్యం అనే విధంగా జగన్ రాష్ట్రాన్ని తయారు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఆర్బీఎం పరిధిలో చేసిన అప్పులు రూ.5.50 లక్షల కోట్లు దాటాయి. మిగతా అప్పులు, రుణాలు కలిపి మరో రూ.7.50 లక్షల కోట్ల వరకూ ఉండే అవకాశం ఉంది. ఏపీ మొత్తం అప్పులు రూ.13 లక్షల కోట్లు ఉండొచ్చు. గత ప్రభుత్వంలో ఆర్థిక విధ్వంసాలకి చేయూతనిచ్చిన అధికారులను బదిలీపై బయటికి పంపకూడదు. రాష్ట్రంలో ఏ విధంగా ఆర్థిక నిర్వహణ జరిగిందో ఏ ఏ పద్దులు, ఏ ఏ ఖాతాలకు ఎలా మళ్లించారో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది' అని దినకర్ అన్నారు. ఏపీ బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్ నాయుడు మాట్లాడుతూ, జగన్ విలాసవంతంగా కట్టుకున్నది ప్రజా ప్యాలెస్ కాదని, పబ్లీ ప్యాలెస్ అని విమర్శించారు. దీనిపై కొత్త ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

కార్పొరేషన్లలో జగన్ సైన్యం!

(మొదటి పేజీ తరువాయి)

సిఫారసు చేస్తే చాలు.. అర్హతలతో నిమిత్తం లేకుండా భారీ జీతాలతో ఉద్యోగాలు ఇచ్చేశారు. వైసీపీ సామాజిక మాధ్యమ కార్యకర్తలు, సొంత మీడియా ఉద్యోగులు రాచమర్యాదలు అందుకున్నారు. డిజిటల్ కార్పొరేషన్, గ్రీన్ కార్పొరేషన్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్, ఈ-ప్రగతి, రియల్ టైమ్ గుడ్ గవర్నెన్స్ సర్వీస్, ఏపీఎండీసీలలో వైసీపీ కార్యకర్తలను అధిక జీతాలకు నియమించారు. ఇవి చాలవన్నట్లు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామంటూ ఆప్‌కోస్ పేరిట ఒక కార్పొరేషన్‌ను జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కార్పొరేషన్‌కు సీఎంవో కేంద్రంగా సిఫారసులు నడిచాయి.

కార్పొరేషన్ల కార్యాలయాలకు తాళం

కార్పొరేషన్లలో వైసీపీ కార్యకర్తలు, సొంత మీడియా సంస్థల ప్రతినిధులకు పెద్దఎత్తున ఉపాధి కల్పించి, వారందరికీ ప్రతినెలా రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని జీత భత్యాలుగా చెల్లిస్తున్న భారీ కుంభకోణం తాజాగా బయటపడింది. ఆ ఉద్యోగులను పార్టీ కార్యక్రమాలకు జగన్ వినియోగించుకున్న వైనం వెలుగుచూడటంతో నిరుద్యోగ యువతలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. జగన్ కోసం పనిచేస్తున్నందుకు సంవత్సరాల తరబడి విధులకు రాకుండానే రూ.లక్షల్లో జీతభత్యాలను తీసుకుంటున్నట్లు బయటపడటంతో రాష్ట్ర ప్రజలు నివ్వెరబోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటినుంచి కార్పొరేషన్ల కార్యకలాపాలు నిలిచిపోయాయి. కార్పొరేషన్ల కార్యాలయాలకు తాళాలు వేసి, ఒక్క కాగితమూ బయటకు రాకుండా పోలీసులు సీలు వేశారు. ఉద్యోగుల అక్రమ నియామకాలు, అడ్డగోలు చెల్లింపులపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి నివేదికలను ఇప్పటికే సిద్ధం చేయడంతో పాటు త్వరలోనే కార్యాచరణను అమలు చేసేందుకు సన్నద్ధమవుతోంది. తక్షణమే జగన్ సైన్యాన్ని తొలగించి ఇంటికి పంపకుంటే .. కూటమి ప్రభుత్వ మనుగడకే ముప్పు వాటిల్లుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇంధనశాఖలో జగన్ సైన్యాధ్యక్షులు

రాష్ట్ర ఇంధన సంస్థల్లో జగన్ సైన్యాధ్యక్షులు ఇంకా కీలక పదవుల్లోనే కొనసాగుతున్నారు. రూ.లక్షలు జీతభత్యాలు తీసుకుంటూ, సకల సౌకర్యాలు అనుభవిస్తూ పెత్తనం చెలాయిస్తున్నారు. ఏపీ జెన్కోలో కోల్ విభాగం డైరెక్టర్‌గా నాలుగేళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఆంథోనిరాజ్‌కు జగన్ తల్లి విజయలక్ష్మి సిఫారసు చేశారని విద్యుత్సౌధ వర్గాలు చెబుతున్నాయి. కాలపరిమితి ముగిసిన ఆయన్ను విధుల నుంచి తప్పించాల్సి ఉండగా, మరో ఆరునెలల పాటు ఓఎస్డీగా కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా ఎన్టీపీసీ నుంచి వచ్చిన థర్మల్ డైరెక్టర్ బాబ్జీకి మాజీ మంత్రి ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్(నాని) సిఫారసు చేశారని పేర్కొంటున్నారు. ప్రభుత్వం మారినా ఆయన ఇంకా కొనసాగుతున్నారు. జెన్కో కోల్ విభాగం ఓఎస్డీగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సన్నిహితుడు రఘునాథరెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. ట్రాన్స్‌కో ఫైనాన్స్ డైరెక్టర్ వీరభద్రారెడ్డి కెనరా బ్యాంకులో జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేశారు. పెద్దిరెడ్డి సిఫారసుతో వీరభద్రారెడ్డిని ట్రాన్స్‌కో ఫైనాన్స్ డైరెక్టర్‌గా నియమించారని విద్యుత్సౌధ వర్గాలు వెల్లడిస్తున్నాయి. హైడల్ డైరెక్టర్‌గా ఎంవీవీ సత్యనారాయణ, హ్యూమన్ రీసోర్స్ డైరెక్టర్‌గా రఫీ, కోల్ విభాగం ఓఎస్డీగా సత్యనారాయణ విధులు నిర్వహిస్తున్నారు.

డిస్కమ్‌లలో సొంత మనుషుల హవా

విద్యుత్తు పంపిణీ సంస్థలకు గతంలో సీనియర్ ఐఏఎస్ అధికారులు సీఎండీలుగా బాధ్యతలు నిర్వహించేవారు. కానీ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విధానానికి స్వస్తి పలికారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆయన బంధువు శివప్రసాదరెడ్డిని ఎస్పీడీసీఎల్ సీఎండీగా నియమించారు. ఆయన కాలపరిమితి ముగిశాక .. షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ విశ్వేశ్వరరెడ్డి బంధువు పద్మాజనార్దనరెడ్డికి ఆ పోస్టు కట్టబెట్టారు. ఈపీడీసీఎల్ సీఎండీగా సంతోష్‌రావును నియమించారు. ఒకసారి రెన్యువల్ అనంతరం ఆయన స్థానంలో ఐఏఎస్ అధికారి పృథ్వీతేజ్‌ను తీసుకున్నారు. అంతలోనే సీపీడీసీఎల్ సీఎండీగా పద్మాజనార్దనరెడ్డిని, ఎస్పీడీసీఎల్ సీఎండీగా సంతోష్‌రావును నియమించారు. ఏటా వేలాది కోట్ల టర్నోవర్ కలిగిన డిస్కమ్‌లకు సొంత మనుషులను నియమించుకున్న జగన్ వారిని సర్వసైన్యాధ్యక్షులుగా కొనసాగించారు. అవసరం లేకున్నా షిర్డీసాయి నుంచి ట్రాన్స్‌ఫార్మర్లను పద్మాజనార్దనరెడ్డి, సంతోష్‌రావు అధిక ధరలకు కొనుగోలు చేశారంటూ ఆరోపణలు వచ్చాయి. తెలంగాణ కంటే రెట్టింపు ధరకు వీటిని కొనుగోలు చేయడంపై దర్యాప్తు నిర్వహించాలన్న డిమాండ్ వినిపించింది. ఇదే సమయంలో గృహాలకు, వ్యవసాయానికి విద్యుత్తు మీటర్లు బిగించేందుకు పిలిచిన టెండర్లపైనా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అదానీ, షిర్డీసాయి సంస్థలకు విద్యుత్తు మీటర్ల కొనుగోలు ఆర్డర్లు ఇవ్వడంలో మతలబు జరిగిందన్న ఆరోపణలొచ్చాయి. ఉద్యోగుల నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత రావడంతో పద్మాజనార్దనరెడ్డిని తప్పించారు. దీంతో ఎస్పీడీసీఎల్‌తో పాటు సీపీడీసీఎల్ బాధ్యతలను కూడా సంతోష్‌రావు నిర్వహిస్తున్నారు. ఈపీడీసీఎల్ డైరెక్టర్‌గా మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం బంధువు సూర్యప్రతాప్ బాధ్యతల్లో ఉన్నారు. మరోవైపు రాష్ట్ర సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా జగన్ సీఎంవో ముఖ్యకార్యదర్శిగా పనిచేసిన ధనుంజయరెడ్డి బంధువు మురళీకృష్ణరెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే తమకు ఎలాంటి బంధుత్వం లేదని ఆయన చెప్పుకుంటున్నారు. వాస్తవంగా ఆయన హోదా అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు(ఏడీఈ) కానీ ఆయనకు చీఫ్ ఇంజనీరు హోదాలో సీవోవోగా బాధ్యతలు అప్పగించారు. జీతభత్యాలు ఏడీఈ స్థాయిలోనే ఇస్తున్నా సీవోవో స్థాయిలో అధికారాలు కల్పించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ కూడా మురళీకృష్ణారెడ్డికి సీవోవో బాధ్యతలు అప్పగించడంపై అభ్యంతరం తెలిపినట్లు విద్యుత్తు సౌధ వర్గాలు పేర్కొంటున్నాయి.

డిస్టిలరీ యాజమాన్యాల్లో కలకలం

హైదరాబాద్‌లో అసోసియేషన్ సమావేశం

● వైసీపీ హయాంలో తమకు ఆర్డర్లు దక్కని ఏడు కంపెనీల యాజమాన్యాలు దూరం

● కమీషన్లు వసూలు చేసిన ఇద్దరికి గుండెల్లో రైళ్లు

● సీఐడీ కేసు నేపథ్యంలో తమనితాము రక్షించుకునే యత్నాలు

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణం వెలుగులోకి రావడంతో డిస్టిలరీల యాజమాన్యాల్లో కలకలం మొదలైంది. గత ప్రభుత్వంలో కొన్ని డిస్టిలరీల ప్రతినిధులు వసూళ్ల వ్యవహారంలో భాగస్వాములయ్యారు. దీంతో ఇప్పుడు ఇది ఎవరికి చుట్టుకుంటుందోనని బెంబేలెత్తుతున్నారు. దీంతో హడావిడిగా హైదరాబాద్‌లో డిస్టిలరీల అసోసియేషన్ పేరుతో వారం రోజుల కిందట సమావేశం నిర్వహించారు. ఎప్పుడో రిజిస్ట్రేషన్ చేసుకున్న ఈ అసోసియేషన్ చాలాకాలం నుంచి నిర్లిప్తంగా ఉంది. ఇప్పుడు సీఐడీ విచారణ నేపథ్యంలో అసోసియేషన్‌ను మళ్లీ క్రియాశీలకం చేసి, తమను తాము రక్షించుకోవాలని కొందరు భావిస్తున్నారు. ఈ సమావేశానికి ఏడు డిస్టిలరీల యాజమాన్యాలు గైర్హాజరయ్యాయి. 'వైసీపీ ప్రభుత్వం హయాంలో మాకు మద్యం ఆర్డర్లు ఇవ్వలేదు. అలాంటప్పుడు ఈ అసోసియేషన్లతో మాకు ఏం అవసరం ఉంది? వైసీపీ ప్రభుత్వంతో అంటకాగిన వారిపై ఏవైనా చర్యలు తీసుకున్నా మాకు సంబంధం లేదు' అంటూ ఆ ఏడు డిస్టిలరీలు తెగేసి చెప్పాయి. ఈ సమావేశం ఏర్పాటు చేసిన వారిలో ఇద్దరు గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించారు. ఒకరు వైసీపీ తరఫున కమీషన్ వసూలులో కీలకంగా ఉన్నారు. మరొకరు మద్యం ఉత్పత్తికి ఉపయోగించే ఈఎన్ఏ సరఫరాలో లీటరుకు రూపాయి చొప్పున ముడుపులు వసూలు చేసిన వారిలో ఉన్నారు. రాష్ట్రంలో అయితే రూపాయి, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తే లీటరు రూ.రెండు చొప్పున వసూలు చేసి పార్టీ నేతలు, అధికారులకు ఇచ్చారు. కొత్తగా ఎవరైనా మద్యం వ్యాపారం చేయాలని ఎక్సైజ్ శాఖను సంప్రదించినా వారి వద్దకే వెళ్లమనే స్థాయిలో చక్రం తిప్పారు. దీంతో ఇప్పుడు విచారణలో వీరూ ఉండొచ్చన్న ప్రచారం జరుగుతోంది. కాగా కమీషన్లు ఇచ్చిన మద్యం కంపెనీలకు కూడా ఇబ్బందులు తలెత్తే పరిస్థితి కనిపిస్తోంది. ఎందుకంటే వైసీపీ పెద్దలకు కమీషన్లు ఇవ్వడం కోసం ఆయా కంపెనీలకు ఇచ్చే ధరలను ఏపీ ప్రభుత్వం పెంచింది. ఒకే బ్రాండ్‌కు పక్క రాష్ట్రాల ప్రభుత్వాలు తక్కువ ధర చెల్లిస్తే, ఏపీ ప్రభుత్వం ఎక్కువ చెల్లించింది. అయితే దీనిని సాంకేతికంగా అధిగమించేందుకు ఆయా కంపెనీలు బ్రాండ్ల పేర్లలో స్వల్ప మార్పులు చేసి వాటిని ఏపీ ప్రభుత్వానికి ఇచ్చినట్లు అధికారులు భావిస్తున్నారు. ఉదాహరణకు ఒక పాపులర్ బ్రాండ్ పేరు అందరికీ తెలిసినా దానికి చివర్లో ప్రీమియం, డీలక్స్ లాంటి పేర్లను కనిపించీ కనిపించకుండా చేర్చి వాటిని కొత్త బ్రాండ్లుగా చూపే ప్రయత్నం చేశారు. ఇవన్నీ ఇప్పుడు విచారణలో బయటపడే సమయం రావడంతో డిస్టిలరీలు, కంపెనీల యాజమాన్యాల్లో ఆందోళన పెరిగింది.

జగన్ నిర్లక్ష్యం వల్లే పోలవరం పూర్తికాలేదు

● యుద్ధప్రాతిపదికన పూర్తిచేసే బాధ్యత ఎన్డీయే ప్రభుత్వానిదే

● విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ ఇప్పట్లో జరగదు

● కావాలనే దీనిపై రాద్ధాంతం: కిషన్‌రెడ్డి

● 'ఆంధ్రజ్యోతి'కి కేంద్ర మంత్రి ఇంటర్వ్యూ



న్యూఢిల్లీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్లక్ష్యం వల్లే పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం జరిగిందని కేంద్ర బొగ్గు గనుల మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. దానిని యుద్ధ ప్రాతిపదిక పూర్తిచేసే బాధ్యత ఎన్డీయే ప్రభుత్వానిదని భరోసా ఇచ్చారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ ఇప్పట్లో జరగదన్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బుధవారం తొలిసారిగా ఢిల్లీలోని తన కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'కి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. విశాఖ ఉక్కు రేపో ఎల్లుండో ప్రైవేటుపరం అవుతుందనేది అసత్య ప్రచారమేనని.. కొందరు కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేటీకరణకు సంబంధించిన ఫైలే ఇంకా ముందుకు కదల్లేదన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి క్యాప్టివ్ మైన్స్ అవసరమని, దీని గురించి చర్చించి సరైన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సింగరేణి ప్రైవేటీకరణ అనేది కూడా పచ్చి అబద్ధమన్నారు. ఇదంతా కేసీఆర్ ఆడిన నాటకమని ఆరోపించారు. గత పదేళ్లలో దేశంలో ఒక్క బొగ్గు గనినైనా ప్రైవేటీకరించామా అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎన్నికల్లో అద్భుతమైన తీర్పు ఇచ్చారని, వారి నమ్మకాన్ని చంద్రబాబు ప్రభుత్వం నిలబెడుతుందని చెప్పారు.



మాట్లాడుతున్న చలసాని ఆంజనేయులు, చిత్రంలో చలమలశెట్టి, చింతల

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం

● కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 19: పోటీ ప్రపంచంలో రాణించి ఉజ్వల భవిష్యత్తు సాధించాలంటే విద్యార్థి దశ నుంచి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ బాగా చదువుకోవాలని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు సూచించారు. కానుమోలు హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన విద్యా కానుక కిట్ల పంపిణీలో ఎంఈవో బి.సురేష్‌కుమార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. పూర్వ విద్యార్థిగా హైస్కూల్ అభివృద్ధి తన వంతు సహకారమందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధమని ఆంజనేయులు హామీ ఇచ్చారు. ఆటలపోటీల్లో కానుమోలు ప్రతిభ జిల్లావ్యాప్తంగా ఉండేదని, ఆటల పోటీలకు అవసరమైన సహకారాన్ని తన వంతుగా అందిస్తానని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు హామీ ఇచ్చారు. ప్రకృతి వారోత్సవాల సందర్భంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. జెడ్పీటీసీ సభ్యురాలు గంగాభవాని, మాజీ సర్పంచ్ చింతల వెంకటశివఅప్పారావు, పూర్వ విదార్థుల సంఘ నేత దన్నే దుర్గారావు, మాజీ జెడ్పీటీసీ సుంకర సుభాస్‌చంద్రబోస్, చెడుగొండి శివశంకర్, గరికపాటి ఉమ, చింతల కృష్ణ, చిన్నాల గణేష్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీటీసీ ప్రసాదరావు

నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం

● డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ప్రసాదరావు

మొగల్రాజపురం, జూన్ 19: వాహన చోదకులు, పాదచారులు నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు చాలా వరకు తగ్గుతాయని డిప్యూటీ ట్రాన్సుపోర్టు కమిషనర్ ఎస్ఏవీ ప్రసాదరావు అన్నారు. ది కృష్ణా డిస్ట్రిక్ ఆటో ఫైనాన్సియర్స్ అసోసియేషన్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా సున్నబట్టీల సెంటర్‌లోని అమ్మ కల్యాణమండపంలో రహదారి భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏటా రోడ్డు ప్రమాదాల ద్వారా 8వేల మంది మరణిస్తున్నారన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న నిర్లక్ష్య ధోరణి మారడం లేదన్నారు. డ్రైవింగ్ లైసెన్సు జారీలో ఖచ్చితంగా వ్యవహరిస్తున్నామన్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఫైనాన్స్ కంపెనీలతో నగరాల్లో వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలకు వాహనాలిచ్చే తల్లిదండ్రులు ప్రమాదాలు జరిగాక బాధపడుతున్నారన్నారు. ది కృష్ణా డిస్ట్రిక్ ఆటో ఫైనాన్సియర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ సంఘం చేపట్టిన సేవాకార్యక్రమాలను వివరించారు. ఈ నెల 22న స్వర్ణోత్సవ వేడుకల ముగింపు నిర్వహిస్తున్నామన్నారు. ఏపీ లారీ యజమానుల సంఘం ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు, స్వర్ణోత్సవ వేడుకల కమిటీ చైర్మన్ వీజీకే ప్రసాద్, ఫెడరేషన్ ఆఫ్ ఫైనాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి చర్యలు

● క్రీడాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి



ఇందిరాగాంధీ స్టేడియంలో చర్చిస్తున్న రవాణా, క్రీడాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి

విజయవాడ స్పోర్ట్సు, జూన్ 19: గ్రామస్థాయి క్రీడల అభ్యున్నతికి ముందుకు సాగుదామని, తన పదవీకాలంలో నిధుల సాధనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని రాష్ట్ర క్రీడలు, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి భరోసా ఇచ్చారు. క్రీడా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన శాప్ కార్యాలయాన్ని తొలుత బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశాఖ ప్రధాన కార్యదర్శి, వీసీఎండీ పీఎస్ ప్రద్యుమ్న పుష్పగుచ్ఛంను మంత్రికిచ్చి ఘన స్వాగతం పలికారు. శాప్ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులను పరిచయం చేసుకుని కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం ఐజీఎంసీ స్టేడియాన్ని సందర్శించి గ్రౌండ్ ఇలా ఉందేమిటని అధికారులను ప్రశ్నించారు. ఇది మనదా? వీఎంసీదా అని అడగ్గా, అధికారులు కార్పొరేషన్‌కు చెందిందని, ప్రతి ప్రభుత్వ కార్యక్రమం గ్రౌండ్‌లోనే చేయడం వల్ల ఇలా ఉంటుందని వివరించారు. శాప్ పరిపాలన భవనాలను శాఖ ఆధ్వర్యంలో నిర్మించుకున్నామన్నారు. నిధులకు గ్రామస్థాయి క్రీడలపై అవేర్‌నెస్ తీసుకురావాలని, టోర్నీలకు స్పాన్సర్లకు తీసుకురావడానికి కృషి చేస్తానని మంత్రి అన్నారు. ఆయన వెంట శాప్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట రమణ, స్పోర్ట్సు ఆఫీసర్ కాకర్ల కోటేశ్వరరావు, ఇతర అధికారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు కార్యాచరణ

● మంత్రి నిమ్మల రామానాయుడు హామీ



హనుమాన్‌జంక్షన్ రూరల్, జూన్ 19: రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగించేలా రైతు సంఘాలు, సాగునీటి సంఘాలతో అధికారులు సమన్వయం చేసుకుని ముందుకు సాగేలా కార్యాచరణ రూపొందిస్తామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చినట్టు ఆళ్ల గోపాలకృష్ణ తెలిపారు. మంత్రి రామానాయుడును ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం రైతుసంఘాల నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. పోలవరం ప్రాజెక్ట్ త్వరగా పూర్తి చేయాలనే సీఎం చంద్రబాబు సంకల్పం కోసం కృషిచేసే డాక్టర్ నిమ్మల రామానాయుడు జలవనరులశాఖ మంత్రిగా రావడం ఆనందంగా ఉందన్నారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికలు, తదితర సమస్యల గురించి, సాగునీటి కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. గతంలో మాదిరిగానే వర్షపునీటిని వడిసిపట్టే పథకాలతో పాటు సాగునీటి సమస్యలపై ప్రత్యేకదృష్టి పెట్టి సమస్యలను త్వరగా పరిష్కరించేలా కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్టు నేతలు తెలిపారు. గోదావరి పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ పొత్తూరు రామాంజనేయరాజు, తెలుగురైతు నేతలు వేములపల్లి శ్రీనివాసరావు, గుండపనేని ఉమావరప్రసాద్ పాల్గొన్నారు.

మల్లవల్లి రైతులపై పెట్టిన అక్రమకేసులు ఎత్తివేయండి

● హోంమంత్రికి జనసేన నేత మరీదు వినతి



హనుమాన్‌జంక్షన్ రూరల్, జూన్ 19: రాష్ట్ర ప్రయోజనాల నిమిత్తం మల్లవల్లి పారిశ్రామికవాడ అభివృద్ధికి భూములిచ్చిన రైతుల నష్టపరిహారం కోసం నిరసన తెలిపితే వారిపై లాఠీచార్జ్ చేయడంతో పాటు మహిళలని కూడా చూడకుండా అక్రమ అరెస్టులు చేసిన పోలీసులపై తగుచర్యలు తీసుకోవాలని హోంమంత్రి వంగలపూడి అనితకు జనసేన కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు రామకృష్ణ విన్నవించారు. ఈమేరకు అమరావతిలోని సచివాలయంలో బుధవారం హోంమంత్రి అనితను కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులపై అక్రమ కేసులు పెట్టడంతో పాటు 14 రోజులపాటు రిమాండ్ చేశారన్న విషయాన్ని హోంమంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్టు రామకృష్ణ తెలిపారు. ఈ సమస్యపై సమగ్ర విచారణ జరిపి ఘటనకు బాధ్యులైన సీఐ, ఎస్సై సహా రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరినట్టు వివరించారు. ఆధారాలతో పూర్తి వివరాలు అందజేయాలని ఆమె సూచించారని, విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవడంతో పాటు రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హోంమంత్రి అనిత హామీ ఇచ్చినట్టు శివరామకృష్ణ తెలిపారు.

ఉపాధ్యాయులను ప్రోత్సహించటం అభినందనీయం: డీఈవో

గన్నవరం, జూన్ 19: ప్రభుత్వపాఠశాలల్లో టెన్త్ ఉత్తీర్ణతను పెంపొందించేందుకు ఉపాధ్యాయులను ప్రోత్సహించటం అభినందనీయమని డీఈవో తాహెర సుల్తానా అన్నారు. స్థానిక కొత్తపేటలోని రోటరి ఆడిటోరియంలో 2023-24లో టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేసిన పాఠశాలల ఉపాధ్యాయులను పుణ్య చారిటీస్ సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో బుధవారం పౌరసత్కారం చేశారు. పది ఫలితాల్లో మండలంలోని మొదటి స్థానంలో నిలిచిన గన్నవరం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం డీ.ఝాన్సీ రాణి, ఉపాధ్యాయులకు రోలింగ్ షీల్డ్ అందజేశారు. ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ముస్తాబాద, ఆత్కూరు జడ్పీహైస్కూల్ ఉపాధ్యాయ బృందాన్ని, నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన వీరపనేనిగూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.యశోద లక్ష్మిని సన్మానించారు. సభకు రోటరీ అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఉత్తమ సేవ పురస్కారాన్ని కేసరపల్లి పంచాయతీ పారిశుధ్య కార్మికురాలు షమీరాకు రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పార్థసారథి అందజేశారు. ఎంఈవో కొండా రవికుమార్, రోటరీ క్లబ్ కార్యదర్శి నర్రా సీతారామారావు, రోటరియన్‌లు గన్నె వెంకట్రావు, చింతపల్లి సీతారామయ్య, టీఎస్ఆర్‌కే ప్రసాద్, జీవీ రవిబాబు, జగదీశ్వరరావు పాల్గొన్నారు.

జెస్సి రాజ్‌కు ప్రభుత్వ ప్రోత్సాహం: మంత్రి లోకేశ్

అమరావతి: ప్రపంచ ఓషియానిక్ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో ఇన్ స్కేటింగ్ విభాగంలో బంగారు పతకాన్ని సాధించిన ఎం జెస్సి రాజ్‌కు రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ అభినందనలు తెలిపారు. బుధవారం ఓ ప్రకటన చేస్తూ 'న్యూజిలాండ్‌లో ఇటీవల జరిగిన ప్రపంచ ఓషియానిక్ రోలర్‌స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జెస్సిరాజ్ భారత్‌కు ప్రాతినిధ్యం వహించి, అత్యున్నత ప్రదర్శన ద్వారా అంతర్జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం హర్షణీయం. విజయవాడకు చెందిన బాలిక ప్రపంచస్థాయిలో భారత కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేయడం గర్వంగా ఉంది. జెస్సి రాజ్ లాంటి ప్రతిభ గల క్రీడాకారిణిలకు మా ప్రభుత్వం సహకారాలు అందించి, ప్రోత్సహిస్తుంది' అని బుధవారం ఓప్రకటనలో మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

సమాజ శ్రేయస్సు కోసం తపించిన రామోజీరావు

● సంస్మరణ సభలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

గవర్నర్‌పేట: సమాజ శ్రేయస్సు కోసం నిత్యం తపించిన మహోన్నత వ్యక్తి రామోజీరావు అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ ఫోరం, పోలవరపు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో బుధవారం అక్షరయోధుడు, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత చెరుకూరి రామోజీరావు సంస్మరణ సభ ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో జరిగింది. ముందుగా రామోజీరావు చిత్రపటానికి బుద్ధప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగువారి గొప్పతనాన్ని తన అక్షరంతో దశదిశలా వ్యాపింపజేసిన ఘనత రామోజీరావుకే దక్కిందనారు. నమ్మకం, విలువలు పెట్టుబడితో వ్యాపారం చేస్తూ ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపిన వ్యక్తి మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. ఆయన అడుగుపెట్టిన ప్రతి రంగంలోనూ తన ముద్ర కనిపించేలా ఆయా రంగాలను తీర్చిదిద్దారన్నారు. ఆయన లేనిలోటు తీర్చలేనిదని, ఆయన చూపిన మార్గంలో నేటితరం మీడియా ప్రతినిధులు ముందుకు సాగాలన్నారు. ప్రజాసంఘాల నేతలు, జర్నలిస్టులు, లాయర్లు, సీఏలు, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.

ఉత్సాహంగా జిల్లా హాకీ జట్టు ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు, జూన్ 19: నగరంలోని అజిత్‌సింగ్‌నగర్ ఎంబీపీ స్టేడియంలో జిల్లా సీనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపికలు ఉత్సాహపూరిత వాతావరణంలో బుధవారం జరిగాయి. ఎంపికైన వారిని ఈ నెల 27 నుంచి 30 వరకు సత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగే ఏపీ రాష్ట్ర 14వ పురుషుల హాకీ చాంపియన్‌కు పంపుతున్నట్టు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ కె.రాజశేఖర్ తెలిపారు.

జట్టు ఇదే... పి.దేవి వరప్రసాద్, వి.సాయి. జి.వేణుగోపాల్, జి.శివ ప్రమోద్, జి.నాగ ఉపేంద్ర, బి.సందీప్, పి. రాఘవేంద్రరావు, దుర్గా మల్లేశ్వరరావు, టి.శ్రీనివాస్, ఎం.పవన్‌కుమార్, కె.ప్రశాంత్, కె.కృపాసాగర్, కె.హరీష్, వి.అభిషేక్, బి.దుర్గాప్రసాద్, టి.సాయి కోటేశ్వరరావు, పీఏవీఎల్ రత్నం, టి.సునీల్ కుమార్, స్టాండ్‌బైలుగా టి.చిరంజీవి యేసురాజు, బి.చరణ్, పి.నూతన్, ఎస్. జషు.



హోంశాఖా మంత్రిగా బాధ్యతలు చేపడుతున్న అనిత

ఖాకీ డ్రస్సు గౌరవం పెంచేలా పని చేయండి

- లేదంటే తప్పుకోండి... కొత్త వారు వస్తారు
- గంజాయి, డ్రగ్స్ కట్టడికి త్వరలో టాస్క్‌ఫోర్స్
- హోంశాఖ మంత్రిగా అనిత బాధ్యతల స్వీకరణ

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడి వినియోగం, అమ్మాయిలపై అఘాయిత్యాలపై ఉక్కుపాదం మోపుతానని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపడతామన్నారు. "ఖాకీ డ్రస్ గౌరవం పెంచేలా పనిచేయండి. ఇంతకు ముందులాగే పని చేస్తామంటే మాత్రం పక్కకు తప్పుకోండి. మీ స్థానంలో కొత్త వారు వస్తారు" అని పోలీసు అధికారులను ఉద్దేశించి అనిత తెగేసి చెప్పారు. బుధవారం ఉదయం 11.19 గంటల సమయంలో అమరావతి సచివాలయంలోని రెండవ బ్లాకులో ని తన చాంబర్‌లో రాష్ట్ర హోమ్, విపత్తుల నిర్వహణశాఖ మంత్రిగా అనిత బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఆశీస్సులతో మంత్రిగా బాధ్యతలు చేపట్టానన్నారు. సామాన్య టీచర్‌ను మంత్రిని చేసిన పాయకారావుపేట ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. "గత ఐదేళ్లలో లా అండ్ ఆర్డర్‌లో అనేక ఇబ్బందులు తలెత్తాయి. రాబోయే రోజుల్లో దానిని గాడిలో పెడతాం" అని అనిత తెలిపారు. గంజాయి, డ్రగ్స్ కట్టడికి త్వరలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. దిశ చట్టం లేకుండానే దిశ పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశారని, వాటికి మహిళా పోలీస్ స్టేషన్లుగా పేరు మారుస్తామన్నారు. చాలా పోలీస్ స్టేషన్లలో కనీస సౌకర్యాల లేమితో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని, ఆ సమస్యలన్నింటినీ రాబోయే రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సోషల్ మీడియా వేదికగా విచ్చలవిడిగా విమర్శిస్తూ, వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ పోస్టులు పెట్టడాన్ని సహించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. మంత్రిగా బాధ్యతలు తీసుకున్న అనితకు డీజీపీ హరీశ్‌కుమార్, హోమ్ ప్రిన్సిపల్ సెక్రటరీ విజయ్‌కుమార్, ఇంటెలిజెన్స్ అదనపు డీజీ కుమార విశ్వజిత్ తదితర అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులూ అభినందనలు తెలిపారు.

జగన్ సభకు రావాలి

- అర్థవంతమైన చర్చలు జరగాలి: మంత్రి పయ్యావుల



బాధ్యతలు చేపడుతున్న పయ్యావుల

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): 'రానున్న శాసనసభ సమావేశాల్లో రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి సంబంధించి అర్థవంతమైన చర్చలు జరగాలని మేం కోరుకుంటున్నాం' అని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. బుధవారం శాసనసభలోని టీడీఎల్పీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం శాసనసభ వ్యవహారాల మంత్రిగా పయ్యావుల కేశవ్ అసెంబ్లీలోని తన చాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. శాసన సభ ఏర్పాట్లకు చెందిన ఫైల్‌పై తొలి సంతకం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో పారదర్శకమైన పాలనను రాష్ట్ర ప్రజలకు అందించేందుకు కృషి చేస్తామని కేశవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనసభ కార్యదర్శి రామాచార్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేశవ్ మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడుతూ.. 'ప్రజల కోసం, ప్రజల సంక్షేమం కోసం సభ అనే విధంగా సభను నడుపుతాం. జగన్ సభకు రావాలని సమస్యలపై మాట్లాడాలనే కోరుకుంటున్నాం. స్వపక్షమైనా, విపక్షమైనా మేమే అని ఆయన అన్నారు. ప్రజల కోసం ఏ పాత్ర పోషించడానికైనా మేం సిద్ధంగా ఉంటాం' అని స్పష్టం చేశారు.

ఆర్థికశాఖ ఉన్నతాధికారులతో మంత్రి భేటీ...

రాష్ట్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో పయ్యావుల భేటీ అయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మంత్రి పయ్యావులకు ఆ శాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ వివరించారు. 'సీఎం చంద్రబాబుతో చర్చించి త్వరలో శ్వేత పత్రం విడుదల చేయాల్సి ఉంటుంది. అన్ని రకాల అప్పులు, ఆర్థిక స్థితి గతులపై నివేదిక ఇవ్వాలి' అని ఆర్థిక శాఖ అధికారులను మంత్రి ఆదేశించినట్లు సమాచారం.

24న తొలి మంత్రివర్గ సమావేశం

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో తొలి మంత్రివర్గ సమావేశానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 24న ఉదయం 10 గంటలకు మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం, మంత్రులు ప్రమాణ స్వీకార కార్యక్రమాలు ఈ నెల 12న పూర్తి అయ్యాయి. బిజీ షెడ్యూల్ కారణంగా మంత్రివర్గ సమావేశానికి తేదీ ఖరారు చేయలేదు. చివరికి 24న మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం ఉదయం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు అజెండాలను సిద్ధం చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అసెంబ్లీ ముహూర్తం రేపు ఉదయం 9.46

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నూతన శాసనసభ తొలి సమావేశానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 21న, శుక్రవారం ఉదయం గం.9.46 నిమిషాలకు సభ కొలువు తీరనుంది. ఈ మేరకు గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. రెండు రోజులపాటు జరిగే ఈ సమావేశాలను సభ్యుల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నికకు మాత్రమే పరిమితం చేశారు.

అసెంబ్లీ చీఫ్ మార్షల్‌గా గణేశ్ బాబు

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ చీఫ్ మార్షల్‌గా గణేశ్ బాబును నియమించారు. ప్రస్తుతం చీఫ్ మార్షల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఏడుకొండలరెడ్డిని విధుల నుంచి తొలగించి, డీజీపీ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. గణేశ్ బాబు 2014-19 మధ్య కాలంలో అసెంబ్లీ చీఫ్ మార్షల్‌గా వ్యవహరించారు.

ఛత్తీస్‌గఢ్‌లో మందుపాతర పేలి వృద్ధురాలికి గాయాలు

చర్ల, జూన్ 19: ఛత్తీస్‌గఢ్‌లో మందుపాతర పేలి ఓ వృద్ధురాలికి తీవ్రగాయాలయ్యాయి. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఊసూరు అడవుల్లో బుధవారం ఈ ఘటన జరిగింది. నడపల్లి గ్రామానికి చెందిన జోగిపాటి గంగ అనే వృద్ధురాలు ఊసూరు అడవుల్లోకి అటవీ ఉత్పత్తుల కోసం వెళ్లింది. ఈ క్రమంలో పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన మందుపాతరపై కాలు వేయడంతో అది పేలి ఆమె తీవ్రంగా గాయపడింది. ఆమె రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి ఆమెను బీజాపూర్ వైద్యశాలకు తరలించారు. గత ఐదు నెలల్లో బీజాపూర్ జిల్లాలో మందుపాతరల కారణంగా ఎనిమిదిమంది గాయపడ్డారని, వీరిలో నలుగురు మృతి చెందారని పోలీసులు చెబుతున్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తం: నాదెండ్ల

అమరావతి(ఆంధ్రజ్యోతి), గొల్లపూడి, జూన్ 19: ప్రజా పంపిణీ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి వినియోగదారునికి, రైతుకు ఉపయోగపడే విధంగా చర్యలు చేపడతామని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహన్ ప్రకటించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని ఎమ్ఎల్ఎస్ స్టాక్ పాయింట్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కనీసం స్టాక్‌ను నమోదు చేయకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాక్ పాయింట్‌లో పలు అవకతవకలను గుర్తించానని, ఆరు సరుకుల్లో ఐదు సరుకులు పాడైనట్లు తెలిపారు. పాడైన సరుకులను ఇంకా ఎందుకు సీజ్ చేయలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 253 మండల కేంద్రాల స్టాక్ పాయింట్లలో 160 స్టాక్ పాయింట్లను పరిశీలించానని, 68 చోట్ల స్టాక్ పాడైనట్లు గుర్తించానని చెప్పారు. పేదలకు అందాల్సిన రేషన్ సరుకు బొక్కేసిన వారిపై తప్పకుండా చర్యలుంటాయన్నారు. దోచుకున్నది కక్కిస్తామని చెప్పారు.



గత టీడీపీ ప్రభుత్వంలో అమరావతిలోని హైకోర్టు వద్ద శరవేగంగా సాగుతున్న నిర్మాణ పనులు




జగన్ పాలనలో అమరావతిలోని హైకోర్టు ప్రాంతం ఇలా విగిలింది

ఎలాంటి రాజధాని

ఎలా మిగిలింది?

(మొదటి పేజీ తరువాయి)

జగన్ కక్షపూరిత వైఖరితో కుప్పకూలింది. నిత్యం వేల మంది పనివారి నిర్మాణ పనులు, వందల వాహనాల పరుగులతో కళకళలాడిన ఈ నగరం ప్రభుత్వం మారిన తర్వాత.. గత ఐదేళ్లుగా పనులన్నీ నిలిచిపోయి అడవిని తలపించింది. మూడు రాజధానుల పేరుతో వైసీపీ ప్రభుత్వం అమరావతిని పీక పిసికే ప్రయత్నం చేసింది. కానీ ఇటీవలి ఎన్నికల్లో టీడీపీ గెలవడంతో మళ్లీ అమరావతి దశ తిరిగింది.



రాష్ట్రానికి ఏకైక రాజధానిగా అమరావతిని ఖరారు చేస్తూ విధాన నిర్ణయం తీసుకొన్న సీఎం చంద్రబాబు తన ప్రాధాన్యాల్లో అమరావతి పునర్నిర్మాణానికి పెద్ద పీట వేశారు. తొలి ప్రాధాన్యంగా పోలవరాన్ని ఎంచుకొన్న ఆయన, బాధ్యతలు తీసుకొన్న తొలి వారంలోనే అక్కడకు వెళ్లి పరిస్థితులను ప్రత్యక్షంగా చూసి ఆకళింపు చేసుకొన్నారు. ద్వితీయ ప్రాధాన్యంగా అమరావతిని ఎంపిక చేసుకొన్న ఆయన గురువారం రాజధాని ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ గత ఐదేళ్లలో ఏం జరిగిందో చూడాలని నిర్ణయించుకొన్నారు. ఖరారైన కార్యక్రమం ప్రకారం..... గురువారం ఉదయం 11గంటలకు ఆయన అమరావతిలోని నివాసం నుంచి బయలుదేరి వెళ్లి రాజధాని నిర్మాణాలను పరిశీలిస్తారు. 70, 80 శాతం వరకూ నిర్మాణం పూర్తి చేసుకొని నిలిచిపోయిన ఆలిండియా సర్వీసెస్ అధికారుల నివాస భవనాలు, మంత్రుల నివాస భవనాలు, న్యాయమూర్తుల గృహ సముదాయ భవనాలు, సీడ్ యాక్సెస్ రోడ్డు, అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్లు, ఐకానిక్ నిర్మాణాల కోసం పనులు మొదలై ఆగిపోయిన ప్రాంతం, ఉద్దండరాయునిపాలెంలో రాజధాని శంకుస్థాపన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించనున్నారు. అసెంబ్లీ, సచివాలయం, రాజ్‌భవన్ వంటి ఐకానిక్ భవనాల కోసం పునాది వరకూ నిర్మించారు. అవి ఐదేళ్ల నుంచీ నీటిలో నానుతున్నాయి. వాటి పరిస్థితి ఎలా ఉందో కూడా చూడాలని అనుకొంటున్నారు. పరిస్థితిని స్వయంగా చూసి తదుపరి పనుల్లో దేనిపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలో ఆయన నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది.

భవిష్యత్‌లోకి చూపు..

రాష్ట్ర రాజధానిగా అమరావతిని దేశంలోనే వినూత్న నగరంగా నిర్మించాలని నాటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. రాజధాని నిర్మాణానికి సింగపూర్ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ తయారు చేసి ఇచ్చింది. మాస్టర్ ప్లాన్ ప్రకారం 217 కిలోమీటర్ల పరిధిలో రాజధాని నగరం ఉంటుంది. 16.9 చ.కి.మీ. విస్తీర్ణంలో కోర్ రాజధాని ఉంటుంది. ల్యాండ్‌పూలింగ్ విధానం ద్వారా కేవలం 58 రోజుల్లో రైతుల నుంచి 34 వేల ఎకరాల భూమి సేకరించారు. రైతులు తమంతట తాము క్యూ లైన్లలో నిలబడి భూములు ఇవ్వడానికి సంసిద్ధత వ్యక్తం చేయడం మొత్తం దేశంలోనే ఒక విజయవంతమైన నమూనాగా నిలిచింది. ప్రజలు ఇచ్చిన భూమి, ప్రభుత్వ భూమి కలిపి మొత్తం 54వేల ఎకరాలను రాజధాని కోసం సేకరించారు. రోడ్లు, నిర్మాణాలు, రైతుల వాటా కింద తిరిగి ఇవ్వాల్సిన భూమి పోను ప్రభుత్వానికి రాజధానిలో 8వేల ఎకరాలు మిగులుతుంది. ల్యాండ్ పూలింగ్ కింద మొత్తం 29,881 మంది రైతులు రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చారు. కోర్ కేపిటల్ ప్రాంతంలో నవ నగరాలు నిర్మించడం ద్వారా నలుమూలలా ప్రగతి బాటలు వేయాలని ప్రభుత్వం అప్పట్లో నిర్ణయించింది. టీడీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి రాజధాని నిర్మాణాలపై రూ.9,165 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో ప్రజాప్రతినిధుల కోసం పన్నెండు టవర్ల నిర్మాణం చేపట్టారు. ఇందులో 288 ఫ్లాట్లు ఉన్నాయి. అఖిల భారత సర్వీస్ అధికారుల కోసం ఆరు టవర్లలో 144 ఫ్లాట్ల నిర్మాణం మొదలుపెట్టారు. ముఖ్య కార్యదర్శుల ఫ్లాట్లు పాతిక ఉన్నాయి. వీటి మొత్తం ఖర్చు రూ. 246 కోట్లు. గెజిటెడ్ అధికారుల కోసం 384 ఫ్లాట్లతో నాలుగు టవర్లు, టైప్ టూ కింద 336 ఫ్లాట్లతో నాలుగు టవర్లు చేపట్టారు. న్యాయమూర్తుల కోసం 36 ఫ్లాట్లు నిర్మించాలని మొదలుపెట్టారు. ఇవి ఇరవై ఎనిమిది శాతం నిర్మాణం పూర్తయ్యాయి. వీటికి రూ.211 ఖర్చు చేశారు. మంత్రుల కోసం ముప్పై ఐదు ఫ్లాట్ల నిర్మాణం మొదలుపెట్టారు. రాజధాని అభివృద్ధి చెందితే ప్రభుత్వం వద్ద ఉన్న మిగులు భూముల విక్రయంతో రాజధాని నిర్మాణం పూర్తవుతుంది. అందుకే దీనిని సొంతంగా నిధులు సమకూర్చుకోగలిగిన ప్రాజెక్టుగా పిలిచారు. పూర్తి స్థాయిలో రాజధాని అభివృద్ధి చెందితే, ప్రభుత్వం వద్ద ఉన్న భూమి విలువ రూ.రెండు లక్షల కోట్లకు చేరుతుందని అంచనా.

రాజధానిలో సామగ్రి దొంగిలించిన వారిపై చర్యలు

నేడు అమరావతి ప్రాంతంలో చంద్రబాబు పర్యటన

ప్రజా వేదిక కూల్చినచోటు నుంచి ప్రారంభం: మంత్రి నారాయణ

ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం అమరావతిలో పర్యటిస్తారని పురపాలకశాఖ మంత్రి నారాయణ వెల్లడించారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం కూల్చివేసిన ప్రజా వేదిక వద్ద నుంచి చంద్రబాబు పర్యటన ప్రారంభమవుతుందని తెలిపారు. సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయాన్ని పరిశీలించి, అనంతరం అక్కడే చంద్రబాబు మీడియాతో మాట్లాడతారన్నారు. ముందుగా కమిటీలు వేసి రాజధానిలో జరిగిన నష్టాన్ని పరిశీలిస్తామన్నారు. రాజధాని నిర్మాణాలకు తమ హయాంలో వేసిన టెండర్ల కాలపరిమితి ముగిసినందున కొత్తగా అంచనాలు తయారు చేసి టెండర్లు పిలవాల్సి ఉంటుందని తెలిపారు. దీని కోసం మూడు నుంచి నాలుగు నెలల సమయం పడుతుందన్నారు. పనులు ఎప్పటి నుంచి ప్రారంభించాలనేది కేబినెట్‌లో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రాజధానిలో సామగ్రి దొంగిలించిన వారిపై చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. రాజధానిలో ఇళ్ల స్థలాల అంశం సుప్రీం కోర్టులో ఉందని, న్యాయ సలహా తీసుకుని ముందుకు వెళతామని మంత్రి తెలిపారు.

పట్టభద్ర ఎన్నికల్లో వాడింది బ్యాలెట్టేగా?

- ఆ ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయిన వైసీపీ
- పోలింగ్ జరిగిన మూడు స్థానాలూ టీడీపీకే..
- అయినా..ఈవీఎంలపై నెపానికి ప్రయత్నం
- జగన్ తీరుపై రాజకీయ వర్గాల్లో విస్మయం

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఈవీఎం యంత్రాల వల్లే తాను ఓడిపోయానన్న రీతిలో వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ఇస్తున్న సంకేతాలు రాజకీయ వర్గాలను విస్మయానికి గురి చేస్తున్నాయి. ఓటింగ్ యంత్రాలను తన ఓటమికి పరోక్షంగా కారణంగా చూపిస్తూ రెండు రోజుల క్రితం ఆయన ట్వీట్ చేశారు. తనను ప్రజలు ఓడించారన్న నిజాన్ని ఒప్పుకోలేక ఆయన పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్న వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. సాధారణ ఎన్నికలకు ఏడాది ముందు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. బ్యాలెట్ పేపర్ల ద్వారా జరిగిన ఆ ఎన్నికల్లో కూడా వైసీపీ ఘోర పరాజయం చవిచూసింది. వైసీపీ ఓటమికి అంకురార్పణ పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లోనే జరిగిందని, జగన్ దానిని దాచిపెట్టాలని చూస్తున్నారని టీడీపీ వర్గాలు విమర్శిస్తున్నాయి. ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాలు మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో పట్టభద్రుల ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు. మొత్తం మూడు స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఉత్తరాంధ్రలోని మూడు ఉమ్మడి జిల్లాలు ఒక నియోజకవర్గం కాగా.. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలు రెండో నియోజకవర్గంగా, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలు మూడో నియోజకవర్గంగా ఉన్నాయి. ఈ ఎన్నికలు జరిగేనాటికి టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు జరగలేదు. అప్పటికి టీడీపీకి ఏ పార్టీతోనూ పొత్తులు కూడా లేవు. ఈ మూడు స్థానాల్లో వైసీపీ, టీడీపీ పోటీ చేశాయి. మొత్తం ఐదు లక్షల మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. వీరందరూ బ్యాలెట్ పేపర్లు వినియోగించి ఓట్లు వేశారు. ఓటర్లు ప్రాధాన్య క్రమం ప్రకారం ఓటు వేయాల్సి ఉంటుంది. బాగా నచ్చిన వారికి మొదటి ఓటు, తర్వాత వారికి రెండో ఓటు, ఆ తర్వాత వారికి మూడో ఓటు ఇలా బ్యాలెట్ పేపర్ మీద పెన్నుతో సంఖ్య వేయాల్సి ఉంటుంది. పోలింగ్ తర్వాత బ్యాలెట్ పేపర్లు అన్నింటిని చూసి ఎక్కువ ఓట్లు వచ్చిన వారిని గెలిచినట్లుగా ప్రకటిస్తారు. ఈ మూడు స్థానాల్లోనూ వైసీపీ చిత్తుగా ఓడిపోయి టీడీపీ పెద్ద మెజారిటీతో గెలుపొందింది. తమకు బాగా బలం ఉందని భావించిన రాయలసీమలోని రెండు స్థానాల్లోనూ ఓటమి ఎదురు కావడం వైసీపీ వర్గాలకు దిగ్భ్రాంతిని కలిగించింది. నాటి ముఖ్యమంత్రి జగన్ సొంత జిల్లా కడపలో కూడా మెజారిటీ ఓట్లు టీడీపీకే పడ్డాయి. జగన్ సొంత నియోజకవర్గం పులివెందులకు చెందిన టీడీపీ నేత రాంగోపాల్ రెడ్డి ఎమ్మెల్సీగా గెలుపొందారు. విశాఖను రాజధానిగా వైసీపీ అప్పటికే విస్తృతంగా ప్రచారంలో పెట్టింది. అయినా ఆ ప్రాంతంలో కూడా వైసీపీ భారీ తేడాతో ఓడిపోయింది. వైసీపీ కాళ్ల కింద నేల జారిపోతోందన్న సంకేతాలు ఆ ఎన్నికల్లోనే వెలువడ్డాయి. ఇప్పుడు ఈవీఎం యంత్రాలపై నెపం తోయాలని చూస్తున్న జగన్, పట్టభద్ర ఎన్నికల్లో ఓటమికి ఏం కారణం చెబుతారని టీడీపీ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. "పట్టభద్ర ఎన్నికల్లో ఈవీఎంలు లేవు. బ్యాలెట్ పేపర్లే ఉన్నాయి. రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల్లో ఓటర్లు లక్షల సంఖ్యలో అందులో పాల్గొని ఓట్లు వేశారు. ఆ ఎన్నికల్లో మొత్తం అన్ని సీట్లలో వైసీపీ ఓడిపోయింది. ఇప్పటి ఓటమికి ఆ రోజే పునాది పడింది. ప్రజల తీర్పును అంగీకరించలేక జగన్ దిక్కుమాలిన కథలు చెబుతున్నారు' అని టీడీపీ ఎమ్మెల్సీ ఒకరు వ్యాఖ్యానించారు.

కొత్త డీజీపీగా ద్వారకా తిరుమలరావు

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాను రాష్ట్రప్రభుత్వం ఆకస్మికంగా బదిలీ చేసింది. కొత్త డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి ద్వారకాతిరుమలరావును నియమించింది. ఈ మేరకు సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ బుధవారం రాత్రి ఉత్తర్వులిచ్చారు. వాస్తవానికి చంద్రబాబు సీఎం కాగానే.. ద్వారకా తిరుమలరావునే డీజీపీగా నియమిస్తారని అంతా భావించారు. అయితే ఎన్నికల సమయంలో నాటి డీజీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డిని ఈసీ తొలగించి హరీశ్‌కుమార్ గుప్తాను నియమించింది. ఆయన్నే కొనసాగించాలని కొత్త ప్రభుత్వం కూడా భావించింది. కానీ సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం సందర్భంగా జరిగిన గందరగోళం ఆయనకు ప్రతికూలంగా మారింది. ఆ రోజున ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. గన్నవరం విమానాశ్రయంలో ప్రధాని మోదీకి స్వాగతం పలికి.. తర్వాత ముఖ్యమంత్రిగా చంద్రబాబుతో పదవీప్రమాణం చేయించాల్సి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. ఆయన కాన్వాయ్ దాదాపు 40 నిమిషాలు నిలిచిపోయింది. దీంతో ఆయన ప్రధాని మోదీ స్వాగత కార్యక్రమానికి రాలేకపోయారు. ఆ రోజు ట్రాఫిక్ నియంత్రణలో విషయంలో డీజీపీ గుప్తా పూర్తిగా విఫలమయ్యారు. చివరికి ఆయనే స్వయంగా రంగంలోకి దిగి గవర్నర్ కాన్వాయ్‌కు ట్రాఫిక్ క్లియర్ చేయాల్సి వచ్చింది. ఈ మొత్తం వ్యవహారంపై ప్రధాని మోదీ కూడా అసహనం వ్యక్తం చేశారు. చివరకు తిరుగు ప్రయాణ సమయంలో తనకు వీడ్కోలు పలికేందుకు గన్నవరం విమానాశ్రయానికి ఎవరు రావద్దంటూ ఒక్కరే వెళ్లిపోయారు. అప్పుడే గుప్తాపై బదిలీ వేటు పడుతుందని అనుకున్నారు. కానీ ప్రభుత్వం కొన్నాళ్లు ఆగి బదిలీ చేసింది. ఇప్పుడు ఆయన స్థానంలో సమర్థుడు, నిజాయితీపరుడిగా పేరున్న 1989 బ్యాచ్‌కు చెందిన ద్వారకాతిరుమలరావును నియమించింది. ప్రస్తుతం ఆయన ఏపీఎస్ఆర్టీసీ ఎండీగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో అనేక కీలక పోస్టుల్లో పనిచేసిన ఆయన.. నిబద్ధత కలిగిన పోలీసు అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. సాధారణంగా డీజీపీని సెలెక్షన్ కమిటీ ఎంపిక చేస్తుంది. ప్రస్తుతం సమయం లేకపోవడంతో ప్రభుత్వమే నియమించింది. అయితే ఆయనకు నేరుగా డీజీపీ పోస్టు ఇవ్వకుండా డీజీపీ (కో-ఆర్డినేషన్) పోస్టులో నియమించింది. ఆ స్థానంలో ఉండి ఆయన డీజీపీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొంది. గుప్తాకు కూడా కీలకమైన హోం శాఖ ముఖ్య కార్యదర్శి బాధ్యత అప్పగించింది.

ప్రభుత్వ పాఠశాలలో చదివి ఐపీఎస్‌కు

గుంటూరు: సామాన్య కుటుంబంలో జన్మించి ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి.. జాతీయస్థాయిలో సివిల్స్‌కు ఎంపికై ఐపీఎస్ అధికారి అయిన ద్వారకా తిరుమలరావు రాష్ట్ర డీజీపీగా ఎంపిక కావడంపై హర్షం వ్యక్తమవుతోంది. ఆయన గుంటూరు నగరవాసి. దేవాపురంలో పుట్టారు. తండ్రి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విభాగంలో అధికారిగా పనిచేశారు. ఆయనకు తిరుమలరావు సహా ఇద్దరు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. తిరుమలరావు కృష్ణ నగర్‌లోని మున్సిపల్ స్కూల్లో ఐదో తరగతి వరకు, తర్వాత లక్ష్మీపురంలోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్‌లో పదో తరగతి వరకు చదివారు. కొంత కాలం గుంటూరు టీజేపీఎస్ కళాశాలలో మేథమేటిక్స్ లెక్చరర్‌గా పని చేశారు. సెంట్రల్ యూనివర్సిటీలో మేథ్స్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించారు. 1989లో ఆయన ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ఆయన భార్య వైద్య విభాగంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు. తిరుమలరావు చెన్నై సీబీఐలో కొంతకాలం పనిచేశారు. గుంటూరులో చిన్ననాటి నుంచి తనతో కలిసి చదువుకున్న స్నేహితులతో ఇప్పటికీ సంబంధాలు కొనసాగిస్తున్నారు.

త్రికరణ శుద్ధిగా.. పేదలకు పథకాల ఫలాలు!

- 2028లోగా ప్రతి ఇంటికీ కొళాయినీరు
- కూలీల వేతనాలు వెంటనే వచ్చేలా కేంద్రం దృష్టికి తీసుకెళ్దాం
- విద్యార్థిలా అన్నీ నేర్చుకుంటాను అధికారులు బోధించాలి: ఉప ముఖ్యమంత్రి
- బాధ్యతల స్వీకారం.. సమీక్ష
- ఉద్యాన పంటల అభివృద్ధిపై మొదటి సంతకం

స్కీముల అమల్లో రాజకీయ జోక్యమొద్దు: పవన్ కల్యాణ్





బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పవన్‌కు తిలకం దిద్దుతున్న వర్మ, అధికారులతో సమీక్షలో పవన్

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద ప్రజల కోసం అందరి సహకారంతో త్రికరణ శుద్ధితో పనిచేసి పథకాల ఫలాలు అందిస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. బుధవారం విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో , పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ పర్యావరణ శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయా శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇరు రాష్ట్రాల్లో గ్రామీణ ప్రాంతాలను సందర్శించానని, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా విస్తృతంగా పర్యటించానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలు కొన్ని తనకు తెలుసని, ఇంకా విస్తృతంగా తెలుసుకుని వారికి ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. అరకు లాంటి గిరిజన ప్రాంతాల్లోని మహిళలు తాగునీటి కోసం ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో స్వయంగా చూశానని చెప్పారు. గ్రామీణ ప్రజలకు ఉపయోగపడే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పథకాల్లో రాజకీయ జోక్యం తగ్గించాలని.. తమ సొంత పార్టీ నేతలైనా కలుగజేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా 2028 లోపు ప్రతి ఇంటికీ కొళాయి నీరు ఇచ్చే విధంగా లక్ష్యాలు నిర్దేశించుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో తాగునీటిని అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలన్నారు. అన్ని పంచాయతీలకు రోడ్డు కనెక్టివిటీ ఉండాలని, ఆ మేరకు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ప్రణాళికలతో ముందుకు రావాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన పరిజ్ఞానం తనకు అంతగా లేదని, ఒక విద్యార్థిగా అన్నీ విషయాలు నేర్చుకుంటానని.. అధికారులు తనకు బోధించాలని కోరారు. ఇన్‌చార్జి ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కన్నబాబు తమ శాఖకు సంబంధించి పలు విషయాలు వివరించారు. రాష్ట్రంలో ఎన్ని పంచాయతీలు, ఎన్ని మండలాలు, ఎన్ని జిల్లా పరిషత్‌లు, ఎన్నికలు జరిగిన స్థానిక సంస్థలు, జరగకుండా పెండింగ్‌లో ఉన్నవి.. స్థానిక సంస్థలకు అందుతున్న కేంద్ర నిధులు, పంచాయతీరాజ్‌శాఖలో డీఎల్‌డీవో, డీపీవో విభాగాలు, అవి పనిచేస్తున్న తీరు, ఆయా విభాగాల్లో ఉన్న సిబ్బంది తదితర విషయాల గురించి పవన్ అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీలు, గ్రామ సచివాలయాల మధ్య ఉన్న వ్యత్యాసం గురించి అడుగగా.. కమిషనర్ కన్నబాబు, అదనపు కమిషనర్ సుధాకర్‌రావు వేర్వేరు జవాబులిచ్చారు. గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసినప్పుడు తెచ్చిన జీవో 110 ప్రకారం గ్రామ పంచాయతీలు, సచివాలయాలు వేరు కాదన్నారని.. ఆ తర్వాత వేర్వేరు అంటూ విడదీశారని సుధాకర్‌రావు వివరిస్తుండగా కన్నబాబు వారించారు. ఆ జీవో తానే ఇచ్చానని, సచివాలయాలు సంక్షేమ కార్యక్రమాల కోసమని, గ్రామ పంచాయతీలు వేరని తెలిపారు. ఏ రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థ బాగుందని పవన్ అడుగగా.. కేరళలో వ్యవస్థ ఆదర్శంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో మైనర్ మినరల్స్ ద్వారా గ్రామ పంచాయతీలకు రావల్సిన రూ.7-8 వేల కోట్ల సీనరేజ్ చార్జీలు వచ్చాయా అని ఉపముఖ్యమంత్రి అడిగారు. ఆ వివరాలు అందించాలని సుధాకర్‌రావుకు సూచించారు. తాను గ్రామాల్లో తిరుగుతానని, ఘన వ్యర్థ నిర్వహణ షెడ్‌లకు సంబంధించి బాగా అమల్లో ఉన్న గ్రామం, బాగా లేని గ్రామాలను గుర్తించి చెప్పాలన్నారు. పారిశుద్ధ్యం గురించి పవన్ కల్యాణ్ లాంటి సెలబ్రిటీలు ఒక నినాదమిస్తే గ్రామీణ యువత పాటించే అవకాశముందని, బ్రాండ్ అంబాసిడర్‌లాగా ఉపముఖ్యమంత్రి సేవలు వినియోగించుకోవచ్చని శశిభూషణ్ తెలిపారు. రాష్ట్రంలో టీడీపీ హయాంలో 25.23 లక్షల ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశామని, గత ప్రభుత్వంలో కాంట్రాక్టులను రద్దు చేయడంతో చాలా చోట్ల నిర్వీర్యమయ్యాయని.. వాటిపై దృష్టి సారించాలని కన్నబాబు కోరారు. గ్రామ కంఠం అంటే ఏంటి.. స్వామిత్వ పథకం ద్వారా పేదలు, ప్రభుత్వ స్థలాలకు పట్టాలు ఏ విధంగా లభిస్తాయని పవన్ అడిగి తెలుసుకున్నారు.

అడవుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో అటవీ సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపముఖ్యమంత్రి పవన్ ఆదేశించారు. అటవీశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సందర్భంగా.. రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనం పెంపుదలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్పష్టం చేశారు. అటవీశాఖ కార్యకలాపాలతో పాటు అటవీ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ సంబంధిత అంశాలపై ఉన్నతాధికారులతో సమగ్రంగా చర్చించారు. నగర వనాల పెంపు, జీవ వైవిధ్య మండలి కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పవన్ సోదరుడు నాగబాబు, జనసేనకు మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, ఇతర ఎమ్మెల్యేలు, జనసేన నేతలు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

4,500 కోట్ల ఉపాధి నిధులు వాడుకోలేదు..

ఉపాధి హామీ పథకం గురించి పవన్‌కు కమిషనర్ కన్నబాబు తెలియజేశారు. గత ప్రభుత్వంలో సచివాలయ భవనాల కోసం ఉపాధి మెటీరియల్ నిధులు వాడుకునే ప్రయత్నం చేశారని, సరిగా బిల్లులివ్వకపోవడంతో సుమారు రూ.4,500 కోట్ల మేర నిధులు వాడుకోలేకపోయామన్నారు. ఈ ఏడాది 15 కోట్ల పనిదినాలను కేంద్రం మంజూరు చేసిందని, ఇప్పటికే 12.20 కోట్ల పనిదినాలు పూర్తయ్యాయన్నారు. ఈ పథకంలో అవినీతి జరగలేదా? దివ్యాంగులకు ఉపాధిలో పనులు ఎలా కల్పిస్తారు.. వారికి సక్రమంగా వేతనాలు అందుతున్నాయా తదితర విషయాలపై పవన్ ఆరా తీశారు. సోషల్ ఆడిట్ అంటే ఏమిటి?.. దాని పనితీరు ఏ విధంగా ఉంది.. ఎంత రికవరీ చేశారు మొదలైన వాటి గురించి సోషల్ ఆడిట్ డైరెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అంబుడ్స్‌మెన్ విధులేంటి? క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ గురించి ప్రత్యేకంగా అడిగారు. సోషల్ ఆడిట్, విజిలెన్స్‌పై గురువారం ప్రత్యేకంగా సమీక్ష నిర్వహిస్తామన్నారు. పంటకుంటలు, అమృత్ సరోవర్, జలకళలో బోర్లు, వాటర్ షెడ్ తదితర ప్రాజెక్టుల గురించీ ఆయన తెలుసుకున్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితర సిబ్బంది విధుల గురించి అడిగారు. సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులని, వలంటీర్లకు, సచివాలయాలకు సంబంధం లేదని, ప్రభుత్వ పథకాల అమలు కోసం సచివాలయ పరిధిలో పనిచేస్తుంటారని కన్నబాబు వివరించారు. గురువారం తిరిగి సమావేశమై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలోని అన్ని విభాగాలపైనా సమీక్షిస్తామని పవన్ తెలిపారు. ఉపాధి పథకంలో కేంద్రం నేరుగా కూలీలకు వేసే వేతనాలు ఎప్పుడూ ఆలస్యం అవుతున్నాయని అధికారులు చెప్పగా.. కేంద్రం దృష్టికి తీసుకెళ్దామని.. దీనిపై నోట్ తయారుచేయాలని ఆయన ఆదేశించారు. కాగా.. ఉపాధి నిధులతో రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఉద్యాన పంటలు అభివృద్ధి చేసేందుకు సంబంధించిన ఫైల్‌పైన, గిరిజన ప్రాంతాల్లో పంచాయతీ భవనాల నిర్మాణాలకు సంబంధించి పవన్ మొదటి సంతకం చేశారు.

ఓటమికి జగన్‌దే బాధ్యత!

వైసీపీ అభ్యర్థుల మనోగతం.. నేడు తాడేపల్లిలో ఆ పార్టీ విస్తృత స్థాయి భేటీ

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ విస్తృత స్థాయి సమావేశం గురువారం జరుగనుంది. మాజీ సీఎం, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి నివాసంలో జరిగే ఈ భేటీలో పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు.. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు హాజరు కానున్నారు. ఘోర పరాజయంపై వీరంతా ఏమంటారోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. జగనే ఓటమికి బాధ్యత వహించాలని ఓడిన అభ్యర్థులు మొదటి నుంచీ బహిరంగంగానే అంటున్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు, పట్టాదార్ పాస్‌పుస్తకాలపై జగన్ ఫొటోలు.. ఐప్యాక్ టీం సర్వేల పేరిట అభ్యర్థుల మార్పు.. సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డి తదితరులతో కూడిన కోటరీకే ప్రాధాన్యం ఇవ్వడం వంటివాటితో మునిగిపోయామని, చివరకు అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కూడా దక్కని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. జగన్ ప్రజాతీర్పును హుందాగా స్వాగతించకపోగా ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తంచేయడంపైనా విమర్శలు చేస్తున్నారు. క్షేత్ర స్థాయి పరిస్థితిని గమనించకుండా ఏకపక్ష ధోరణితో వ్యవహరించారని.. 'వైనాట్ 175' అంటూ హడావుడి చేశారని.. గత ఎన్నికల్లో 151 మంది ఎమ్మెల్యేలు, 22 మంది ఎంపీల కంటే ఎక్కువే గెలుస్తామని ప్రకటించారని.. కానీ జగన్ సహా 11 మంది మాత్రమే అసెంబ్లీకి వెళ్తున్నారని.. 4 లోక్‌సభ స్థానాల్లో మాత్రమే గెలవగలిగామని వైసీపీ అభ్యర్థులు గుర్తుచేస్తున్నారు. విస్తృత స్థాయి భేటీలో వీరు తమ మనోగతం చెప్పగలుగుతారా.. వారికసలు మాట్లాడే అవకాశమిస్తారా అనేది వేచిచూడాలి.

ఇంత భయమెందుకు జగన్?



జైలు కాదు ఇల్లు...

సుమారు 30 అడుగుల ఎత్తున ఇనుప కవచం మధ్య ఉన్న ఈ నిర్మాణం సెంట్రల్ జైలు కాదండోయ్! ఇదే తాడేపల్లి ప్యాలెస్ సముదాయం! గతంలో ఇది పార్టీ కార్యాలయం. సీఎం అయ్యాక దానినే క్యాంప్ కార్యాలయంగా మార్చుకున్నారు. సచివాలయం ముఖం చూడకుండా ఇక్కడి నుంచే పాలన సాగించారు. ఆ పక్కన ఉన్నది జగన్ నివాసం. గోశాల, మరికొన్ని నిర్మాణాలూ ఫొటోలో చూడొచ్చు.



ఎందుకింత అ....భద్రత

ఇది తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లే దారి! నిజానికి... ఇది ప్రజలందరికీ రహదారి. జగన్ సీఎం కాగానే ఆయన సొంత దారి అయిపోయింది. దాదాపుగా పార్లమెంటు భవన సముదాయంతో సమానమైన భద్రత ఏర్పాటు చేశారు. బటన్ నొక్కితే మూసుకుపోయే గేట్లు... ఆటోమేటిక్‌గా నేలలోనుంచి పైకి లేచి వచ్చే ఉక్కు స్తంభాలు, సీసీటీవీ కెమెరాలు, నిరంతర గస్తీ కోసం వందలాదిగా పోలీసులు! ఇదీ... జగన్ తనకోసం ఏర్పాటు చేసుకున్న భద్రత!

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

కూలీల కుటుంబంలో ఎనిమిదేళ్ల బాలికకు క్యాన్సర్

రూ.2 లక్షలు అప్పు చేసి చికిత్స చేయించిన తల్లిదండ్రులు

ఆపరేషన్ చేస్తేనే నయమవుతుందన్న వైద్యులు



క్యాన్సర్ బారినపడిన ప్రణతి

యల్లనూరు, జూన్ 19: ఎనిమిదేళ్ల చిన్నారి క్యాన్సర్ బారిన పడటంతో చికిత్స చేయించే స్తోమత లేక ఆమె కుటుంబం ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తోంది. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం చిలమకూరు గ్రామానికి చెందిన గంగరాజు, లక్ష్మీనారాయణమ్మ దంపతుల కుమార్తె ప్రణతి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. ఆమె క్యాన్సర్ బారిన పడినట్లు మూడు నెలల క్రితం గుర్తించారు. తల్లిదండ్రులు రైతు కూలీలు. రోజూ పనికి వెళితే తప్ప పూట గడవని పరిస్థితి. కుమార్తె ప్రాణాలు కాపాడుకునేందుకు ఇప్పటికే రూ.2 లక్షలు అప్పు చేసి అనంతపురం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించారు. ఆపరేషన్ చేస్తేగానీ నయం కాదని వైద్యులు తేల్చారు. వెంటనే హైదరాబాద్‌కు తీసుకెళ్లి ఆపరేషన్ చేయించాలని సూచించారు. లక్షల రూపాయల ఖర్చు అవుతుందని తెలిపారు. అయితే, డబ్బులు లేక తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం, దాతలు సాయం చేయాలని కోరుతున్నారు. బాధితుల బ్యాంక్ ఖాతా నంబరు(యూనియన్ బ్యాంక్): 065712010000311, పేరు: తలారి లక్ష్మీనారాయణమ్మ, ఐఎఫ్ఎస్‌సీ కోడ్: యూబీఐఎన్0806579, యల్లనూరు బ్రాంచ్, అనంతపురం జిల్లా, ఫోన్ నంబరు 9391776399.

అడ్వకేట్ జనరల్‌గా నేడు దమ్మాలపాటి బాధ్యతలు



అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అడ్వకేట్ జనరల్(ఏజీ)గా సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ గురువారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన్ను ఏజీగా నియమించాలని గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కోరుతూ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ మంగళవారం ప్రతిపాదనలు పంపారు. వాటికి గవర్నర్ ఆమోదం తెలపడంతో న్యాయశాఖ బుధవారం నియామక ఉత్తర్వులు జారీచేసింది. బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆయన నియామకం అమల్లోకి వస్తుందని పేర్కొంది. దమ్మాలపాటి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014 జూన్ 30 నుంచి 2016 మే వరకు అదనపు అడ్వకేట్ జనరల్(ఏఏజీ)గా.. 2016 మే 28 నుంచి 2019 మే వరకు ఏజీగా సేవలు అందించిన సంగతి తెలిసిందే.

సర్కారు మారినా బేఖాతర్!



(మొదటి పేజీ తరువాయి)

ఎడాపెడా తవ్వితీసి నదులను గుల్లచేసేశారు. ఆ ఇసుకనంతా తమ సొంత, లీజుకు తీసుకున్న భూముల్లోకి తరలించేశారు. అధికారిక లెక్కలప్రకారమే రాష్ట్రవ్యాప్తంగా 180కిపైగా ఇసుక డంప్‌లున్నాయి. సగటున ఒక్కో డంప్‌లో లక్ష టన్నులకు తక్కువ కాకుండా నిల్వలున్నట్లు గనుల శాఖలోని విజిలెన్స్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. విజయవాడ నగరంలో పలు నివాస ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో కూడా వేల టన్నుల డంప్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వం మారితే తవ్వలేమని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఎన్నికలకు ముందు మార్చి, ఏప్రిల్ నెలల్లోనే ఇసుకను తవ్వి తరలించుకుపోయారు. ఇసుక అక్రమ తవ్వకాలపై హైకోర్టు, సుప్రీంకోర్టులో విచారణలు జరుగుతున్నా వారు వెనక్కి తగ్గలేదు. ప్రస్తుతం ఆ డంప్‌ల్లో ఉన్న ఇసుకతో ఏడాదిపాటు వ్యాపారం చేసుకోవచ్చని విజిలెన్స్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం మొదలవడంతో కృత్రిమంగా ఇసుక కొరత సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని.. ధరలు భారీగా పెంచుతున్నారని గుర్తించాయి. ప్రస్తుతం 20 టన్నుల ఇసుక లారీని రూ.45 వేలకుపైనే విక్రయిస్తున్నట్లు తెలిసింది. 6-8 టన్నుల ఇసుక ట్రాక్టర్‌కు 12 వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. రానున్న రోజుల్లో వర్షాలు పెరిగితే ధరలు మరింత పెంచాలని వైసీపీ నేతలు భావిస్తున్నట్లు విజిలెన్స్ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నాయి. వైసీపీ నేతల అధీనంలో ఉన్న ఇసుక డంప్‌లను స్వాధీనం చేసుకోవాలని, అప్పుడే కృత్రిమ కొరతను అరికట్టగలమని అంటున్నాయి.

తమ్ముడి కోసమే ఆ సంస్థలు..!

ఇసుక తవ్వకాలు, అమ్మకాల కోసం జగన్ సర్కారు ప్రతిమ ఇన్‌ఫ్రా, జీసీకేసీ సంస్థలతో గతేడాది ఒప్పందాలు చేసుకుంది. ఈ ఒప్పందాల కాలపరిమితి 2026 డిసెంబరు వరకు ఉంది. 18 జిల్లాల్లో ఇసుక తవ్వకాల టెండర్ దక్కించుకున్న ప్రతిమ ఇన్‌ఫ్రా.. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మేనల్లుడికి చెందినది. 8 జిల్లాలు తీసుకున్న జీసీకేసీ తమిళనాడులో రిజిస్టర్ అయింది. ఇది రాజస్థాన్‌లో పైప్‌లైన్ వర్క్‌లు చేస్తోంది. ఇసుక కాంట్రాక్టు పేరిట జగన్ ఈ రెండు కంపెనీలను పట్టుకొచ్చారు. నిజానికి ఈ సారి ఆయన తమ్ముడు వైఎస్ అనిల్‌రెడ్డికే ఇసుక వ్యాపారపగ్గాలు ఇచ్చారు. ఆయన కోసమే ఈ రెండు కంపెనీలను తీసుకొచ్చారన్న విమర్శలున్నాయి. ఇసుక తవ్వకాల కాంట్రాక్టు టెండర్లను కోల్‌కతాలో రహస్యంగా నిర్వహించారు. ఇందులో పెద్ద గూడుపుఠాణి చోటు చేసుకుంది. ఇప్పుడు ప్రభుత్వం మారింది. తామొస్తే పేదలకు ఉచితంగా ఇసుక ఇస్తామని టీడీపీ కూటమి హామీ ఇచ్చింది. ఈ దిశగా కీలక విధాన నిర్ణయం తీసుకోనుంది. అయితే ఈలోపే ఆ రెండు సంస్థలు ఇబ్బడిముబ్బడిగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నట్లు గనుల శాఖ అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ అంశంపై వెంటనే దృష్టి సారించాలని ప్రజలు, ప్రజాసంఘాలు, రాజకీయ పక్షాలు కోరుతున్నాయి. సకాలంలో నిర్ణయం తీసుకోకపోతే నదుల్లోని ఇసుకంతా భారీ యంత్రాలతో తవ్వి తరలించుకుపోయే ప్రమాదం ఉందని అధికార వర్గాలు కూడా చెబుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో వర్షాలు మొదలయ్యాయి. ఎగువ నుంచి వరదలు వస్తే నదుల్లో ఇసుక తవ్వకాలకు ఆస్కారం ఉండదు. ఏ మేరకు ఇసుక తవ్వకాలు అడ్డగోలుగా జరిపారు.. పర్యావరణాన్ని ఎలా ధ్వంసం చేశారో తెలుసుకునే అవకాశం కూడా ఉండదని గనుల శాఖలోని జియాలజిస్టులు అంటున్నారు. అందుచేత ప్రభుత్వం ఇసుక తవ్వకాలపై తక్షణమే నిర్దిష్ట ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ టెండర్ల బాగోతాన్ని సమీక్షించి రద్దుచే యాలని పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు .అలాగే మాన్యువల్ లైసెన్సులు తీసుకుని యంత్రాలు ఉపయోగిస్తున్నారని, వీటిపై విచారణ జరిపించాలని.. తవ్వకాల లైసెన్సులను రద్దుచేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



అనంతపురంలోని అమిగోస్ మినరల్స్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వైసీపీ కాంట్రాక్టర్లు

మైనింగ్ మాఫియా పెద్దిరెడ్డి!

ఉమ్మడి అనంతలో వెయ్యి కోట్లు లూటీ

మాజీ మంత్రి అక్రమాలపై గళం విప్పిన వైసీపీ కాంట్రాక్టర్లు

బినామీ సంస్థ 'అమిగోస్' ఎదుట మెరుపు ధర్నా

సీఐడీతో దర్యాప్తు జరిపించాలని డిమాండ్

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 19: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బినామీ సంస్థ అమిగోస్ మినరల్స్ కంపెనీ ఎదుట వైసీపీ కాంట్రాక్టర్లు మెరుపు ధర్నాకు దిగారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రూ.1000 కోట్ల విలువ చేసే ఖనిజ సంపదను ఆ సంస్థ లూటీ చేసిందని ఆరోపించారు. మైనింగ్ లీజ్ వసూళ్లలో తమకు అన్యాయం చేశారని లీజు కాంట్రాక్టర్లు ఆక్షేపించారు. వెంటనే అమిగోస్ మినరల్స్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం సాయంత్రం అనంతపురం నగరంలోని అమిగోస్ మినరల్స్ సంస్థ కార్యాలయం ఎదుట వారంతా ధర్నాకు దిగారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మైనింగ్ మాఫియాను పెద్దిరెడ్డి నడిపారని వైసీపీకి చెందిన కాంట్రాక్టర్లు గొందిరెడ్డిపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కూడేరు రవి ఈ సందర్భంగా ఆరోపించారు. మైనింగ్ క్వారీలకు అన్ని రకాల అనుమతులు తీసుకున్నా.. అక్రమ కేసులు బనాయించి తమ క్వారీలను లాక్కున్నారని మండిపడ్డారు. అమిగోస్ మినరల్స్ సంస్థ ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 72 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, సుమారు రూ.1000 కోట్ల ఖనిజ సంపదను లూటీ చేశారని ఆరోపించారు. అమిగోస్ సంస్థలో ఉన్న జితేంద్ర, ప్రసాద్‌రెడ్డి, మనోహర్, రాజశేఖర్ రెడ్డి తమ రాయల్టీ పేపర్లను చించేసి తమపైనే కేసులు పెట్టారని, పెద్దిరెడ్డి అనుచరులమంటూ తమను బెదిరించారని, భౌతిక దాడులకు తెగబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. లీజుదారుల నుంచి వసూలు చేసిన మొత్తానికి రసీదులు, జీఎస్టీ బిల్లులు ఇవ్వలేదని, అక్రమంగా దోచుకున్న డబ్బును ఎన్నికల్లో పంచారని ఆరోపించారు. అమిగోస్ సంస్థ అవినీతి, అక్రమాలపై సీఐడీ విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో లీజుదారులు పవన్, శేఖర్, రాము తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సోషల్ మీడియాకు సజ్జల భార్గవరెడ్డి దూరం?

నాగార్జున యాదవ్‌కు బాధ్యతలు!



అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా వ్యవహారాలకు ఇన్‌చార్జి సజ్జల భార్గవరెడ్డి దూరంగా ఉంటున్నట్లు ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆయన తండ్రి, ప్రభుత్వ మాజీ సలహాదారు, వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మాత్రం రోజూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ వద్దకు వస్తున్నా.. భార్గవరెడ్డి మాత్రం దూరంగా ఉంటున్నారని పార్టీ నేతలు చెబుతున్నారు. దీంతో ఆ బాధ్యతను నాగార్జున యాదవ్‌కు జగన్ అప్పగించారని అంటున్నారు. ఎన్నికలకు ముందు ప్రతిపక్షాల నాయకులను, మహిళలను కించపరిచేలా వైసీపీ సోషల్ మీడియాలో భార్గవరెడ్డి పోస్టింగ్‌లు పెట్టేవారు. దీనిపై ఫిర్యాదులు చేసేందుకు ప్రయత్నించినా అప్పట్లో పోలీసులు కేసులు నమోదు చేయనే లేదు. ఎన్నికల్లో జగన్ ఓడిపోవడంతో.. తమపై నాడు పెట్టిన పోస్టింగ్‌లపై ఫిర్యాదు చేసేందుకు కొత్త హోం మంత్రి వంగలపూడి అనిత, ఇతర టీడీపీ మహిళా నేతలు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే భార్గవరెడ్డి దూరంగా ఉన్నారని తెలుస్తోంది. ఇంకోవైపు.. సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత వైసీపీ సోషల్ మీడియా క్రియాశీలంగా లేదు. అయితే జగన్ భక్తులు కొందరు ఓటమిని జీర్ణించుకోలేక.. సంక్షేమ పథకాలు అందుకున్న ప్రజలకు విశ్వాసం లేదంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారు.

ఎన్నికల అనంతర హింసపై వివరాలు సమర్పించండి

రాష్ట్రప్రభుత్వం, డీజీపీకి హైకోర్టు ఆదేశం

వైవీ పిటిషన్‌పై విచారణ 4 వారాలకు వాయిదా



అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల అనంతరం జరిగిన దాడులకు సంబంధించిన వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, డీజీపీని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఎన్నికల అనంతరం జరుగుతున్న దాడులను నిరోధించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది వీఆర్ రెడ్డి వాదనలు వినిపించారు. ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఓ పార్టీ సానుభూతిపరులపై దాడులు జరిగాయన్నారు. పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారని.. ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని.. దాడులు, ఆస్తుల ధ్వంసానికి సంబంధించిన ఘటనలపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై స్థాయీ నివేదికను కోర్టుముందు ఉంచేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం పై ఆదేశాలిచ్చింది.

ప్రక్షాళన ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వకుండా... సాధారణ పరిపాలన శాఖలో (జీఏడీ) రిపోర్ట్ చేయించారు. ఆమెతోపాటు రెవెన్యూ (ఎక్సైజ్) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవకు కూడా పోస్టింగ్ ఇవ్వలేదు. వైసీపీకి వీరాభిమానిగా పని చేసిన డి.మురళీధర్ రెడ్డిని కూడా జీఏడీలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖలో వింత ఉత్తర్వులు, వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నట్లుగా ముద్రపడిన ప్రవీణ్ ప్రకాశ్‌కు కూడా ప్రస్తుతానికి పోస్టింగ్ ఇవ్వలేదు. జీఏడీలో రిపోర్ట్ చేయాలని ఆయనను ఆదేశించారు. ప్రస్తుతం ఆయన కీలకమైన ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ, సెర్ప్ సీఈవో వంటి కీలకమైన స్థానాల్లో విధులు నిర్వహిస్తున్నారు. సీఎస్ తర్వాత అత్యంత కీలకమైన సీసీఎల్ఏ సాయిప్రసాద్ స్థాయి తగ్గించినప్పటికీ... ప్రాధాన్యమున్న పోస్టే దక్కింది. ఆయనను జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. వివాదాలకు దూరంగా ఉంటున్న అనిల్ కుమార్ సింఘాల్‌కు కీలకమైన మునిసిపల్ శాఖను కేటాయించారు. గతంలో సీఆర్‌డీఏలో పని చేసి ఆ విభాగంపై అవగాహన ఉన్న కాటమనేని భాస్కర్‌ను ఇప్పుడు సీఆర్‌డీఏ కమిషనర్‌గా నియమించారు. గత ఎన్నికల సమయంలో ప్రధాన ఎన్నికల అధికారి హోదాలో వ్యవహరించి, ఆపై జగన్‌కు సన్నిహితుడిగా మారిన గోపాలకృష్ణ ద్వివేదీకి కూడా మంచి శాఖే దక్కింది. ఆయనను కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. గతంలో చంద్రబాబు పేషీలో సంయుక్త కార్యదర్శిగా పని చేసిన పీఎస్ ప్రద్యుమ్న మళ్లీ చాన్స్ కొట్టేశారు. ఈసారి ఏకంగా సీఎం సెక్రటరీగా నియమితులయ్యారు. జగన్ హయాంలో గాడి తప్పిన ఆర్థిక శాఖను సంస్కరించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. వివాదరహితులైన జానకి, వాడరేవు వినయ్‌చంద్‌లను ఆర్థిక శాఖలో కొన్ని విభాగాలకు కార్యదర్శులుగా నియమించారు. మరో సీనియర్ అధికారిని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించనున్నట్లు తెలుస్తోంది. తొలివిడతలో 19మంది సీనియర్ ఐఏఎస్‌లకు స్థానచలనం కలుగగా... రేపోమాపో విడతలవారీగా మరికొందరి బదిలీపై ఉత్తర్వులు జారీ అవుతాయని, కీలకమైన శాఖలు, కలెక్టర్లకు స్థాన చలనం జరుగుతుందని తెలుస్తోంది.

ఐఏఎస్‌లకు కొత్త పోస్టింగ్స్..

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
వై.శ్రీలక్ష్మి	మున్సిపల్ శాఖ,ప్రత్యేక ప్రధాన కార్యదర్శి	జీఏడీలో రిపోర్ట్ చేయాలి
రజత్ భార్గవ	ఎక్సైజ్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి	జీఏడీలో రిపోర్ట్ చేయాలి
జి.సాయిప్రసాద్	సీసీఎల్ఏ	జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
శశిభూషణ్ కుమార్	జలవనరుల శాఖ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి	పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి
బుడితి రాజశేఖర్	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
అనిల్ కుమార్ సింఘాల్	గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి	మునిసిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
గోపాల కృష్ణ ద్వివేది	వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి	కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
ప్రవీణ్ ప్రకాశ్	పాఠశాల విద్యా శాఖ ప్రధాన కార్యదర్శి	జీఏడీలో రిపోర్ట్ చేయాలి
సిద్ధార్థ జైన్	సర్వే సెటిల్‌మెంట్ కమిషనర్	పౌర సరఫరాల శాఖ కమిషనర్
సౌరబ్ గౌర్	ఇంటర్మీడియట్ విద్య కమిషనర్	ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి
కోన శశిధర్	ఐటీఈ అండ్ సీ విభాగం సెక్రటరీ	పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి
అహ్మద్ బాబు	మార్కెటింగ్ సెక్రటరీ	హార్టికల్చర్, ఆక్వా, ఫిషరీష్ కార్యదర్శి
కాటమనేని భాస్కర్	పాఠశాల శాఖ మౌలిక సదుపాయాల కమిషనర్	సీఆర్డీయే కమిషనర్
పీఎస్ ప్రద్యుమ్న	ఆర్ అండ్ బీ కార్యదర్శి	ముఖ్యమంత్రి కార్యదర్శి
ఎం.జానకి	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	ఆర్థిక శాఖ కార్యదర్శి (పద్దులు)
ఎంఎం నాయక్	హ్యాండ్‌లూమ్, టెక్స్‌టైల్స్ కమిషనర్	పశు, డెయిరీ డెవలప్‌మెంట్ కార్యదర్శి
ప్రవీణ్ కుమార్	తిరుపతి జిల్లా కలెక్టర్	మైన్స్ కమిషనర్, మినరల్ ఎండీ
డి.మురళీధర్ రెడ్డి	ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ	జీఏడీలో రిపోర్ట్ చేయాలి
వాడరేవు వినయ్ చంద్	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	ఆర్థిక శాఖ (ఎఫ్‌పీ) కార్యదర్శి

నీరబ్ సర్వీస్ పొడిగింపు!

ఆరు నెలలు పొడిగించాలని కేంద్రానికి లేఖ



అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ పదవీకాలాన్ని 6నెలలు పొడిగించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. నీరబ్ కుమార్ కొద్ది రోజుల కిందటే ఏపీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ నెలాఖరులో ఆయన రిటైర్ కాబోతున్నారు. కానీ, ప్రభుత్వం ఆయన సేవలు కొనసాగించాలని నిర్ణయించింది. అందులో భాగంగా కేంద్రానికి లేఖ రాసింది. గత ప్రభుత్వంలోనే ఆయన సీఎస్ కావాల్సి ఉంది. కానీ, జగన్ ఆయనను పక్కన పెట్టి జూనియర్ అయిన జవహర్ రెడ్డికి పట్టం కట్టారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే సీనియార్టీకి ప్రయార్టీ ఇచ్చారు. సీనియారిటీలో ముందున్న నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను సీఎస్‌గా ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆయనకు 10 రోజుల సర్వీస్ మాత్రమే ఉండడంతో మరికొంత కాలం పాటు అవకాశం ఇవ్వాలన్న ఉద్దేశంతో సర్వీస్ పొడిగింపు కోరుతూ కేంద్రానికి లేఖ రాశారు. కేంద్రం ఒకే విడతలో ఆరు నెలలు పొడిగింపు ఇస్తుందా.. లేదంటే మూడు నెలల చొప్పున రెండుసార్లు పొడిగిస్తుందా అన్నది వేచి చూడాలి.

జలవనరుల శాఖ సలహాదారుగా ఎం.వెంకటేశ్వరరావు

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖ సలహాదారుగా రిటైర్డ్ ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ బుధవారం ఉత్తర్వు జారీ చేశారు. సమర్థుడు, నిజాయితీపరుడైన అధికారిగా పేరొందిన వెంకటేశ్వరరావుకు జలాశయాలు, జలవనరులపై పట్టుంది. పోలవరం ప్రాజెక్టుపై పూర్తి అవగాహన ఉంది. సీఎంగా జగన్ బాధ్యతలు స్వీకరించాక.. ఈఎన్‌సీగా రిటైరైన వెంకటేశ్వరరావును సలహాదారుగా నియమించారు. కానీ కీలకమైన పోలవరం బాధ్యతల నుంచి తప్పించారు. రెండ్రోజుల కిందట సీఎం చంద్రబాబు పోలవరం పర్యటన, సమీక్షకు ఆయన్ను ప్రత్యేకంగా పిలిపించారు. ఆయన్ను సలహాదారుగా నియమిస్తారని అప్పుడే అందరూ అనుకున్నారు.

విజిలెన్స్ కమిషనర్ వీణా ఈష్ రాజీనామా

నామినేటెడ్ పదవుల్లో చేరిన మరో నలుగురూ..

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రిటైర్ అయిన తర్వాతా వైసీపీ ప్రభుత్వ హయాంలో నామినేటెడ్ పదవుల్లో చేరిన అధికారులు ఇప్పుడు వరుసగా రాజీనామాలు చేస్తున్నారు. తాజాగా విజిలెన్స్ కమిషనర్ వీణా ఈష్ రాజీనామా చేశారు. అలాగే, కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీగా విధులు నిర్వహిస్తున్న మల్లికార్జున, వెంకట రామిరెడ్డి, న్యాయశాఖ సెక్రటరీ సత్యప్రభాకర్, మున్సిపల్ శాఖ అదనపు సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి కూడా తమ రాజీనామా లేఖలను సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్‌కు సమర్పించారు. వైసీపీకి అనుకూలంగా వ్యవహరించే ప్రతాప్‌రెడ్డి గత ఎన్నికల ముందు రిటైరయ్యారు. ఆయనకు జగన్ సర్కారు వెంటనే పోస్టింగ్ ఇచ్చింది. దీన్ని సచివాలయ ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకించినా అధికారులు పట్టించుకోలేదు.

అందుబాటులోకి 'మీకోసం' పోర్టల్

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని వాటిని పరిష్కరించేందుకు వీలుగా ఉన్న ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు అనుబంధంగా 'మీకోసం' పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చామని ప్రణాళిక శాఖ తెలిపింది. కలెక్టర్లందరూ ఇందులోకి లాగిన్ అయి సమస్యల వివరాలను ఆయా శాఖలకు చేరవేయాలని ఆదేశించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● గురువారం 20 జూన్ 2024



న్యూఢిల్లీలోని కథక్ కేంద్ర(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కథక్ డ్యాన్స్)- సంగీతం, కథక్ నృత్యం కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. హిందీ మాధ్యమంలో బోధన ఉంటుంది. అభ్యర్థులకు హిందీ, ఇంగ్లీష్ భాషలు చదవడం, రాయడం తెలిసి ఉండాలి. అడ్మిషన్ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు స్టయిపెండ్ సౌకర్యం ఉంది.

'కథక్ కేంద్ర'లో నృత్యం, సంగీతం

కథక్ డ్యాన్స్

- ఇందులో రెండు ఎలిమెంటరీ కోర్సులు, నాలుగు అడ్వాన్స్‌డ్ కోర్సులు ఉన్నాయి.
- **ఎలిమెంటరీ కోర్సులు:** అయిదేళ్ల ఫౌండేషన్ కోర్సు, మూడేళ్ల డిప్లొమా కోర్సు
- **అడ్వాన్స్‌డ్ కోర్సులు:** ఏడాది వ్యవధిగల ప్రిపరేటరీ ఫేజ్ కోర్సు, మూడేళ్ల డిప్లొమా ఆనర్స్ కోర్సు, రెండేళ్ల పోస్ట్ డిప్లొమా కోర్సు, ఆర్నెల్ల రిఫ్రెషర్ కోర్సు.

సంగీతం: ఇందులో ఏడాది వ్యవధిగల సర్టిఫికెట్ కోర్సు(తబలా/పఖవాజ్/సారంగి/ఒకల్), మూడేళ్ల డిప్లొమా స్పెషల్ కోర్సు(తబలా/పఖవాజ్/సారంగి/ఒకల్) ఉన్నాయి.

నృత్యం కోర్సులకు అర్హత

- ఫౌండేషన్ కోర్సులో ప్రవేశానికి కనీసం మూడోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు జూన్ 1 నాటికి 10 నుంచి 15 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. కథక్ నృత్యంలో పరిచయం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- డిప్లొమా కోర్సులో ప్రవేశానికి కనీసం తొమ్మిదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు జూన్ 1 నాటికి 15 నుంచి 20 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. సంగీతం, థియేటర్ ఆర్ట్స్, విజువల్ ఆర్ట్స్‌లో ఆసక్తి/అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- డిప్లొమా ఆనర్స్ కోర్సులో ప్రవేశానికి ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణతతోపాటు డిప్లొమా (కథక్) పూర్తి ఉండాలి. అభ్యర్థులకు జూన్ 1 నాటికి 19 నుంచి 23 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. హిందుస్థానీ ఒకల్ మ్యూజిక్, తబల/పఖవాజ్ శిక్షణ పొందినవారికి; లిటరేచర్, థియేటర్ ఆర్ట్స్, విజువల్ ఆర్ట్స్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- పోస్ట్ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు డిప్లొమా ఆనర్స్(కథక్) పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు జూన్ 1 నాటికి 21 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి. లిటరేచర్, విజువల్ ఆర్ట్స్‌లో ఆసక్తి ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- రిఫ్రెషర్ కోర్సులో ప్రవేశానికి పోస్ట్ డిప్లొమా కోర్సు పూర్తిచేసి ఉండాలి. డ్యాన్స్ టీచర్‌గా పనిచేస్తూ ఉండాలి. అభ్యర్థుల వయసు జూన్ 1 నాటికి 40 ఏళ్లలోపు ఉండాలి.



సంగీతం
కోర్సులకు అర్హత: సర్టిఫికెట్ కోర్సులో ప్రవేశానికి అభ్యర్థులకు జూన్ 1 నాటికి 19 నుంచి 21 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఇంటర్/పన్నెండో తరగతి ఉత్తీర్ణతతోపాటు ఒకల్ మ్యూజిక్‌లో అవగాహన తప్పనిసరి.

- డిప్లొమా స్పెషల్ కోర్సులో ప్రవేశానికి అభ్యర్థులకు 20 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఒకల్ మ్యూజిక్‌లో పరిజ్ఞానం ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **అడ్మిషన్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 29న
- **అడ్మిషన్ టెస్ట్ తేదీలు:** నృత్యంలో ఎలిమెంటరీ కోర్సులకు జూలై 2, 3, 4; నృత్యంలో అడ్వాన్స్‌డ్ కోర్సులు, సంగీతం కోర్సులకు జూలై 8, 9, 10
- **ఫలితాలు విడుదల:** నృత్యంలో ఎలిమెంటరీ కోర్సులకు జూలై 5; నృత్యంలో అడ్వాన్స్‌డ్ కోర్సులు, సంగీతం కోర్సులకు జూలై 11
- **తరగతులు ప్రారంభం:** నృత్యంలో ఎలిమెంటరీ కోర్సులు జూలై 9 నుంచి; నృత్యంలో అడ్వాన్స్‌డ్ కోర్సులు, సంగీతం కోర్సులు జూలై 16 నుంచి
- **ఈ-మెయిల్:** admission@kathakkendra.in
- **వెబ్‌సైట్:** www.kathakkendra.in

తెలంగాణ ఎస్సీ గురుకులాల్లో నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్



హైదరాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ)-ఆపరేషన్ బ్లూ క్రిస్టల్‌లో భాగంగా నీట్ 2025కు హాజరయ్యే అభ్యర్థుల కోసం లాంగ్ టర్మ్ కోచింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తోంది. నీట్ 2024లో సాధించిన మార్కుల ఆధారంగా సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీఓఈ) గురుకులాల్లో అడ్మిషన్స్ ఇస్తారు. బాలబాలికలకు క్యాంపస్‌లు వేరుగా ఉంటాయి. బోధన ఉచితం. భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. రాష్ట్రానికి చెందిన ఎస్సీ, బీసీ, ఓసీ/ఈడబ్ల్యూఎస్ కేటగిరీల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

సీఓఈ గురుకులాలు - సీట్లు

- **గౌలిదొడ్డి సీఓఈ:** మొత్తం 200 సీట్లు ఉన్నాయి. వీటిలో బాల బాలికలకు చెరి సమానంగా 100 సీట్లు కేటాయించారు. మొత్తమ్మీద ఎస్సీ అభ్యర్థులకు 190, బీసీలకు 5, ఓసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సీట్లు నిర్దేశించారు.
- చిలుకూరు సీఓఈలో బాలురకు 50 సీట్లు, నార్సింగి సీఓఈలో బాలికలకు 50 సీట్లు, మహేంద్ర హిల్స్ సీఓఈలో బాలికలకు 50 సీట్లు ఉన్నాయి. ఒక్కో సీఓఈలో బీసీలకు 1, ఓసీ/ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి 1, ఎస్సీలకు 48 సీట్లు నిర్దేశించారు.

అర్హత: అభ్యర్థులు నీట్ 2024 రాసి ఉండాలి. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000; పట్టణాల్లో రూ.2,00,000 మించకూడదు. గతంలో ఆపరేషన్ బ్లూ క్రిస్టల్ కింద ఈ అవకాశాన్ని వినియోగించుకున్నవారు ప్రస్తుతం దరఖాస్తుకు అనర్హులు.


ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 24
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 27
- **సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్:** జూన్ 28
- **తరగతులు ప్రారంభం:** జూలై 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.tswreis.ac.in

ఉస్మానియా వర్సిటీలో ఇంటర్న్‌షిప్

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన 'ప్రొఫెసర్ టీ.నవనీత రావు సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం- నాలుగో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి వారం. ఇందులో రీసెర్చ్ టెక్నిక్స్, టెక్నికల్ స్కిల్స్‌కు సంబంధించి శిక్షణ ఇస్తారు. జూన్ 24 నుంచి 29 వరకు ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు శిక్షణ తరగతులు, వర్క్‌షాప్‌లు ఉంటాయి. లైఫ్ సైన్సెస్, ఫార్మసీ, కెమిస్ట్రీ విభాగాలకు చెందిన ఫ్యాకల్టీ మెంబర్లు, పీహెచ్‌డీ స్కాలర్స్, పీజీ స్టూడెంట్స్ దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 40 మందికి అవకాశం కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులు నిర్దేశిత రుసుం చెల్లించి వర్సిటీ గెస్ట్ హౌస్‌లో వసతి సౌకర్యం పొందవచ్చు. అభ్యర్థులందరూ ల్యాబ్ కోట్, మాస్క్ వెంట తెచ్చుకోవాలి. ప్రోగ్రామ్ చివరలో అభ్యర్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ఇస్తారు.

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.3,500
- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 23
- **ఈ-మెయిల్:** cfrdou@gmail.com
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in



ఐఐటీ ఇండోర్‌లో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ



ఇండోర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోసైన్సెస్ అండ్ బయో మెడికల్ ఇంజనీరింగ్- 'ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ బయోటెక్నాలజీ(జీఏటీ) 2024 స్కోర్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. అడ్మిషన్ పొందినవారికి నెలకు రూ.5,000ల ఫెలోషిప్ ఇస్తారు. రీసెర్చ్‌పై ఆసక్తిగల అభ్యర్థులు మూడో సెమిస్టర్‌లో ఎమ్మెస్సీ+పీహెచ్‌డీ డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లోకి మారవచ్చు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడు/నాలుగు/అయిదేళ్ల డిగ్రీ(బయాలజీ/బయోటెక్నాలజీ/అగ్రికల్చర్-బయాలజీ ఒక సబ్జెక్టుగా) ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమశ్రేణి మార్కులు తప్పనిసరి. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ బయోటెక్నాలజీ(జీఏటీ) 2024 అర్హత పొంది ఉండాలి. పీహెచ్‌డీలోకి మారాలనుకునే వారు సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ జేఆర్ఎఫ్ అర్హత పొంది ఉండాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు ఫీజు లేదు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 21
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదోతరగతి, ఇంటర్ మార్కుల పత్రాలు, సర్టిఫికెట్‌లు; జీఏటీ-బీ 2024 ర్యాంక్ కార్డ్; కులం, వైకల్యం ధ్రువీకరణ పత్రాలు; అభ్యర్థి ఫొటో, సంతకం
- **వెబ్‌సైట్:** www.iiti.ac.in

పీజీసీఎల్‌లో ఇంజనీర్ ట్రెయినీలు

మొత్తం ఖాళీలు 435

న్యూఢిల్లీలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పీజీసీఐఎల్), సెంట్రల్ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సీటీయూఐఎల్).. వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: ఇంజనీర్ ట్రెయినీ(ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/సివిల్/కంప్యూటర్ సైన్స్)
విభాగాల వారీగా ఖాళీలు: ఎలక్ట్రికల్-331, ఎలక్ట్రానిక్స్-14, సివిల్-53, కంప్యూటర్ సైన్స్-37.
అర్హత: కనీసం 60 శాతం మార్కులతో గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి ఇంజనీరింగ్‌లో బీఈ, బీటెక్, బీఎస్సీ(ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్(పవర్)/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/పవర్ సిస్టమ్స్ ఇంజనీరింగ్/పవర్ ఇంజనీరింగ్(ఎలక్ట్రికల్)/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ కమ్యూనికేషన్/టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్/సివిల్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. వ్యాలిడ్ గేట్-2024 స్కోరు సాధించి ఉండాలి.
వయోపరిమితి: 18-28 సంవత్సరాల మధ్య ఉండాలి.
పే స్కేల్: నెలకు రూ.40,000 నుంచి రూ.1,40,000
ఎంపిక ప్రక్రియ: గేట్ 2024 స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ల వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
దరఖాస్తు రుసుము: రూ.500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 4
వెబ్‌సైట్: www.powergrid.in/jobopportunities

సెబీలో అసిస్టెంట్ మేనేజర్లు

మొత్తం ఖాళీలు 97

ముంబయిలోని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: ఆఫీసర్ గ్రేడ్-ఎ(అసిస్టెంట్ మేనేజర్)
స్ట్రీమ్: జనరల్-62, లీగల్-5, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-24, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-2, రీసెర్చ్-2, అఫీషియల్ లాంగ్వేజ్-2
అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/ఎల్ఎల్‌బీ/పీజీ/సీఏ/సీఎఫ్ఏ/సీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
గరిష్ఠ వయోపరిమితి: 2024 మార్చి 31 నాటికి 30 ఏళ్లు మించకూడదు
పే స్కేల్: నెలకు రూ.44,500 - రూ.89,150
ఎంపిక విధానం: ఫేజ్-1, ఫేజ్-2(పరీక్షలు), ఫేజ్-3(ఇంటర్వ్యూ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా
దరఖాస్తు రుసుము: అన్‌రిజర్వ్‌డ్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ వారికి రూ.1000. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.100.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 30
వెబ్‌సైట్: https://www.sebi.gov.in/index.html

మేనేజ్‌లో ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్‌లు

జాబ్ కార్నర్

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్)... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు
1. మేనేజ్ ఫెలో: **2 పోస్టులు**
2. ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్(అకడమిక్): **1 పోస్టు**
3. ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్(ఐటీ): **1 పోస్టు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం, హిందీ, స్థానిక భాషల్లో అవగాహన ఉండాలి.
జీతం: మేనేజ్ ఫెలో పోస్టుకు రూ.75,000. ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు రూ.36,000.
వయోపరిమితి: మేనేజ్ ఫెలో పోస్టుకు 45 ఏళ్లు, ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు 40 ఏళ్లు మించకూడదు.
ఎంపిక విధానం: షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ, తదితరాల ఆధారంగా
గూగుల్ ఫాం ద్వారా దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 28
వెబ్‌సైట్: https://www.manage.gov.in/

దామోదరం సంజీవయ్య వర్సిటీలో ఉద్యోగాలు

విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. టీచింగ్: **16 ఖాళీలు**
2. నాన్ టీచింగ్: **3 ఖాళీలు**

పోస్టుల వివరాలు: ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, టీచింగ్ అసోసియేట్స్, రీసెర్చ్ అసిస్టెంట్స్, అకౌంట్స్ ఆఫీసర్, పర్సనల్ సెక్రటరీ, అసిస్టెంట్ రిజిస్ట్రార్
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం ఉండాలి.
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా
చిరునామా: దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ, న్యాయప్రస్థ, సబ్బవరం, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్.
దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 1
వెబ్‌సైట్: https://dsnlu.ac.in/

మీకు తెలుసా?



- ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) గురించి ఈ మధ్యకాలంలో ఎక్కువగా వినిపిస్తోంది. చాలా మంది ఇది కొత్తగా వచ్చిన టెక్నాలజీ అనుకుంటారు. బ్రిటన్‌కు చెందిన ఎలాన్ ట్యూరింగ్ అనే ఒక శాస్త్రవేత్త - కంప్యూటర్లకు ఇంటిలిజెన్స్ ఉంటుందా? లేదా అనే విషయాన్ని కనుగొనటానికి టర్నింగ్ టెస్ట్‌ను రూపొందించాడు. మనకు తెలిసిన తొలి ఏఐ ప్రొగ్రామ్ ఇదే! దీనిని 1956లో జరిగిన ఒక కాన్ఫరెన్స్‌లో దీనిని తొలి సారి ప్రదర్శించాడు.
- ఏఐ పూర్తిగా అందుబాటులోకి వస్తే ప్రపంచవ్యాప్తంగా పనిచేసే వారిలో 40 శాతం మందికి ఉద్యోగాలు ఉండవని.. వారి స్థానాలను ఏఐ భర్తీ చేస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.
- మానవుల మాదిరిగా పనిచేసే తొలి రోబో పేరు సోఫియా. దీనిని 2016లో తయారుచేశారు. ఇది మానవుల మాదిరిగానే మాట్లాడగలుగుతుంది. 2017లో దీనికి సౌదీ అరేబియా పౌరసత్వం కూడా ఇచ్చారు.





దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 337

	1			7			8	9
				6				
7		9	3					6
		2			6		7	
8	6	1				9	5	4
	3		8			2		
6					7	4		5
				1				
1	7			8			2	

సుడోకు - 336 సమాధానం

5	6	9	7	1	3	4	8	2
2	1	8	5	9	4	3	7	6
4	7	3	8	2	6	5	9	1
7	3	1	2	5	8	6	4	9
6	9	4	1	3	7	8	2	5
8	2	5	6	4	9	1	3	7
3	4	2	9	6	5	7	1	8
9	8	6	3	7	1	2	5	4
1	5	7	4	8	2	9	6	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.